www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 353
మంగళవారం | 7-4-2020 | పేజీలు: 8 + 4
శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి మ. 12.02 వరకు తదుపరి పౌర్ణమి; నక్షత్రం: ఉత్తర ఉ. 9.16 తదుపరి హస్త తె. 6.07 వరకు; వర్జ్యం: సా. 4.34-5.57; దుర్ముహూర్తం: ఉ. 8.37-9.26, రా. 10.16-11.02; అమృతఘడియలు: రా. 12.55-2.18; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 6.27
విజయవాడ సిటీ*
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore

| వరల్డోమీటర్ ప్రకారం సోమవారం రాత్రి 11:30 గంటలకు | కొత్త కేసులు | మరణాలు | బాధితులు |
|---|---|---|---|
| ప్రపంచం | 55,579 | 73,759 | 13,28,441 |
| భారతదేశం | 489 | 129 | 4,778 |
| ఆంధ్రప్రదేశ్ | 37 | 3 | 303 |
| తెలంగాణ | 30 | 11 | 364 |
| అమెరికా | 19,334 | 10,467 | 3,56,007 |



# ఇది సుదీర్ఘ పోరాటం

## అలసిపోవద్దు.. ఓడిపోయామనుకోవద్దు.. మనం గెలిచి తీరాలి

జనతా కర్ఫ్యూ, లాక్‌డౌన్.. ఇలా ఏ పిలుపు ఇచ్చినా ప్రజలు ఏకమై సంఘీ భావాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆదివారం రాత్రి లైట్లు ఆర్పి చమురు దీపాలు, కొవ్వొత్తులు వెలిగించి సంకల్ప శక్తిని చాటారు. ఇంత పెద్ద దేశంలో ఇంత క్రమశిక్షణ ప్రదర్శితం కావడం అమోఘం. లాక్‌డౌన్ సమయంలో ప్రజలు చూపుతున్న సంఘటితం, సీరియస్ స్పందన ముందెన్నడూ చూడనిది.

\- ప్రధాని నరేంద్ర మోదీ

- దేశమంతా ఒకే సంకల్పంతో ఉంది
- దీప ప్రజ్వలనతో ఇది రుజువైంది
- క్రియాశీలంగా వ్యవహరించాం
- ప్రపంచానికే మనం ఆదర్శం
- బీజేపీ సమావేశంలో మోదీ వ్యాఖ్యలు
- విపక్షాల విమర్శలపై ఎదురుదాడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారిని రూపుమాపేందుకు జరుపుతున్న పోరాటం సుదీర్ఘ కాలం ఉంటుందని, ఇందుకు అందరూ సంసిద్ధులు కావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 'ప్రజలెవరూ అలసిపోవద్దు... విశ్రమించవద్దు.. ఓడిపోయామన్న ఆలోచనే వద్దు. కరోనాపై మనం గెలవాలి.. గెలుస్తాం. గెలిచి తీరతాం. ప్రస్తుతం దేశ ప్రజలందరూ

మిగతా 8వ పేజీలో...

## ఎంపీల జీతభత్యాల్లో 30% కోత

- ఏడాది పాటు అమలు.. త్వరలో ఆర్డినెన్స్
- రెండేళ్లపాటు ఎంపీ ల్యాడ్స్ నిధులు రద్దు
- 7900 కోట్లు కరోనా సంఘటిత నిధికి
- కాంగ్రెస్, తృణమూల్ వ్యతిరేకత

8

## దశలవారీ ఎత్తివేత

- హాట్‌స్పాట్లలో 14 తరువాత కూడా
- ప్రణాళికలు సిద్ధం చేయండి: మోదీ
- స్కూళ్లూ తక్షణం తెరుచుకోవు ?
- వెంటనే ఎత్తివేతకు రాష్ట్రాలూ నో

# 300 దాటేసి

## రాష్ట్రంలో విజృంభిస్తున్న కరోనా



- సోమవారం 37 మందికి పాజిటివ్
- 303కు చేరిన వైరస్ బాధితులు
- అత్యధికంగా కర్నూలులో 74 కేసులు
- రాష్ట్రంలో మూడు మరణాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కరోనా మహమ్మారి వేగంగా విజృంభిస్తోంది. రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య ట్రిపుల్ సెంచరీని దాటేసింది. సోమవారం కొత్తగా 37 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో బాధితుల సంఖ్య 303కి చేరింది. వీటిలో దాదాపు నాలుగో వంతు... అంటే 74 కేసులు కర్నూలు జిల్లాలోనే నమోదయ్యాయి. అందులోనూ ఈ జిల్లాలో కేవలం రెండు రోజుల్లోనే 70 కేసులు వెలుగు చూశాయి. బాధితుల్లో అత్యధికులు ఢిల్లీ సమావేశాలకు వెళ్లిన వారు, వారి ద్వారా వైరస్ సోకిన వారే! సోమవారం కర్నూలు జిల్లాలో 53 పరీక్షల ఫలితాలు వెలువడగా.. వాటిలో 18 పాజిటివ్ కేసులు తేలాయి. మరో 67 నమూనాల ఫలితాలు పెండింగ్‌లో ఉన్నాయి. రేపో మాపో వాటిని కూడా

మిగతా 7వ పేజీలో...

## కరోనాతో చెలగాటం!

- కర్నూలులో లక్షణాలతో మృతి
- ఫలితానికి ముందే మృతదేహం అప్పగింత
- అంత్యక్రియలు చేసుకునేందుకు ఓకే
- 3 రోజుల తర్వాత పాజిటివ్‌గా నిర్ధారణ

7

## ఆరోగ్యశ్రీ పరిధిలోకి కరోనా

అనుమానిత కేసులకు రూ. 16,405

పాజిటివ్ రోగులకు రూ. 65,824

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

## రాష్ట్రాన్ని జల్లెడ పట్టండి

- ప్రతి ఒక్కరినీ పరీక్షించాలి
- వైరస్ లక్షణాలుంటే వైద్య సాయం
- పాజిటివ్ కేసులను వర్గీకరించాలి
- వయసులవారీగా ఆరోగ్య సమాచారం
- క్వారంటైన్, ఐసొలేషన్ వార్డుల్లో పూర్తి వసతులు కల్పించాలి
- 1902 కాల్స్‌పై దృష్టి సారించాలి: సీఎం

7

## వేసవి సెలవుల వరకు స్కూళ్ల మూత?

3

## బోధనాస్పత్రులన్నీ కరోనా సేవకే?

7

- ఆరోగ్యశాఖ అధికారుల సన్నాహాలు.. ఇప్పటికే రాష్ట్రంలో 4 కరోనా ఆస్పత్రులు
- అదే బాటలో 8 బోధనాస్పత్రులు కూడా!.. చిన్నారులు, గర్భిణుల వైద్యానికి ప్రత్యేక ఏర్పాట్లు



## ఇంటి స్థలాల మీద పడండి!

- పెండింగ్‌లో ఉన్న పనులు చేయండి
- కరోనాలేని చోట్ల రోడ్లెక్కాల్సిందే
- 'ప్రత్యేక అధికారి' ఆదేశం
- తహసీల్దార్లకు సమాచారం
- కరోనా వేళ వింత ఆదేశాలు
- సహాయ చర్యల్లో రెవెన్యూ బిజీ
- ఇప్పుడు ఈ గోలేమిటని విస్మయం

అమరావతి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కరోనా కలకలం రేపుతున్నా, లాక్‌డౌన్‌తో సర్వం స్తంభించినా.... ఇంటి స్థలాల సంగతి మాత్రం వదలొద్దని రాష్ట్ర సర్కారు నిర్ణయించుకుంది. "కరోనా తీవ్రత లేని ప్రాంతాల్లో రెవెన్యూ ఉద్యోగులు రోడ్డెక్కి ఇళ్ల స్థలాల పనులు చేపట్టాలి. లే అవుట్‌లను అభివృద్ధి చేయాలి" అని ఆదేశాలు జారీ చేసింది. ఈ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు సమాచారం ఇచ్చింది. పేరుకే అది సమాచారం. ఆచరణలో అదే సర్కారు ఆదేశంలా ఉంది. కరోనాను జీవ విపత్తుగా ప్రకటించిన తర్వాత దాదాపు రెవెన్యూ యంత్రాంగమంతా సహాయక చర్యల్లో పాల్గొంటోంది. అధికారులు, సిబ్బంది క్షణం తీరిక లేకుండా కరోనా కట్టడి పనుల్లో

మిగతా 3వ పేజీలో...

## ఉద్యాన రైతు కన్నీరు



### దిగుబడి ఆశాజనకం.. గిట్టుబాటు ధర శూన్యం

- దారుణంగా పడిపోయిన ధరలు.. కోత లేక చెట్లపైనే చీనీ, ద్రాక్ష
- పక్వానికి వచ్చినా పొలాలకే పరిమితం.. స్తంభించిన వాహన రవాణా
- అరకొర ఎగుమతులతో రైతు సతమతం



కళ్యాణదుర్గం ప్రాంతంలో కోత దశకు చేరుకున్న మామిడి పంట



చెట్టుకే పరిమితమైన దానిమ్మ

అనంతపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కరువు సీమలో ఉద్యాన పంటలు సిరులు కురిపిస్తాయి. గత రెండు మూడేళ్లుగా ఉద్యానపంటలే ఇక్కడి రైతుకు జీవనాధారమవుతున్నాయి. ఈసారి కూడా పండ్ల తోటల దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో అప్పుల నుంచి గట్టెక్కవచ్చన్న రైతన్న ఆశలను కరోనా మహమ్మారి చిదిమేసింది. పంట చేతికొచ్చే సమయంలోనే దేశమంతటా లాక్‌డౌన్ అమల్లోకి రావడంతో ఎగుమతులు, దిగుమతులు ఎక్కడివక్కడ స్తంభించిపోయాయి. పంటలను కొనే నాథుడే

మిగతా 3వ పేజీలో...



## కోర్టుల్లో ఆన్‌లైన్ విచారణ

- వీడియో కాన్ఫరెన్స్‌కు సుప్రీం చట్టబద్ధత
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రయోగం
- కరోనావైరస్ ప్రబలిన నేపథ్యంలో నిర్ణయం
- విధివిధానాలు హైకోర్టులు నిర్ణయించాలి
- మార్గదర్శకాలను జారీ చేసిన సుప్రీం

8

## కొవిడ్-19 మరణాల్లో వెంటనే బీమా సెటిల్మెంట్

జీవితబీమా కౌన్సిల్ ఆదేశాలు

## కరోనా బాధితుల్లో మహిళలు 24 శాతమే



- మృతుల్లో 63 శాతం 60 ఏళ్లు దాటిన వారే
- 30 శాతం 40-60 ఏళ్ల మధ్య వయస్కులు
- ఎక్కువగా వైరస్ సోకింది 21-40 ఏళ్ల వారికే
- మహమ్మారి 2, 3 దశల మధ్య ఉన్న భారత్
- 24 గంటల వ్యవధిలో 704 కేసులు: కేంద్రం
- 129కు చేరిన మృతుల సంఖ్య, 'మహా'లోనే 52
- కొవిడ్ -19 ఉధృతితో ముంబైలో కలవరం
- గుజరాత్‌లో 14 నెలల చిన్నారికి వైరస్
- ఎలా వచ్చిందో తెలియక అధికారుల ఆందోళన
- వ్యాధిగ్రస్థులు ఎవరిపైనైనా ఉమ్మితే హత్యాయత్నం కేసు: హిమాచల్ డీజీపీ
- ముంబైలో ముగ్గురు వైద్యులు, 26 మంది నర్సులకు కరోనా

8

తెలంగాణలో మరో 30 కరోనా కేసులు.. 364కు చేరిన బాధితుల సంఖ్య



## కరోనా కట్టడికి.. మరో నెల రోజులు

ప్రవాసాంధ్ర వైద్యుడు డాక్టర్ రవి నల్లమోతు

2



## అమెరికాలో నలుగురు భారతీయులు బలి

ప్రతి నాలుగు ఆస్పత్రుల్లో మూడుచోట్ల కరోనా బాధితులే

- 70 వేలకు చేరిన ప్రపంచ మృతులు
- అందులో 50 వేలు యూరప్‌లోనే
- స్పెయిన్, ఇటలీల్లో తగ్గిన మరణాలు
- ఈక్వెడార్‌లో పూడ్చటానికి పెట్టెల్లేవ్
- చైనాలో కేసులు మళ్లీ ఉధృతం
- కోలుకొంటున్న బ్రిటన్ ప్రధాని
- నటి ఫెర్రో, నటుడు బెనెడిక్ట్ మృతి

కరోనా హాట్‌స్పాట్ అమెరికాలో నలుగురు భారతీయులు చనిపోయారు. వీరంతా న్యూయార్క్‌లో స్థిరపడిన వారే. మృతుల్లో 21 ఏళ్ల యువకుడు కూడా ఉన్నాడు. ఇక ప్రపంచవ్యాప్తంగా కరోనా కోరలు విస్తరిస్తూనే ఉన్నాయి. కేసులు 13.28 లక్షలకు చేరుకోగా... మరణాలు 73 వేలను దాటాయి. చైనాలో మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్నాయి.

2

## ఏ లక్షణాలు లేకుండానే కరోనా!

- ఇంక్యుబేషన్ కాలపరిమితి 14 రోజులు
- 19 రోజుల తర్వాత కూడా కేరళ విద్యార్థిని శరీరంలో వైరస్!
- పాజిటివ్‌గా తేలినా కనిపించని లక్షణాలు
- శాస్త్రవేత్తల్లో ఆందోళన కలిగిస్తున్న కేసు

2



8

## న్యూయార్క్‌లో ఆడపులికి వైరస్

బెల్జియంలో పిల్లికి, హాంకాంగ్‌లో కుక్కకు

# మృత్యోర్మా అమృతంగమయ



## పరంజ్యోతి



హిమాలయాల అంచుల్లో అరుణాద్రి ఖండాన్ని హిమదీపుడు అనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఎవరైనా భారతదేశంలోకి ప్రవేశించాలంటే అది ఒక హద్దు. ఆ రాజ్యానికి ఉత్తర దిక్కున కిరాత దేశం. ఎవ్వరూ జయించలేనంత బలసంపన్నమైన దేశం అది. కిరాత దేశవాసుల జీవనవిధానం, ఆహారపుటలవాట్లు చాలా వింతగా జంతువుల అలవాట్లను పోలి ఉండేవి. వంట అనేది తెలియదు. ఆకలేస్తే అక్కడికక్కడే ఏ జంతువు కనబడితే ఆ జంతువును సింహమైనా, పులైనా, జింకైనా సరే.. రాళ్లతో, ఎండు కట్టెలతో కొట్టి చంపి అక్కడే తినేవారు. వాటి చర్మాన్ని జాగ్రత్తగా వలిచి ఇరుగు పొరుగు దేశాలకు వస్తుమార్పిడి పద్ధతిలో అమ్మి.. వచ్చిన డబ్బుతో బంగారం, రత్నాలు కొని దాచి పెట్టడం వాళ్ల అలవాటు. వారి ఆహారపుటలవాట్ల వల్ల ఎన్నో అరుదైన మృగ జాతులు అంతరించిపోయాయి. ఇక.. అరుణాద్రిలో ప్రజలకు ఖనిజ సంపదలను పోగుచేసి ఆ ఖనిజాలను కరిగించి రకరకాల పాత్రలను చేసి పొరుగు రాజ్యాలకు విక్రయించే చేసే అలవాటుంది. దీనితో పాటు దగ్గర ఉన్న అడవుల్ని కాల్చి వచ్చిన బొగ్గును విక్రయించి బంగారం పోగుచేసేవారు. అయితే వీళ్లలో ఉన్న ఒక్క చేతన తాము భారతదేశపు సంతానం అని. రాను రానూ కిరాతదేశంలో జనాభా పెరుగుతుండటం వల్ల అరుణాద్రిని ఆక్రమించడానికి ఒక పథకం పన్నారు కిరాతపాలకులు. తాము తిన్న జంతు కళేబరాలను గుట్టలు, గుట్టలుగా అరుణాద్రి చుట్టూ వెదజల్లడం మొదలు పెట్టారు. కుళ్లిన ఆ మాంసం నుంచి పుట్టిన పురుగులు, క్రిములు వల్ల అరుణాద్రి వాసులంతా చెప్పలేని వింత వ్యాధులకు గురై మరణిస్తున్నారు. ఆ వ్యాధులు పొరుగు రాజ్యాలకు కూడా సోకుతున్నాయి. ప్రజలంతా భయభ్రాంతులౌతున్నారు. ఆ సమయంలో హిమాలయాల్లో సంచరిస్తున్న పతంజలి మహర్షి అరుణాద్రికి చేరుకుని విషయం అంతా తెలుసుకున్నాడు. కొంచెం సేపు ఆలోచించి రాజు హిమదీపునితో ఇలా చెప్పాడు. "ఈ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడాలి. మనుషులు బతకడమే కాదు. దేశమూ బతకాలి. అరుణాద్రి మాత్రమే కాదు. యావద్భారతావని అమృత భూమి కావాలి. సమస్యకు ఒక జీవితం ఉన్నది. మనిషి జీవితంతో పోలిస్తే దాని జీవితం స్వల్పం అని భావించాలి. మీ ప్రస్తుత సమస్యకు ఒక వ్యూహం చెబుతాను. మీకు పడమటి దిక్కు నుంచి తూర్పు దిక్కుకి గంగతోపాటు పన్నెండు నదులు ప్రవహిస్తున్నాయి. ముందుగా మీకు, కిరాతదేశానికి మధ్యలో ఒక పెద్ద అఖాతాన్ని తవ్వండి.ఆ జంతుకళేబరాలను ఆ అఖాతంలో వెయ్యండి. వాటిపై.. పర్వతాలలా పేరుకుపోయిన ఖనిజపు నిల్వలను, వాటిపై బొగ్గు నిల్వలను నింపండి. దాని వల్ల మీకూ దేశంలో కాలుష్యం తగ్గుతుంది. ఆ గోతుల మీదుగా ఆ పన్నెండు నదులను ప్రవహింపజేయండి. ఆ నదుల ద్వారా వచ్చిన జలచరాలు జంతువుల మాంసఖండాల నుంచి చిన్న పురుగుల వరకూ అన్నింటినీ తినేస్తాయి. మీరు గోతిలో వేసిన బొగ్గు రాశులు ఆ నదీ జలాలను శుభ్రం చేస్తాయి. ఇది ఒక దశ. ఇక రెండవ దశలో నూట ఎనిమిది ఓషధుల పేర్లను మీకు చెబుతాను. వాటి సమిధలతో ఇంటింటా, దేశమంతటా యజ్ఞాలను నిర్వహించండి. దానివల్ల ఏర్పడిన ధూపం సర్వ విధ క్రిమి సంహారకం. అలాగే యోగంలో ప్రాణాయామం విధానాలను అభ్యసించండి. నేను చెప్పిన ఓషధులను సేవించండి. మీలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శ్వాసకోశ వ్యవస్థ దృఢమౌతుంది. మాంసాహారాన్ని కొంతకాలం విడిచి పెట్టండి. శాకాహారాన్ని అలవాటు చేసుకోండి. త్వరలోనే అంతా సరవుతుంది." అని చెప్పాడు. హిమదీపుడు ప్రజలనందరినీ జాగృతపరిచి పతంజలి ముని చెప్పినట్టే ఆచరింపజేశాడు. అనతికాలంలోనే అరుణాద్రి మృత్యుముఖం నుంచి బయటపడింది. మహర్షి మాటలవల్ల అమృతమయం అయింది. శుభ్రత పాటించడం, ప్రాణాయామం వంటివి శరీరానికి, ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో చెప్పే కథ ఇది. అంతేకాదు.. సమస్య ఎల్లకాలమూ ఉండదని ధైర్యం చెప్పి భరోసా ఇచ్చే కథ.

**- ఆచార్య రాణి సదాశివ మూర్తి**

## లోకం తీరు




### ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 36.7 | 26.6 |
| కడప | 40.0 | 20.0 |
| విశాఖపట్నం | 36.0 | 25.4 |
| గుంటూరు | 36.8 | 25.5 |
| విజయవాడ | 38.4 | 26.2 |
| కర్నూలు | 40.4 | 28.9 |

## నేటి నుంచి వర్షాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ద్రోణి ప్రభావంతో సముద్ర తేమగాలులు, పడమర నుంచి పొడి గాలులు కోస్తాపైకి రానున్నందున వాతావరణ అనిశ్చితి ఏర్పడనున్నది. దీంతో రెండు రోజుల్లో ఉత్తర కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల, దక్షిణ కోస్తాలో అక్కడక్కడా వర్షాలు, ఉత్తర కోస్తాలో బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తరువాత రెండు రోజుల్లో కూడా ఉత్తర కోస్తాలో వర్షాలు కురుస్తాయని తెలిపింది.

# దాతృత్వం పరిమళిస్తోంది

- కాకినాడ సీ పోర్టు రూ.1.10 కోట్లు
- సీఎంఆర్ఎఫ్‌కు 'ఉంగుటూరు' విరాళం కోటి
- రూ.కోటి ఇచ్చిన చైతన్య విద్యా సంస్థలు
- కిమ్స్ హాస్పిటల్స్ సాయం కోటి
- పీఎం కేర్స్‌కు కోటి ఇచ్చిన 'గోకరాజు'



సీఎం జగన్‌కు చెక్ అందజేస్తున్న 'కిమ్స్' ఆసుపత్రి ఎండీ భాస్కరరావు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): కోవిడ్-19పై పోరుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి ఉంగుటూరు ప్రజలు, వాణిజ్యవేత్తలు కలిసి విరాళంగా రూ1,04,07,838 అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌కు అందజేశారు. అలాగే చైతన్య విద్యా సంస్థల తరఫున డైరెక్టర్ శ్రీధర్ సీఎంజగన్‌కు రూ.కోటి విరాళాన్ని అందజేశారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పీఎం-కేర్స్‌కు మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు రూ.కోటి విరాళంగా ఇచ్చారు. రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్‌కు ఈ చెక్కు అందజేశారు. లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత వేములపల్లి రవికిరణ్ రూ.38 లక్షలు పీఎం కేర్స్‌కు విరాళంగా ఇచ్చారు. ఈ చెక్కును ఎన్‌హెచ్ పీడీ విద్యాసాగర్‌కు అందజేశారు. కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ బీ భాస్కరరావు చెక్కును సీఎంకు అందజేశారు. కాకినాడలోని తన మిత్రులు, వాణిజ్యవేత్తలు కలిసి రూ.1.50 కోట్లు సీఎంఆర్ఎఫ్‌కు విరాళం ఇచ్చారని నగర ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. సీ పోర్ట్ సంస్థ రూ.1.10 కోట్లు విరాళం ఇచ్చిందన్నారు. మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర, ఆయన కుమారుడు రూ.10 లక్షలు, కృపానంద సర్వీసెస్ లిమిటెడ్ రూ.10 లక్షలు అందజేయగా, లారీ ఓనర్స్ అసోసియేషన్ రూ.5 లక్షలు, హోటల్స్ అసోసియేషన్ రూ.లక్ష, పురుషోత్తమ్ రూ.1.10 లక్షలు, చుండ్రు శ్రీరాములు రూ.లక్ష, చోడే అనిల్ రూ.లక్ష, ప్రసాద్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారన్నారు. లూథరన్ చర్చి రూ.లక్ష, బ్రహ్మకుమారీస్ రూ.లక్ష, డాక్టర్ చౌదరి రూ.లక్ష అందజేశారన్నారు. డక్కన్ టుబాకో కంపెనీ గ్రూప్ రూ.25 లక్షల విరాళాన్ని ప్రకటించింది. గ్రూప్ డైరెక్టర్ షఫిఖాన్ రూ.25 లక్షల చెక్కును పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు అందించారు. శ్రీశైల దేవస్థానం రెగ్యులర్ ఉద్యోగులు తమ ఒక రోజు వేతనం రూ.2,32,000 ఈవో కేఎస్ రామరావుకు అందజేశారు.

### ఐఎఫ్ఎస్ అధికారులు 6.5లక్షలు

ఏపీ ఐఎఫ్ఎస్ అధికారుల సంఘం రూ.6.50లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేసింది. సీఎం జగన్‌ని కలిసిన అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి ప్రతీప్ కుమార్, ఉద్యాన శాఖ కమిషనర్ చిరంజీవ్‌చౌదరి, ఏపీ ఎస్టీఎఫ్టీసీ ఈడీ బీఎన్ఎన్ మూర్తి విరాళం చెక్కును అందజేశారు. సాగర్ సిమెంట్స్ గ్రూప్ రెండు రాష్ట్రాల సీఎంల సహాయ నిధికి రూ.కోటి విరాళం ప్రకటించింది.

### కేఆర్‌పీఎల్ విరాళం రూ.25 లక్షలు

కాళీశ్వరి రిఫైనరీ ప్రయివేట్ లిమిటెడ్ రూ.25 లక్షలను సీఎంఆర్ఎఫ్‌కు అందించింది. కాకినాడలోని సంస్థ జీఎం, ఆపరేషన్స్ గణపతి, మంత్రి కురసాల కన్నబాబుకు చెక్కును అందించారు.

### కృష్ణంరాజు రూ.10లక్షల విరాళం

కరోనాపై పోరాటం కోసం సీనియర్ నటుడు కృష్ణంరాజు రూ.10 లక్షలు విరాళాన్ని సోమవారం పీఎం కేర్స్‌కు పంపించినట్లు తెలిపారు. లాక్ డౌన్‌తరుణంలో తన వంతుగా 'మా' లోని 100 కుటుంబాలను దత్తత తీసుకుని ఒక్కో కుటుంబానికి రూ.10,000 చొప్పున రూ. 10 లక్షలు ఆర్థిక సాయం చేయడానికి ముందుకొచ్చారు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు వీకే నరేశ్. అలాగే కరోనా క్రైసిస్ చారిటీ (సీసీసీ)కి రూ. 1 లక్ష విరాళం అందజేస్తున్నట్లు నరేశ్ ప్రకటించారు. సత్యసాయి ఆర్ట్స్ అధినేత కె.కె.రాధామోహన్ సీసీసీకి రూ.3లక్షలు విరాళం ప్రకటించారు. వెయ్యికిపైగా నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను హీరో గోపీచంద్ అందజేశారు.

# కరోనా కట్టడికి.. మరో నెల!

- ప్రవాసాంధ్ర వైద్యుడు

**డాక్టర్ రవి నల్లమోతు**



ప్రపంచవ్యాప్తంగా మరో నెల రోజుల పాటు కరోనా తీవ్రత కొనసాగే అవకాశం ఉందని ప్రవాసాంధ్ర వైద్యుడు, అమెరికాలోని అలబామా రాష్ట్రం.. సౌత్‌ఈస్ట్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ రవి నల్లమోతు తెలిపారు. భారతదేశంలో లాక్‌డౌన్ నిర్ణయం సత్ఫలితాలనిస్తున్నదంటున్న ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ముచ్చటించింది.

### అమెరికాలో కరోనా తీవ్రత ఎలా ఉంది?

న్యూయార్క్‌లో కరోనా తీవ్రత పతాకస్థాయికి చేరింది. ప్రభుత్వం నేరుగా లాక్‌డౌన్ ప్రకటించనప్పటికీ.. అమెరికాలోని చాలా రాష్ట్రాల్లో సాధారణ జనజీవనం నిలిచిపోయింది. నేనుంటున్న అలబామాతో పాటు చాలా రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. కరోనా నిర్ధారణ పరీక్షల్లో జాప్యం, వైద్యపరికరాల కొరత వంటి కారణాలతో అమెరికాలో దీని తీవ్రత మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక్కడ అంతర్జాతీయ విమానాలు చాలావరకు నడుస్తున్నాయి. కొవిడ్-19ను కట్టడి చేయలేకపోవడానికి ఇది కూడా కొంత కారణమనే ఆందోళన వ్యక్తమౌతోంది.

### మీరు ఇటీవలే భారత్ వచ్చినట్టున్నారు?

నెల రోజుల సెలవులపై మార్చి ప్రారంభంలో భారత్‌కు వచ్చాను. హైదరాబాద్‌లో పుట్టి, పెరిగాను. గాంధీ ఆస్పత్రిలో మెడిసిన్ చేశాను. పదేళ్లుగా అమెరికాలో సేవలందిస్తున్నాను. భారత్‌లో లాక్‌డౌన్ విధించిన వెంటనే ఇక్కడకు అత్యవసరంగా రమ్మని పిలుపు రావడంతో తిరిగి అమెరికా చేరుకున్నాను.

### కొవిడ్‌పై అమెరికా సన్నద్ధత ఎలా ఉంది?

నిన్న, మొన్నటి వరకు చాలా రాష్ట్రాల్లో అమెరికా వైద్యులకు వ్యక్తిగత సంరక్షణ కిట్లు అందుబాటులో లేవు. దీంతో వైద్యులు పాలిథిన్ ట్రాష్ బ్యాగులను రక్షణ దుస్తులుగా ధరించిన సందర్భాలున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో మాస్కుల కొరత తీవ్రంగా ఉంది. న్యూయార్క్ వంటి రాష్ట్రాల్లో వేగంగా కరోనా నిర్ధారణ పరీక్షలు జరుగుతుండగా, ఇతర రాష్ట్రాల్లో ఒకటి, రెండు రోజులు పడుతోంది.

### అమెరికాలో లాక్‌డౌన్ లేకపోవడం.. భారత్‌లో విధింపును మీరెలా చూస్తారు?

భారత్‌లో లాక్‌డౌన్ విధించి ప్రభుత్వం చాలా మంచి పని చేసింది. వైద్యసౌకర్యాలు నామమాత్రంగానే ఉన్న భారత్‌లో కరోనా విజృంభిస్తే నిస్సహాయంగా చూడడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి. అమెరికా పరిస్థితి వేరు. లక్షలాది పర్యాటకులు అమెరికాను సందర్శించే సీజన్ ఇది. పైగా ఇక్కడ ఉద్యోగులు జీతంగా అర్జించే మొత్తాన్ని పైసా కూడా మిగుల్చుకోకుండా ఖర్చు చేసుకోవడానికి అలవాటుపడ్డారు. జీతాలు రాకపోతే అలజడి ఏర్పడి, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని ప్రభుత్వం భావించింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అమెరికా లాక్‌డౌన్ ప్రకటించలేకపోయింది. అదే అమెరికాకు, ప్రధానంగా న్యూయార్క్ వంటి నగరాలకు సమస్యగా మారింది.

### కరోనాకు పూర్తిస్థాయి పరిష్కారం ఎప్పుడని భావిస్తున్నారు?

అమెరికాతో పాటు పలు దేశాల్లో కరోనా ప్రస్తుతం పతాకస్థాయికి చేరింది. ఈ స్థితి నుంచి ఒక్క కరోనా కేసు కూడా లేని స్థితికి రావడానికి కనీసం నెల రోజుల వ్యవధి అయినా పడుతుంది. భారత్ వంటి దేశాల్లో మరిన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోతే మే చివరికల్లా కరోనా తీవ్రత పెరిగే ప్రమాదముంది. సామాజిక దూరం పాటించడం, వీలైనంత మేరకు పరిశుభ్రత చర్యలు పాటించడం మనందరి ముందున్న తక్షణ కర్తవ్యం.

-స్పెషల్ డెస్క్



## సీజనల్ వ్యాధిగా మారనున్న కరోనా

కరోనా వైరస్ సీజనల్ వ్యాధిగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ వైరస్‌ను ఈ ఏడాది భూమండలంపై పూర్తిగా అరికట్టలేం. అమెరికాలో వచ్చే ఫ్లూ సీజన్‌లో కరోనా మళ్లీ విజృంభించే అవకాశం ఉంది. అందుకే దీనికి వ్యాక్సిన్‌ను కనిపెట్టే పనిలో అమెరికా ఉంది. లాక్‌డౌన్ పాటించని ప్రాంతాలకు ప్రమాదం ఎక్కువగా పొంచి ఉంది.

- డా.ఆంథోనీ ఫౌసీ, ప్రముఖ అమెరికా వైద్యుడు



## రాజకీయాలు, మతాలతో తావు లేని జీవితాన్ని భారత్ నేర్చుకుంది

కరోనాపై పోరు కులమతాలు, రాజకీయాలకు అతీతంగా యావత్ దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చింది. రాజకీయాలు, మతాల ప్రస్తావన లేకుండా జీవించడాన్ని భారత్ నేర్చుకుంది. ఎన్నికల సమయంలోనూ ఇదే విధంగా మెలుగుతూ దృఢ భారతదేశ నిర్మాణంపై దృష్టిసారించాలి.

- జి.మాధవన్ నాయర్, ఇస్రో మాజీ చైర్మన్

## ఆర్థిక మాంద్యం దిశగా ప్రపంచ దేశాలు!

కరోనా కల్లోలం.. లాక్‌డౌన్‌లతో ప్రపంచ దేశాల్లో ఆర్థిక పరిస్థితి అతలాకుతలం అవుతోంది. దీంతో పలు దేశాలు ఉద్దీపన ప్రకటనలు చేస్తున్నాయి. జపాన్‌లో ప్రధాని షింజో అబే సోమవారం 'అత్యవసర స్థితి'పై నిర్ణయం తీసుకుంటామన్నారు. మంగళవారం దీనిపై రాష్ట్రాల గవర్నర్లు అధికారిక ప్రకటనలు చేయనున్నారు. రూ.77 లక్షల కోట్లతో ఉద్దీపన పథకాలను ప్రకటించారు. టోక్యో, ఒసాకా నగరాల్లో కరోనా కేసులు పెరుగుతుండటంతో.. ఎమర్జెన్సీ అనివార్యంగా మారిందన్నారు. నగరాలను మూసివేయబోమని, ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించేవారిపై చట్టపరమైన చర్యలేమి ఉండవని తెలిపారు. జపాన్‌లో సోమవారం సాయంత్రం వరకు 3,650 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఫ్రాన్స్‌లో లాక్‌డౌన్ కారణంగా ఆ దేశం ఆర్థిక మాంద్యం దిశగా పయనిస్తోంది. రెండో ప్రపంచయుద్ధం కాలంలో ఆర్థిక వృద్ధిరేటు -2.2గా ఉండేది. 2008 ప్రపంచ ఆర్థిక మాంద్యం తర్వాత మళ్లీ ఆ పరిస్థితులను ఫ్రాన్స్ ఎదుర్కోగా.. ఇప్పుడు కరోనా మరింత దిగజారిపోయే ప్రమాదముందని ఆ దేశ ఆర్థిక మంత్రి బ్రూన్ లా మారీ చెప్పారు. గత నెల 17 నుంచి లాక్ డౌన్ కొనసాగుతోంది. 49 బిలియన్ డాలర్ల లోన్ గ్యారెంటీ, ఆర్థిక సాయం కోసంఎదురుచూస్తోంది. సింగపూర్ కూడా కరోనా వల్ల దెబ్బతిన్న ఆర్థిక పరిస్థితికి ఊతమిచ్చేందుకు అదనపు బడ్జెట్‌ను ప్రకటించింది. ఉపాధి కోల్పోయిన ఉద్యోగులు, కార్మికులతోపాటు.. వృద్ధులకు నెలవారీగా ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. రూ.322.44 కోట్లు వెచ్చించనుంది. వృద్ధులకు నెలకు రూ.32,399 చొప్పున అందజేస్తామని ప్రకటించింది.

# ప్రపంచాన్ని కబళిస్తున్న కరోనా

- 70వేలకు చేరిన ప్రపంచ మృతులు
- న్యూయార్క్‌లో భారతీయులు బలి



అమెరికాలో కరోనా మృతులను ట్రక్కుల్లో తరలిస్తున్న దృశ్యం

పారిస్, ఏప్రిల్ 6: ప్రపంచ వ్యాప్తంగా 70 వేల మందిని కరోనా బలితీసుకొంది. యూరోప్‌లో అత్యధికంగా 50,125 మంది మృత్యువాత పడ్డారు. 15,877 మరణాలతో ఇటలీ, 13,055 మరణాలతో స్పెయిన్, 8,078 మరణాలతో ఫ్రాన్స్ విషాదంలో కూరుకుపోయాయి. యూరోప్‌లో ఒక్కరోజే 1100 మంది చనిపోయారు. పాజిటివ్‌తో ఆస్పత్రిలో చేరిన బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ పరిస్థితి మెరుగుపడుతోందని వైద్యులు తెలిపారు. ఇంగ్లండ్ రాణి ఎలిజబెత్ వీడియో లింకు ద్వారా కామన్‌వెల్త్ దేశాలను అప్రమత్తం చేశారు. పలు సూచనలు చేశారు. కాగా, ఇక్కడ సోమవారం 439 మంది కరోనాతో మృతి చెందారు. దీంతో మరణాలు 5,373 మందికి చేరాయి. స్పెయిన్, ఇటలీలో 24 గంటల్లో వరుసగా 637, 636 మంది చనిపోయారు. ఒకదశలో ఒక్కరోజే 950 మరణాలను చూసిన స్పెయిన్‌లో గత రెండు వారాల్లో తొలిసారిగా సోమవారమే తక్కువ మరణాలు నమోదయ్యాయి. లక్ష పాజిటివ్ కేసుల జాబితాలో జర్మనీ చేరిపోయింది. ఇప్పటికి 1500 మంది చనిపోయారు. తమదేశంలో పనిచేస్తున్న దాదాపు 20 వేల మంది విదేశీయులను సింగపూర్ ప్రభుత్వంలో క్వారంటైన్ చేసింది. పాకిస్థాన్‌లో ఇప్పటికి 3,277 పాజిటివ్ కేసులు బయటపడగా, 1500 కేసులు ఒక్క పంజాబ్ ప్రావిన్సీలోనే నమోదయ్యాయి. చైనాలో రెండో విడత కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటికి 38 పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. కరోనా వైరస్ ఔషధం విషయంలో ఫ్రాన్స్ కూడా అమెరికా బాటపట్టాలని అక్కడి ప్రజలు ఉద్యమిస్తున్నారు. తమకు హైడ్రాక్సీ క్లోరోక్విన్ ఔషధం ఇచ్చేలా వైద్యులకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ ఏకంగా 2.15 లక్షల మంది తమ సంతకాలతో అక్కడి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సరిహద్దులు మూసుకుపోయి.. ఎక్కడికక్కడ కంచెలు మొలుస్తున్న కాలంలో సిగరెట్లు అమ్మడానికి ఫ్రాన్స్ నుంచి స్పెయిన్‌కు బయలుదేరిన ఓ వ్యాపారిని సరిహద్దుల్లో రక్షించి ఫ్రాన్స్ అధికారులు జరిమానా విధించారు.

అమెరికాలోని ప్రతి నాలుగు ఆస్పత్రుల్లో మూడు కరోనా బాధితులతో నిండిపోయాయి. వీటి ల్లో పరీక్షలు చేసే సామర్థ్యం నామమాత్రంగా ఉండటమే కాదు, పాజిటివా, నెగిటివా అనేది తేలి తత్సంబంధమైన చికిత్సను ప్రారంభించడానికి కావాల్సిన ల్యాబ్‌ల నివేదికల విడుదలా జాప్యం అవుతుందట! న్యూయార్క్‌లోని ఆస్పత్రుల సిబ్బంది, కార్యకర్తలు.. వైద్య పరికరాల కొరత, అరకొర రక్షణ సామగ్రితో తాము మహమ్మారితో యుద్ధం చేస్తున్నామని పేర్కొనడం గమనార్హం! 'ఇప్పటిదాకా మనం అనుభవించింది ఒక ఎత్తు. దుర్భరమైన రోజులను వచ్చే వారంలో గడపనున్నాం' అని అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. మర

### అమెరికాలో మృత్యుఘోష

ణాలు ఈ వారంలోనే పదివేలకు చేరొచ్చునని సర్జన్ జనరల్ వైస్ అడ్మిరల్ జెరోమ్ ఆడమ్స్ చెప్పారు. హృదయ సంబంధ వ్యాధుల నిపుణుడు డాక్టర్ జగ్‌సింగ్ న్యుమోనియాతో బాధపడుతుండగా కరోనా లక్షణాలు కనిపించాయి. మసాచుసెట్స్ జనరల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వైద్యులకు ఆయన పూర్తిగా సహకరించడంతోపాటు ప్రయోగాత్మక దశలో ఉన్న కరోనా నియంత్రణ ఔషధం రెమిడీసివీర్‌ను తనపై పరీక్షించడానికి సంతోషంగా అంగీకరించారు. అమెరికాలో ప్రజలు ఇప్పుడు జాగ్రత్తల బాటపట్టారు. భౌతికదూరం పాటించడంతోపాటు కరచాలనాలకు గుడ్‌బై చెప్పారు. గుంపులకు, గ్రూపులకు కూడా దూరం పాటిస్తున్నారు. తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాల్లో తమ జీవనోపాధిపై ఆవేదన చెందుతున్నారు.



## 'చేతిపట్టు'లో మధుమేహం గుట్టు

వాషింగ్టన్, ఏప్రిల్ 6: టైప్-2 మధుమేహం ముప్పును ముందస్తుగా అంచనా వేయడానికి రోగి 'చేతిపట్టు'లోని బలాన్ని ఓ ప్రమాణంగా తీసుకోవచ్చని అమెరికాలోని ఓక్లాండ్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. సాధారణంగా టైప్-2 మధుమేహ బాధితుల్లో కండరాల బలహీనత ఉంటుంది. ఫలితంగా వారి ముంజేయి, కాలి పిక్కల్లోని కండరాల్లో మునుపటిలా సత్తువ ఉండదు. ఈ బలహీనత లోలోపల బాగా ముదిరితే కానీ బయటపడదు. అయితే 'హ్యాండ్‌గ్రిప్ డైనమో మీటర్' పరికరంతో ఎప్పటికప్పుడు చేతిపట్టు బలాన్ని తెలుసుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. తద్వారా టైప్-2 మధుమేహం ముసురుకోక ముందే తగిన వైద్యం, ఔషధాలతో దానికి అడ్డుకట్ట వేయవచ్చని వైద్యులకు సూచించారు.

## కరోనాను నిలువరించే సూక్ష్మజీవ నిరోధక పూత

- జేఎన్‌సీఏఎస్ఆర్ శాస్త్రవేత్తల అభివృద్ధి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 : కరోనా వైరస్‌ను నిలువరించగల 'సూక్ష్మజీవ నిరోధక పూత'ను బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రిసెర్చ్(జేఎన్‌సీఏఎస్ఆర్) శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. వైద్యులు వాడే మాస్కులు, గౌన్‌లు, గ్లోవ్‌లు, ఫేస్ షీల్డ్‌లకు ఈ పూతను అద్దితే.. దానిని దాటి లోపలికి వైరస్ ప్రవేశించే అవకాశం ఉండదని వెల్లడించారు.

## తెలంగాణలో మరో 30 కరోనా కేసులు

- 364కి చేరిన బాధితుల సంఖ్య

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సోమవారం మరో 30 కరోనా వైరస్ కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ మర్కజ్ మసీదుతో సంబంధం ఉన్నవేనని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. తాజా కేసులతో రాష్ట్రంలో కరోనా వైరస్ పాజిటివ్‌ల సంఖ్య 364కు చేరింది. నమోదైన మొత్తం కేసుల్లో అత్యధికం(133) హైదరాబాద్‌లోనే ఉన్నాయి. నిజామాబాద్‌లో 26 కేసులు, మేడ్చల్‌లో 15, వరంగల్ అర్బన్‌లో 23, గద్వాలలో 13 కేసులు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో 10, భద్రాద్రిలో 2, జగిత్యాలలో 3, జనగాంలో 2, భూపాలపల్లి 1, కామారెడ్డి 8, కరీంనగర్ 7, మహబూబాబాద్ 1, మహబూబ్‌నగర్ 6, మెదక్ 5, ములుగులో 2, నాగర్ కర్నూల్ 2, నల్గొండ 13, నిర్మల్ 4, పెద్దపల్లి 2, రంగారెడ్డి 10, సంగారెడ్డి 7, సిద్దిపేట 1, సూర్యాపేట 8, వికారాబాద్ జిల్లాలో 4 కేసులు నమోదు అయ్యాయి. 308 యాక్టివ్ కేసులున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన బులిటెన్‌లో పేర్కొంది. తెలంగాణలో కరోనాతో ఇప్పటివరకు 11 మంది మరణించారు. హైదరాబాద్ పాతబస్తీకి చెందిన ఓ వృద్ధ మహిళ(68) అనారోగ్యం కారణంగా గత నెల 30న ప్రైవేటు ఆస్పత్రిలో మరణించారు. పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. కుటుంబీకులను పరీక్షించగా మొత్తం 15మందికి పాజిటివ్ ఉన్నట్లు గుర్తించారు. రెండు ఆస్పత్రులకు తరలించి చికిత్స కొనసాగిస్తున్నారు. అంత్యక్రియల్లో పాల్గొన్న బంధువులతో పాటు స్థానికుల్లో మరో 40 మందిని గుర్తించి పరీక్షిస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో మర్కజ్ మసీదుకు వెళ్లి వచ్చిన 150 మంది వివరాలు ఇంకా అందలేదు. వారి కోసం విస్తృత అన్వేషణ చేస్తున్నారు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక హెడ్ కానిస్టేబుల్‌కు కరోనా పాజిటివ్ వచ్చింది. ఆయనతోపాటు కలిసి పని చేసిన 12 మంది సిబ్బందిని, ఆయన కుటుంబ సభ్యులు పది మందిని క్వారంటైన్‌కు పంపారు. హెడ్ కానిస్టేబుల్‌కు ఎలాంటి ప్రయాణ చరిత్ర లేదు. మసీదులో ప్రార్థనలకు వెళ్లినపుడు వచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆయన ఎవరెవర్ని కలిశారు? ఉన్నతాధికారుల్ని ఎవరినైనా కలిశారా? అని శోధిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో తొలికేసు నమోదైంది. ఢిల్లీ, నోయిడాల్లో మకాం వేసి.. తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి వస్తుండగా.. తగ్లీబీ ప్రార్థనలకు వెళ్లివస్తున్నవారు ఆయన్ను కలిశారు. ఆయన పక్కనే కూర్చొని ప్రయాణం చేసిన మహబూబాబాద్ వాసికి కరోనా వచ్చిందని తెలుసుకొని, అప్పటి నుంచి ఇంటికే పరిమితం అయ్యారు.

## సంస్థలు జాబ్ ఆఫర్లు వాపస్ తీసుకోవద్దు :మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో విద్యార్థులకు ఆఫర్లు ఇచ్చిన కంపెనీలు కరోనా కారణంగా వాటిని ఉపసంహరించుకోవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. కేంద్ర హెచ్చార్డీ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిషాంక్ సోమవారం ఈ మేరకు కంపెనీలకు విజ్ఞప్తి చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలంపాటు దుష్ప్రభావం పడకుండా ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన చెప్పారు. కరోనా వైరస్ నేపథ్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఎంపికైన యువతలో ఎంతో ఆందోళన నెలకొన్న దృష్ట్యా ఆయా కంపెనీలకు తాను ఈ మేరకు విజ్ఞప్తి చేస్తున్నానని పోఖ్రియాల్ పేర్కొన్నారు.

## ఏ లక్షణాలు లేకుండానే కరోనా!

- 19రోజుల తర్వాతా కేరళ విద్యార్థిని శరీరంలో వైరస్!

పతనంథిట్ట, ఏప్రిల్ 6: కేరళలోని ఓ యువతిలో కరోనా వైరస్ భిన్నంగా ప్రవర్తించడం వైద్యుల్లో ఆందోళన కలిగిస్తోంది. అందుకు రెండు కారణాలున్నాయి. ఆమెకు ఎటువంటి కరోనా లక్షణాలు లేకుండానే పాజిటివ్‌గా రావడం ఒకటి కాగా.. కరోనా వైరస్‌కు ఇంక్యుబేషన్ కాలపరిమితి దాటి.. వైరస్ సోకిన 19రోజుల తర్వాత పాజిటివ్‌గా తేలడం రెండవది. పతనంథిట్టకు చెందిన 19ఏళ్ల యువతి, గత నెల 17న ఢిల్లీనుంచి తన స్వగ్రామానికి చేరుకుంది. కోవిడ్-19 హాట్‌స్పాట్ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించాలని కేరళ ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా.. ఆమెకు కూడా పరీక్షలు జరిగాయి. అందులో ఆమెకు కరోనా ఉన్నట్లుగా తేలింది. ఫలితాలు పాజిటివ్‌గా వచ్చిన తర్వాత కూడా యువతిలో ఎటువంటి కరోనా లక్షణాలు కనిపించకపోవడం వైద్యులను ఆందోళనకు గురిచేస్తోంది.

## మాస్క్‌పై వారందాకా కరోనా వైరస్ : శాస్త్రవేత్తలు

బీజింగ్: కరోనా ఇన్ఫెక్షన్ల భయంతో ఫేస్ మాస్క్‌ల వాడకం విపరీతంగా పెరిగింది. అయితే వాడిన మాస్క్‌లను ఎక్కడపడితే అక్కడ పారవేయడం ఎంతమాత్రం మంచిదికాదని హాంకాంగ్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఫేస్ మాస్క్‌లపై కరోనా వైరస్ వారందాకా ఉంటుందని.. జనసంచారం ఉండే ప్రదేశాల్లో వాటిని పారవేస్తే ఇంకొందరిలోకి అది ప్రవేశించే అవకాశాలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. మాస్క్‌ల వాడకంతో కరోనా ఇన్ఫెక్షన్ల రేటు గణనీయంగా తగ్గిందని అధ్యయనంలో గుర్తించారు.

### హైడ్రాక్సీ క్లోరోక్విన్‌ను, మెట్‌ఫార్మిన్‌తో

## కలిపి వాడితే ప్రాణాలకే ముప్పు!!

- ఎలుకలపై అమెరికా శాస్త్రవేత్తల ప్రయోగ పరీక్షల్లో వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 : మలేరియా నిరోధక ఔషధాలు హైడ్రాక్సీ క్లోరోక్విన్, క్లోరోక్విన్‌ల వాడకంతో కరోనా ఇన్ఫెక్షన్లకు అడ్డుకట్ట పడుతుందని సర్వత్రా చర్చ జరుగుతున్న తరుణంలో ఆందోళన రేకెత్తించే అంశాలతో ఓ అధ్యయన నివేదిక వెలువడింది. ఈ మందులను టైప్-2 మధుమేహ చికిత్సకు వాడే మెట్‌ఫార్మిన్ ఔషధంతో కలిపి వాడితే రోగి ప్రాణాలకే ముప్పు ఉంటుందని అది వెల్లడించింది. అమెరికాలోని లుడ్విగ్ ఇన్‌స్టిట్యూట్, ఎండీ యాండర్సన్ కేన్సర్ సెంటర్ శాస్త్రవేత్తల సంయుక్త బృందం ఆధ్వర్యంలో ఎలుకలపై ప్రయోగ పరీక్షల అనంతరం ఈవిషయాన్ని ప్రకటించింది. హైడ్రాక్సీ క్లోరోక్విన్, మెట్‌ఫార్మిన్‌లను ఏకకాలంలో కొన్ని ఎలుకలకు అందించగా.. వాటిలో 40 శాతం చనిపోయాయని తెలిపింది.

## వ్యోమగాముల 'గగన్‌యాన్' శిక్షణకు బ్రేక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: కరోనా సంక్షోభం నేపథ్యంలో నలుగురు భారత వ్యోమగాముల 'గగన్‌యాన్' శిక్షణకు తాత్కాలిక బ్రేక్ పడింది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రష్యా తెలిసింది. భారత్‌కు చెందిన వ్యోమగాములు మాస్కోలోని యూరీ గాగరిన్ రిసెర్చ్ అడ్ టెస్ట్ కాస్మోనాట్ శిక్షణ కేంద్రంలో ఫిబ్రవరి నుంచి శిక్షణ పొందుతున్నారు. గత వారం నుంచి అక్కడ శిక్షణ కార్యక్రమాలు జరగడం లేదు. మరో 4వారాలు ఇదే పరిస్థితి ఉండొచ్చని సమాచారం.

## ఇటలీలో జీతాల కోతల్లేవు: ప్రవాసీ రాయన్న

అమరావతి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): "ఇటలీలో కరోనా వైరస్ దాదాపు 16వేల మందిని పొట్టనపెట్టుకుంది. అయినప్పటికీ దేశంలో ఇప్పటి వరకు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల్లో కోతలు పెట్టలేదు. ఉద్యోగమేదైనా నెలకు 600 యూరోలు బోనస్ ఇస్తున్నారు" అని దాసరి రాయన్న తెలిపారు. ఆయన గత 16 ఏళ్లుగా ఆ దేశంలోని 'పడోవ వెనెతో' ప్రాంతంలో ఉంటున్నారు. గుంటూరు జిల్లా నరసరావుపేట మున్సిపల్ పరిధిలోని రావిపాడుకు చెందిన ఆయన, 2004లో ఇటలీకి వెళ్లి ఓ బేకరీలో పనిచేస్తున్నారు. ఆయన సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి వివరించారు. రోడ్ల పైనే శవాలు గుట్టలుగా పడి ఉంటున్నాయన్న వార్తల్లో నిజం లేదని పేర్కొన్నారు.

కరోనా కల్లోలం



**మేత కోసం మేక**

నది మధ్యలో...మేక వెనుక మేక...అలా నడుకుంటూ వెళుతున్న ఈ దృశ్యం చూశారా. గోదావరిలో నీటిమట్టం తగ్గడంతో మేకలు మేత కోసం లంకల బాట పట్టాయి. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈదృశ్యం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. (ఫొటో: రాజమహేంద్రవరం స్టాఫ్ ఫొటోగ్రాఫర్ తూర్పు గోదావరి జిల్లా )

## వేసవి సెలవుల వరకు స్కూళ్ల మూత?

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా రోజురోజకూ విజృంభిస్తున్న నేపథ్యంలో పాఠశాలలు ఇప్పట్లో తెరుచుకునే అవకాశం కనిపించడంలేదు. లాక్‌డౌన్ కారణంగా ఈ నెల 14 వరకు ప్రభుత్వం స్కూళ్లకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ నెల 15 నుంచి లాక్‌డౌన్ ఎత్తివేసినా లేదా సడలించినా పాఠశాలలు మాత్రం వేసవి సెలవుల వరకు మూత అని వార్యమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్కూళ్లు తెరిస్తే విద్యార్థులు గుంపులు గుంపులుగా చేరటం ఖాయం. ఫలితంగా సామాజిక దూరానికి విఘాతం కలుగుతుంది. అందువల్ల ఇటువంటి పరిస్థితి రాకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ఇప్పటికే ఆరు నుంచి తొమ్మిదవ తరగతి వరకు వార్షిక పరీక్షలు నిర్వహించకుండా ఆల్ పాస్ ఉత్తర్వులు ఇచ్చారు. పదో తరగతి పరీక్షలు కూడా వాయిదా వేశారు. విద్యా విషయక క్యాలెండర్ ప్రకారం ఈ నెల 23 వరకు స్కూళ్లు పని చేస్తాయి. 24 నుంచి వేసవి సెలవులు ఉంటాయి. ఈ నెల 14 తరువాత ఈ విద్యా సంవత్సరంలో ఆదివారాలు పోనూ ఇంకా 7 పనిదినాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. తాజా పరిస్థితుల్లో ఈ కొద్ది రోజులు స్కూళ్లు తెరిపించినా ఒనకూరే ప్రయోజనం ఏమీ లేదని భావిస్తున్నారు. ఒకేసారి వేసవి సెలవుల వరకు అంటే జూన్ 11వ తేదీ వరకు స్కూళ్లు మూత తప్పదని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

## ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల గడువు 3 నెలలు పొడిగింపు

ఆంధ్రజ్యోతి, అమరావతి: ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్.ఆర్.ఎస్.) కింద రాష్ట్రంలో అనధీకృత, నిబంధనలకు వ్యతిరేకంగా వెలసిన లేఅవుట్లు, స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునే గడువును 3 నెలలపాటు పొడిగిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు సోమవారంనాడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జనవరి 8వ తేదీన ప్రకటించిన ఈ పథకం గడువు ఈ నెల 7వ తేదీతో ముగిసిపోనుంది. అయితే ఈ కాలవ్యవధిని 3 నెలలపాటు అంటే ఈ సంవత్సరం జులై మొదటి వారం వరకు పొడిగించారు. డీటీసీపీ వి.రాముడు రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన అభ్యర్థనను పురస్కరించుకుని నిర్ణయం తీసుకున్నట్టు శ్యామలరావు పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కింద రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్షన్నర వరకు దరఖాస్తులు అందుతాయని అధికారవర్గాలు అంచనా వేశాయి. అయితే నిర్ణీత గడువైన 3 నెలలు ముగిసేసరికి కేవలం 7,000 వరకు అప్లికేషన్లు మాత్రమే వచ్చాయి. ఇందుకు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ తోపాటు కరోనా వైరస్ కల్లోలం ముఖ్య కారణాలని అధికారులు భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిరవధికంగా వాయిదా పడిన విషయం తెలిసిందే.

# ఉద్యాన రైతు కన్నీరు

(మొదటి పేజీ తరువాయి)

కరువయ్యారు. కొనుగోలు చేసేందుకు వచ్చిన కొద్ది మంది వ్యాపారులు కూడా.. సగం ధరకు బేరమాడుతున్నారు. దీంతో పొలంలో పంటను వదిలేయలేక సగం ధరకే పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి.

### 2 లక్షల హెక్టార్లలో..

అనంతపురం జిల్లాలో 2 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగుచేస్తున్నారు. ఇందులో అత్యధికంగా దాదాపు 50 వేల ఎకరాల్లో అరటి, 53 వేల ఎకరాల్లో చీనీ, 2500 ఎకరాల్లో కళింగర, 700 ఎకరాల్లో ద్రాక్ష, మరో 1000 ఎకరాల్లో కర్బూజ సాగులో ఉంది. మిగిలిన వాటిలో టమాట, దానిమ్మ, బొప్పాయి, మామిడి, సపోటా, జామ, అల్లనేరేడు పంటలతో పాటు కూరగాయలు, పూల పంటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం అరటి, మామిడి, చీనీ పంటలు కోతలో ఉన్నాయి. కానీ చెట్లపైనే పంటను కుళ్లబెట్టలేక అయినకాడికి అమ్ముకోవలసిన దుస్థితి నెలకొంది. పెట్టుబడి వ్యయం కూడా దక్కే అవకాశాలు లేక దిగాలు పడుతున్నారు. మామిడి, బొప్పాయి, కళింగర, దానిమ్మ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాగులో ఉంది. తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోనే అరటి దాదాపు 42 వేల హెక్టార్లలో సాగవుతోంది. ఇక్కడి నుంచి కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, కలకత్తా, మహారాష్ట్ర, ఢిల్లీ, అరబ్ దేశాలకు ఎగుమతి అవుతోంది. లాక్‌డౌన్‌కు ముందు నాణ్యతను బట్టి అరటి టన్ను రూ.16 వేల నుంచి రూ.16,500 వరకూ పలికింది. రవాణా స్తంభించిపోవడంతో అధికారులు ఏర్పాటు చేసిన అరకొర రవాణాతో టన్నుకు రూ.2,700 నుంచి రూ.3,250 వరకే వస్తోంది. రైతు ఎకరా అరటి సాగు చేసేందుకు దాదాపుగా రూ.3 లక్షల వరకూ ఖర్చు చేస్తున్నాడు. ఈ లెక్కన పెట్టుబడి కూడా అందడం లేదు. కళింగర, కర్బూజ ధర టన్నుకు రూ. 5 వేల నుంచి రూ.4,300కి పడిపోయింది. టన్ను రూ. 50 వేలు పలుకుతున్న ద్రాక్షను రూ.35 వేలకైతే కొంటాం.. లేకపోతే లేదన్న చందంగా వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. మామిడి రైతులు సైతం టన్నుకు గతంలో కంటే రూ.20 వేలు నష్టపోతున్నారు. టమాట గతంలో నాణ్యతనుబట్టి టన్ను రూ.23 వేల నుంచి రూ.30 వేల వరకూ ధర పలుకగా.. ప్రస్తుతం కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. టన్ను రూ.2,500 నుంచి 2,800 ధర వచ్చినా రైతు అమ్మేస్తున్నాడు. మరికొందరు రైతులు ఉచితంగా పేద ప్రజలకు పంపిణీ చేస్తున్నారు.



**పంటల ధరవరలు ఇలా..**
(టన్నుకు రూపాయల్లో)

| పంటరకం | లాక్‌డౌన్‌కు ముందు | ప్రస్తుతం |
|---|---|---|
| అరటి | 16,000 | 2,700-3250 |
| కళింగర,కర్బూజ | 5,000 | 4,300 |
| ద్రాక్ష | 50,000 | 35,000-40,000 |
| మామిడి | 60,000-70,000 | 40,000-50,000 |
| దానిమ్మ | 70,000-80,000 | 65,000 |
| బొప్పాయి | 12,000-13,000 | 9,000-10,000 |
| చీనీ | 35,000-50,000 | 20,000-25,000 |
| టమాట | 23,000-30,000 | 2,250-2,800 |
| కూరగాయలు | 15,000 | 10,000 |
| పూలు | 65,000 | 45,000-50,000 |

### కరోనాతో చితికిపోయాం..



16 ఎకరాల్లో అరటిపంటను సాగుచేశా. రూ.25 లక్షలు పెట్టుబడి పెట్టాను. పంట చేతికి వస్తున్న సమయంలో కరోనా దెబ్బతీసింది. వైరస్ రాక ముందు టన్ను రూ.15 వేల వరకు ధర పలికింది. ఇప్పుడు రూ.2,500కి పడిపోయింది. ధర తగ్గడంతో అమ్మలేక.. చెట్లపై ఉంచలేక ఇబ్బందులు పడుతున్నాం. లాక్‌డౌన్ ముగిసిన తర్వాతైనా గిట్టుబాటు ధర వస్తుందని ఎదురుచూస్తున్నాం.

-గోవర్ధన్‌రాజు, రైతు

### 2 లక్షలు నష్టపోయాను...



మూడెకరాల్లో కళింగర సాగు చేశాను. రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. పంట కోతకు వచ్చింది. లాక్‌డౌన్ ఉండడంతో ధర పూర్తిగా పడిపోయింది. టన్ను రూ.1,000-రూ.2,000కి అడుగుతున్నారు. మూడెకరాలకు 50 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. కోతకు మరో లక్ష ఖర్చు చేయాల్సి వస్తోంది. పడిపోయిన ధరతో పంటను అమ్ముకున్నా.. పెట్టుబడి నష్టం మిగులుతుంది. నాదే కాదు... పండ్లతోటల రైతులందరి పరిస్థితీ ఇంతే. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

-హనుమంతరాయుడు, రైతు

### పండ్ల రైతుల్ని ఆదుకోవాలి : పయ్యావుల

అమరావతి, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో, ముఖ్యంగా అనంతపురం జిల్లాలో అరటి, కర్బూజ, కలింగర(పుచ్చకాయ) రైతులను తక్షణం ఆదుకోవాలని పీఏసీ ఛైర్మన్ పయ్యావుల కేశవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం అనంతపురం నుంచి డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, ఆర్థికమంత్రి రాజేంద్రనాథ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పయ్యావుల పాల్గొన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం నాని.. మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి, కమిషనర్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. పంట ఉత్పత్తుల మార్కెటింగ్ ద్వారా రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

## రూ.వెయ్యి పంపిణీపై వివాదం

- టీడీపీ కార్యకర్తపై కత్తితో వలంటీర్ దాడి
- హత్యాయత్నం కేసు నమోదు



దాడిలో గాయపడ్డ విశ్వనాథరాజు

కేవీ పల్లె, ఏప్రిల్ 6: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రూ.వెయ్యి సాయం విషయమై తలెత్తిన వివాదం చివరకు హత్యాయత్నానికి దారితీసింది. చిత్తూరు జిల్లా కేవీపల్లె మండలం బండవడ్డికి చెందిన టీడీపీ కార్యకర్త పసుపులేటి విశ్వనాధరాజు తన సోదరుడి భార్య శ్రీదేవికి రూ.వెయ్యి ఎందుకు ఇవ్వలేదంటూ వలంటీరు పసుపులేటి శ్రీనివాసులును ఆదివారం అడిగాడు. భర్త మృతి చెందిన తరువాత ఆమె కువైట్ వెళ్లిందని, అయితే ఆమె పేరుతో ఉన్న రేషన్‌కార్డుతో వస్తున్న సరుకులతోనే ఇక్కడున్న ఆమె పిల్లలు జీవనం సాగిస్తున్నారని వివరించాడు. కాగా, శ్రీదేవి స్థానికంగా లేరు కాబట్టి ఆర్థిక సాయం అందదని శ్రీనివాసులు తెలిపాడు. గ్రామంలో చాలామందికి కూడా రూ.వెయ్యి సక్రమంగా చెల్లించడం లేదన్న విశ్వనాధరాజు....దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. దీంతో కోపం పెంచుకున్న వలంటీరు సోమవారం విశ్వనాధరాజుపై కత్తితో దాడి చేశాడు. తల,మెడ, కడుపులో పొడిచి పరారయ్యాడు. గ్రామస్తులు క్షతగాత్రుడిని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వలంటీరుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు.

### పింఛన్ కోసం ఎదురుచూపులు

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు ఈ నెలలో ఇంకా పింఛన్లు అందలేదు. కరోనా కట్టడి చర్యల నేపథ్యంలో ప్రభుత్వోద్యోగుల వేతనాలు, పింఛన్లను 50 శాతం తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. మిగిలిన 50 శాతం వేతనాలు ఆర్థిక శాఖ మినహా మిగతా శాఖల్లోని ఉద్యోగులందరికీ అందాయి. ఆర్థికశాఖలో ఉన్న 6 విభాగాల్లోని ఉద్యోగుల వివరాలతో హెచ్‌ఆర్ఎంఎస్ అనే పైలట్ ప్రాజెక్టును ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రక్రియ ఆలస్యంతో ఆ శాఖ ఉద్యోగులకు ఇంకా వేతనాలు అందలేదు. అలాగే, కార్పొరేషన్ల పరిధిలో పనిచేసి రిటైరైన ఉద్యోగులకు పెన్షన్లు అందగా, ప్రభుత్వంలో పనిచేసి రిటైరైనవారికి ఇంకా పింఛన్ అందలేదు. కోత విధించగా మిగిలిన సగమూ తమకు ఇంతవరకూ ఇవ్వలేదని పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కార్యకర్తలిస్తే తప్పేంటీ?: బొత్స

విశాఖపట్నం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): తెల్లకార్డుదారులకు రూ.1000 సాయాన్ని ఎమ్మెల్యేలు, వైసీపీ కార్యకర్తలిస్తే తప్పేమిటని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వం ఇచ్చే సాయం అర్హులకు అందుతుందా? లేదా? అని చూడాల్సిన బాధ్యత తమపై ఉందని సమర్థించుకున్నారు. ఎమ్మెల్యేలు వీధుల్లోకి వెళ్లడాన్ని టీడీపీ రాజకీయం చేస్తూ గవర్నర్‌కు లేఖ రాయడమేమిటన్నారు.

### క్రిమినల్ కేసులు పెట్టండి: సీపీఐ రామకృష్ణ

అమరావతి ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): "ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వైసీపీ అభ్యర్థులపై క్రిమినల్ కేసులను నమోదు చేయాలి. 10 సంవత్సరాలపాటు ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించేందుకు చర్యలు చేపట్టాలి" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఎస్‌ఈసీ రమేశ్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు లేఖ రాసినట్లు రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

### అమల్లోనే ప్రచారంపై నిషేధం: నిమ్మగడ్డ

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంపై నిషేధం కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థలకు పోటీ చేసే అభ్యర్థులు వారి స్వప్రయోజనం కోసం ప్రచారం చేయడం, ఓటర్లను ప్రభావితం చేయడం ఎన్నికల ప్రక్రియ ఉల్లంఘనగా పరిగణనలోకి తీసుకుంటామని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరోనా లాక్‌డౌన్ సందర్భంగా బియ్యంకార్డుదారులకు రూ.1000 పంపిణీ సందర్భంగా వైసీపీ అభ్యర్థులు ప్రచారం చేసుకుంటున్నారని విపక్ష నేతలు ఇచ్చిన ఫిర్యాదులపై ఆయన స్పందించారు. కరోనా పరిస్థితి సమయంలో ప్రజలకు ప్రయోజనాలు చేకూర్చే ఈ పంపిణీ ఎన్నికల ఉల్లంఘన కిందకు రాదని, ప్రస్తుతం కోడ్ వాడుకలో లేదని తెలిపారు.

### మాస్కులు కొట్టేసే స్థితికి దిగజారారు: బుద్దా

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కరోనాపై పోరాడుతున్న వైద్యులకు మాస్కులు, రక్షణ కిట్లు లేవంటూ టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సోమవారం ట్విటర్‌లో పేర్కొన్నారు. 'అమ్మ దొంగా.. ఏ 2 బుద్ధులు ఎక్కడికి పోతాయి. ఆఖరికి మాస్కులు, గ్లౌజులు కొట్టేసే స్థితికి దిగజారిపోయారు. కరోనా నియంత్రణకు ముందుండి పోరాడుతున్న డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బందికి అందించాల్సిన మాస్కులు, వ్యక్తిగత రక్షణ కిట్లు లేవు. దాతలు ముందుకొచ్చి మాస్కులు, రక్షణ కిట్లు అందించాలని డాక్టర్లు లేఖలు రాసే పరిస్థితి వచ్చింది. వారికి ఇవ్వాల్సిన మాస్కులు, రక్షణ కిట్లు వైసీపీ నేతలు కొట్టేస్తున్నారు అని పేపర్‌లో చదవి ఆశ్చర్యపోయా. కొట్టేసిన వాళ్లు ఎవరో ఇప్పుడు అర్థం అయింది. కరోనా అంత పెద్ద విషయం కాదు, పారాసిటమాల్ వేసుకుంటే తగ్గిపోతుందని, బ్లీచింగ్ వేస్తే పోతుందని జగన్ చెబుతుంటే, ఏ 2 మాత్రం ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అంటే ప్రజల ప్రాణాలు పోయినా పర్వాలేదు.. మీరు మాత్రం బాగుంటే చాలు.. అంతేనా ఎంపీ విజయసాయిరెడ్డి గారూ?" అంటూ బుద్దా ట్వీట్ చేశారు.

### ఐఏఎస్, ఐపీఎస్‌ల సస్పెన్షన్‌పై సమీక్షకు కమిటీ

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న అఖిలభారత సర్వీసు అధికారుల సస్పెన్షన్ కేసులపై సమీక్ష చేసేందుకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ఈ కమిటీకి ఛైర్మన్‌గా ఉంటారు. సీసీఎల్ఏ నీరబ్‌కుమార్ ప్రసాద్ సభ్యుడిగా, జీఏడీ ముఖ్య కార్యదర్శి(పొలిటికల్) సభ్య కార్యదర్శిగా, డీజీపీ కో ఆప్టెడ్ సభ్యులుగా ఉంటారు.

## కరోనాపై నిజాలు దాస్తోన్న రాష్ట్రం: కన్నా



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కన్నా

గుంటూరు(సంగడిగుంట), ఏప్రిల్ 6: రాష్ట్ర ప్రభుత్వం కరోనా బారినపడిన వారి వివరాలు తెలపడంలో నిజాలు దాస్తోంది. ఇది ప్రమాదానికి దారి తీయవచ్చు. నాకు బుద్ధి రావాలని వైసీపీ నేతలు కోరుకోవడం కాదు... నేనే వారికి మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుకుంటున్నా" అని బీజేపీ ఏపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం గుంటూరులోని ఆయన నివాసం, కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాల తప్పులను ఎత్తి చూపుతాయని, అది తప్పు అయితే 2014 నుంచి 2019 వరకు వైసీపీ నేతలు చేసిన దానిని గాడిదలు కాయడం అంటారా అని ధ్వజమెత్తారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి బీజేపీ కార్యకర్త... సోమవారం ఉపవాసం ఉండి ఆ ఆహారాన్ని పేదలకు పంచి పెట్టామన్నారు.

### ప్రజల పార్టీగా ఎదిగిన బీజేపీకి శుభాకాంక్షలు: పవన్

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): "భారతీయ జనతా పార్టీ 1980 ఏప్రిల్ 6న ఊపిరి పోసుకొంది. నేటికి 40 వసంతాలు పూర్తి చేసుకుంది. 41వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి జనసేన తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నా. ఈ నాలుగు దశాబ్దాల కాలంలో దేశం నలువైపులా విస్తరించిన బీజేపీ ప్రజల పార్టీగా అవిర్భవించింది. వ్యవస్థాపక నేతల ఆశలను, ఆశయాలను ముందుకు తీసుకువెళుతున్న ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు శుభాభినందనలు"అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

### ఫిలిప్పీన్స్‌లో ఇద్దరు 'అనంత' మెడికోలు మృతి

అనంతపురం వైద్యం/కదిరి, ఏప్రిల్ 6: ఫిలిప్పీన్స్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు వైద్య విద్యార్థులు మృతి చెందారు. అనంతపురానికి చెందిన కొండిగళ్ల పెద్దింటి వంశీ(21), కదిరికి చెందిన కటికెల రేవంత్ కుమార్ (21)ఫిలిప్పీన్స్‌లో ఎంబీబీఎస్ చదువుతున్నారు. కరోనా నేపథ్యంలో అక్కడ కూడా లాక్‌డౌన్ కొనసాగుతోంది. సోమవారం ఉదయం నిత్యావసర వస్తువులు కొనడానికి ఇద్దరూ బైక్‌పై వస్తుండగా..ఫ్లైఓవర్ వద్ద స్తంభానికి ఢీకొని పై నుంచి కిందపడ్డారు. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు.

### మృతదేహాలు తెప్పించండి: చంద్రబాబు లేఖ

అమరావతి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఫిలిప్పీన్స్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైద్యవిద్యార్థుల మృతదేహాలను వెంటనే స్వస్థలాలకు చేర్చడానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్‌కు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన కేంద్ర మంత్రికి ఒక లేఖ రాశారు.

### ఆక్వా సమస్యలపై నిమ్మల సైకిల్ యాత్ర

పాలకొల్లు, ఏప్రిల్ 6: వరి, ఆక్వా రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడానికి సైకిల్‌పై ఏలూరు బయలుదేరిన పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ఎమ్మెల్యే రామానాయుడును పోలీసులు అడ్డుకున్నారు. పాలకొల్లు నుంచి సుమారు 100 కిలోమీటర్లు సైకిల్‌పై వెళ్లడానికి ఎమ్మెల్యే రామానాయుడు సోమవారం సైకిల్ ప్రయాణం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో భీమవరం సమీపంలో విస్సాకోడేరు వద్ద ఆయనను పోలీసులు అడ్డగించారు. అనంతరం నిమ్మలను పాలకొల్లులో వదిలారు. అనంతరం ఎమ్మెల్యే నిమ్మల దీక్షకు ఉపక్రమించారు.

### లాక్‌డౌన్ తర్వాతే హియరింగ్‌కు: రైతులు

గుంటూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన 'ఆర్ 5 జోన్' ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్న రైతులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హియరింగ్‌కు పిలవాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న రాజధాని జేఏసీ నేతలు ఈ హియరింగ్‌కు రైతులు వెళ్లవద్దని సూచించారు. మంగళవారం నుంచి మంగళగిరిలోని కొన్ని గ్రామాల్లో హియరింగ్ కార్యక్రమం ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దీనిపై రైతులు స్పందిస్తూ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 25 వరకు అబ్జక్షన్స్ ఫైల్ చేసే అవకాశం లేదని, ప్రభుత్వం దురుద్దేశంతో ఈ లాక్‌డౌన్‌లోనే పని కానిచ్చుకోవాలనే కుట్ర చేస్తోందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది నోటీసులు తీసుకొస్తే ఎలాంటి సంతకాలు చేయవద్దని రైతులకు సూచించారు.

# ఎందుకీ దాపరికం?

- ఎన్ని పరీక్షలు చేస్తున్నారో చెప్పరేం?
- రాష్ట్రంలో వారంలో వెయ్యి శాతం పెరిగిన కరోనా కేసులు
- ఢిల్లీ మాదిరిగా ఆంధ్రలోనూ పేదలకు 5 వేలివ్వాలి
- ప్రభుత్వ సాయాన్ని వైసీపీ నేతలు పంచుతారా?
- ఉద్యోగుల జీతాలు ఆపి కాంట్రాక్టర్లకు బిల్లులిస్తారా?
- ప్రభుత్వంపై చంద్రబాబు ఫైర్



అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎంత ఎక్కువ మందికి.. ఎన్ని ఎ క్కువ పరీక్షలు చేస్తే.. కరోనా వైరస్ ఎంత మందికి సోకిందో వాస్తవ పరిస్థితి తెలుస్తుందని మాజీ సీఎం చంద్రబాబు అన్నారు. కేరళలో ఇప్పటికి పది వేల మందికి పరీక్షలు చేశారని.. మన రాష్ట్రంలో ఎందరికి చేశారో చె ప్పడం లేదని విమర్శించారు. రెండ్రోజుల నుంచి మెడికల్ బులెటిన్లలో పరీ క్షల విషయం చెప్పకుండా దాస్తున్నారన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో బాబు మాట్లాడారు. గడచిన ఒకవారంలో ఏపీలో కరోనా పాజిటివ్ కేసులు ఏకంగా వెయ్యి శాతం పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. దేశం మొత్తమ్మీద ఈ పెరుగుదల 222 శాతమని తెలిపారు. 'గడచిన వారంలో ప్రపంచంలో కరోనా కేసుల పెరుగుదల 62% ఉంది. అమెరికాలో 105%, బ్రిటన్‌లో 116% పెరిగాయి. మన దేశంలో ఏపీలోనే అత్యధికంగా పెరిగాయి. మన తర్వాత తమిళనాడు(752%), ఢిల్లీ (418%)లో ఎక్కువ పెరుగుదల ఉంది. కేరళ, కర్ణాటకలో కేవలం 47.. 75 శాతం ఉంది. మన దేశంలో ఈ కేసులు వంద నుంచి వెయ్యికి చేరుకోవడానికి 12 రోజులు పట్టింది. వెయ్యి నుంచి రెండు వేలకు చేరుకోవడానికి 5 రోజులు పడితే 2 వేల నుంచి 3 వేలకు చేరడానికి 3 రోజులే పట్టింది. ఈ వేగాన్ని అర్థం చేసుకుని, ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించాలి. ప్రజలు కూడా సహకరించాలి' అని పేర్కొన్నారు.

### వారికి రక్షణ తొడుగులేవీ?

వైరస్ నిరోధంలో ముందు వరసలో ఉండి పనిచేస్తున్న వైద్య, పోలీసు, పారిశుద్ధ్య సిబ్బందికి ఇప్పటికీ సరైన రక్షణ తొడుగులు లేవని, ప్రథమ ప్రాధాన్యంగా వారికి అందజేయాలని చంద్రబాబు కోరారు. దేశంలో వైద్య పరికరాల తయారీని ప్రోత్సహించడానికి తాను విశాఖలో మెడ్ టెక్ పార్క్‌ను నెలకొల్పితే.. తనపై కక్షతో నిర్వీర్యం చేసే ప్రయత్నం చేశారని, ఇప్పటికైనా దానిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించుకోవాలన్నారు. ఢిల్లీ ప్రభుత్వం పేదలకు ఇచ్చినట్లుగా మన రాష్ట్రం కూడా మొదటి విడతలో ప్రతి కుటుంబానికి రూ.5 వేలు ఇవ్వాలన్నారు. కేంద్రం రూ.వెయ్యి నగదు, 5 కిలోల బియ్యం, కిలో పప్పు, ఒక గ్యాస్ సిలిండర్ ఉచితంగా ఇస్తోందని, మధ్యాహ్న భోజనం కూడా ఇంటికే పంపాలని నిర్ణయించిందని గుర్తుచేశారు. వలస కార్మికుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని, ఈ కష్టకాలంలో వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆక్వా రైతులు, పళ్ల తోటల రైతులు, కూరగాయల రైతులు, ధాన్యం రైతులు బాగా ఇబ్బందుల్లో ఉన్నారని, ప్రభుత్వం గతంలో చెప్పిన మాదిరిగా రూ.3 వేల కోట్ల నిధి పెట్టి ఈ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. మొబైల్ రైతు బజార్లను విస్తృతం చేయాలని సలహా ఇచ్చారు.

### అహంకారంతో ప్రవర్తిస్తున్నారు...

ఉద్యోగులు నెలంతా చేసిన పనికి వారికి జీతాలు ఇస్తారని, వాటిలో కోత పెట్టి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం ఏమిటని చంద్రబాబు ప్రశ్నించారు. ప్రభుత్వం నిజంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే కాంట్రాక్టర్లకు రూ. వేల కోట్ల బిల్లులు ఎలా ఇవ్వగలుగుతున్నారని నిలదీశారు. తాము ఏం చేసినా ఎవరూ ప్రశ్నించకూడదన్న అహంకారంతోనే ఇలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల తరపున బాధ్యతగా తాము దీనిని ప్రశ్నిస్తున్నామని చెప్పారు. లాక్‌డౌన్ సమయంలో ప్రజలను ఆదుకోవడానికి ప్రభుత్వం ఇచ్చే వెయ్యి రూపాయలను స్థానిక సంస్థల్లో పోటీచేసే వైసీపీ అభ్యర్థులు పంచడం దుర్మార్గమన్నారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని, పైగా గుంపులు కార్యకర్తలతో తిరుగుతూ లాక్‌డౌన్ స్ఫూర్తిని కూడా దెబ్బ తీస్తున్నారని విమర్శించారు. దీనిపై ఎన్నికల సంఘం, గవర్నర్ కూడా పరిశీలన జరపాలని కోరారు. లాక్‌డౌన్ నిబంధనలు పక్కాగా అమలు చేయాల్సిన సమయంలో పలు చోట్ల ఇసుక, మట్టి, గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా జరుపుతున్నారని అన్నారు. 'విపత్తు సమయంలో ప్రభుత్వానికి సహకరించాలని అందరి కంటే ముందు మా పార్టీ ఎమ్మెల్యేలే తమ వేతనం విరాళంగా ఇచ్చారు. మాట్లాడాలంటే చాలా ఉన్నా ఇది సరైన సమయం కాదని మేం సంయమనం పాటిస్తున్నాం. మమ్మల్ని బూతులు తిడతారని భయపడి నోరు మూసుకోలేం' అని చంద్రబాబు స్పష్టంచేశారు. ప్రజల తరపునే ఉంటామన్నారు. ఒక సంఘటన ఆధారంగా ఒక మతంపై అపోహలు వ్యాపింపజేయడం సరికాదని బాబు సూచించారు.

## నమ్మటమే మేం చేసిన తప్పా?

- మీ నిర్ణయం మార్చుకునే వరకు పోరు ఆపం
- 111వ రోజు కొనసాగిన రైతుల ఆందోళనలు



కొవ్వొత్తులు, దీపాలు వెలిగించి నిరసన తెలుపుతున్న మహిళలు

గుంటూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): "మిమ్మల్ని నమ్మి భూములు ఇవ్వటమే మేము చేసినా తప్పా?" అంటూ సీఎం జగన్‌ను అమరావతి ప్రాంత రైతులు, మహిళలు ప్రశ్నించారు. ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించడంతోపాటు పాలన అంతా ఇక్కడ నుంచే సాగాలని డిమాండ్ చేశారు. రాజధాని కోసం రైతులు, మహిళలు, రైతు కూలీలు చేస్తున్న ఆందోళనలు సోమవారానికి 111వ రోజుకు చేరాయి. "మాకెవరైన అన్యాయం చేస్తే ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్తాం, అలాంటిది ప్రభుత్వమే అన్యాయం చేస్తే ఎవరికి చెప్పాలి?" అని రైతులు, కూలీలు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానుల నిర్ణయం వెనక్కి తీసుకోవాలని పెదపరిమి, నీరుకొండ దీక్షా శిబిరాల్లో భౌతిక దూరం పాటిస్తూ రైతులు నిరసన ప్రదర్శనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాజధాని విషయంలో మూడుముక్కలాట మానుకునే వరకు పోరు ఆపబోమంటూ నెక్కల్లు, అనంతవరం, మందడం, తుళ్లూరు, వెంకటపాలెం, కృష్ణాయపాలెం, యర్రబాలెం, రాయపూడి తదితర గ్రామాల్లో మహిళలు నిరసన ప్రదర్శనలు చేశారు. ఇంటి ముందు సేవ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అని ముగ్గులు పెట్టిన మహిళలు, ఇళ్లలో ధాన్యం, కూరగాయలతో అమరావతితోనే రాష్ట్రానికి భవిత అంటూ ఏపీ మ్యాప్‌లు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు.

### అమరావతితోనే వెలుగులు

అమరావతి వెలుగు పేరుతో సోమవారం రాత్రి 7.30 నుంచి 5 నిముషాల పాటు ఇళ్లలో విద్యుత్ బల్బులు ఆపేసి దీపాలు, కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. 29 గ్రామాల్లో మహిళలు ఇళ్ల ముందు కొవ్వొత్తులతో నిలబడి 'సేవ్ అమరావతి' అంటూ నినాదాలు చేశారు.

## ఇంటి స్థలాలమీద పడండి!

(మొదటి పేజీ తరువాయి)

నిమగ్నమై ఉన్నారు. ఇలాంటి సమయంలో... ఇంటి స్థలాలకోసం రోడ్డెక్కండి అంటూ ఓ ప్రత్యేక అధికారి నుంచి సమాచారంతో కూడిన ఆదేశాలు రావడంతో అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. పేదలకు ఇంటి స్థలాల పంపిణీని ఉగాది నుంచి ఏప్రిల్ 14కు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అమలులో ఉన్న లాక్‌డౌన్ ఈనెల 14 వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత కూడా కొనసాగించే అవకాశాలున్నాయని వార్తలు వస్తున్నాయి. మండల స్థాయి సిబ్బంది కరోనా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. లాక్‌డౌన్ ప్రభావం తీవ్రరూపం దాల్చడంతో రెవెన్యూకు గుండెకాయలాంటి సీసీఎల్ఏ కార్యాలయం కూడా పనిచేయడంలేదు. జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. కలెక్టరేట్‌తోపాటు ఆర్డీవో కార్యాలయాలు లాక్‌డౌన్ వల్ల వెలవెలబోతున్నాయి. సందర్శకులను కూడా రానివ్వడం లేదు. ఆన్‌లైన్‌లో ఈ-మెయిల్ ద్వారానే పిటిషన్లు తీసుకుంటున్నారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో ఇంటి స్థలాలపై దృష్టిపెట్టాలని ఆదేశించడం గమనార్హం. కరోనా ప్రభావం లేని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇంటి స్థలాల కార్యక్రమాన్ని చేపట్టాలని ఓ ప్రత్యేక అధికారి జిల్లా జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. "కోవిడ్-19 ప్రభావం లేని మండలాల్లో తహసీల్దార్లు ఇంటి స్థలాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వర్క్‌ను పూర్తిచేయాలి. పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ బిల్లులను సిద్ధం చేయాలి. కరోనా ప్రభావం లేని మండలాల్లో లే అవుట్ డెవలప్‌మెంట్ వర్క్‌లను పూర్తిచేయాలి. సామాజిక దూరాన్ని పాటిస్తూనే ఈ పనులను పూర్తిచేయడానికి ప్రయత్నించాలి. ఇక పట్టణ ప్రాంతాల్లో, కరోనా ప్రభావం లేని ప్రాంతాల్లో ఆయా కమిషనర్లు టిడ్కో లబ్ధిదారుల ఎంపిక జాబితాను పూర్తి చేయడం తోపాటు డిజిటల్ సంతకాలు చేయాలి" అని ఆదేశాలు వెళ్లాయి. "లాక్‌డౌన్ ఈనెల 14వరకు అమలులో ఉంటుంది. రెవెన్యూ అధికారులు, సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ఈ సమయంలో వారిని ఇంటి స్థలాల పనికి ఎలా డైవర్ట్ చేయగలం? లాక్‌డౌన్ కఠినంగా అమలు చేస్తున్న వేళ కరోనా లేని ప్రాంతాల్లో లే అవుట్‌ల అభివృద్ధి చేపట్టడం సాధ్యమేనా? ఈనెల 14నే ఇంటిస్థలాల పంపిణీకి సర్కారు గడువుగా నిర్ణయించింది. అప్పటి వరకు లాక్‌డౌన్ కొనసాగుతుంది కాబట్టి ఇంటి స్థలాలపై సీఎం స్థాయిలో నిర్ణయం తీసుకోవాలి. సీనియర్ అధికారులు, జిల్లా కలెక్టర్లు జేసీలతో చర్చించి ఓ నిర్ణయం తీసుకోవాల్సిన అంశంపై ప్రత్యేక అధికారి నేరుగా ఆదేశాలు ఇవ్వడం విడ్డూరంగా ఉంది. కరోనా సమస్య తీవ్రతను గుర్తించకుండా, అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఏం చేస్తుందో తెలుసుకోకుండా ఇచ్చినట్లుగానే కనిపిస్తోంది" అని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

**APTS ANDHRA PRADESH TECHNOLOGY SERVICES (APTS)**

Tender call notice for Identification of Service Provider for Facility Management Services (FMS) and Maintenance Services (MS)" for Computer Hardware and other peripherals for AP Secretariat Campus Area Network (APSCAN) at Interim Govt. Complex, Velagapudi, Andhra Pradesh (A.P.)

**Time Schedule of various tender related events :**

| | |
|---|---|
| Bid calling date | 07-04-2020 |
| Pre-bid conference date / time | No Pre-bid meeting |
| Last date / time for clarifications by mail | 14-04-2020 |
| Issue of clarifications on RFP | 18-04-2020 |
| Bid Submission closing date / time | 27-04-2020, 03-00 PM |
| Bid Document Fee | Rs. 25,000/- (Online) |
| APTS Contact person | Mr. Sreedhar Reddy, Manager (IIP & Proc-3) Mob- 99630 29412, Mail-ID-sreedharreddy.a@gov.in |
| Reference No | ITC51-18021/2/2019-IIP-APTS (Computer No. : 1051216) |

If your firm is interested in participation, please ask the contact person for details or visit our web site at http://www.apts.gov.in or www.apeprocurement.gov.in. The document is to be purchased by firms for participation.

Sd/- Managing Director, A.P. Technology Services Ltd.

కరోనా వ్యాప్తితో భీతిల్లివున్న తన ప్రజలను ఉద్దేశించి ఆదివారం క్వీన్ ఎలిజబెత్ చేసిన ప్రసంగం బ్రిటిషర్ల ప్రశంసలు అందుకుంది. రాజరికం నచ్చనివారు సైతం ఈ కష్టకాలంలో ఆమె చేసిన ప్రసంగం స్ఫూర్తిదాయకంగా ఉన్నదని మెచ్చుకున్నారు. కరోనా కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను స్మరిస్తూనే, సంఘటితంగా సాగిస్తున్న ఈ పోరాటంలో మనమంతా కచ్చితంగా విజయం సాధిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. ఇటువంటి కష్టాలు అనేకం నెగ్గుకొచ్చాం, ఇదీ ఒకటి అన్నారామె. ఆత్మీయులను కోల్పోవడమన్నది భరించలేనిదే అంటూ, ఈ పోరాటం గురించి మనమంతా కచ్చితంగా భావితరాలకు చెప్పుకుంటామని భరోసా ఇచ్చారు. మనం మన స్నేహితులను, కుటుంబ సభ్యులను కలుసుకొనే మంచిరోజులు వస్తాయి, కచ్చితంగా మళ్ళీ కలుసుకుంటాం అంటూ ప్రసంగాన్ని ముగిస్తూ ఆమె చెప్పిన మాటలు అనేకమందిని కన్నీటిలో ముంచెత్తిందట. కరోనా వ్యాధిలక్షణాలతో పదిరోజులు క్వారంటైన్‌లో ఉన్న ప్రధాని బోరిస్ జాన్సన్ ఆసుపత్రిలో చేరిపోయిన సందర్భంలో, బ్రిటిష్ రాణి ఈ వీడియో ప్రసంగం చేయడం అనేక మందికి ధైర్యాన్నిచ్చి ఉంటుంది.

యాభైవేల కేసులతో, ఐదువేల మరణాలతో సతమతమవుతున్నది బ్రిటన్. నిజానికి బోరిస్ శుక్రవారం హోం క్వారంటైన్ నుంచి బయటకు వచ్చి విధుల్లో చేరాలి. కానీ, రోగ లక్షణాలు ఉపశమించని కారణంగా ఆయనను ఆస్పత్రికి తరలించవలసి వచ్చింది. బోరిస్ ఎంత కాలం ఆస్పత్రిలో ఉండాల్సివస్తుందన్నది అటుంచితే, మూడేళ్ళపాటు బ్రెగ్జిట్ భయాల్లో మునిగిన బ్రిటన్ ఇటీవలే కాస్తంత తేరుకుంది. బ్రెగ్జిట్‌కు ఇద్దరు ప్రధానులు బలైన తరువాత, బోరిస్ పార్టీలోనే కాక, దేశంలోనే ఓ బలమైన నాయకుడిగా ముందుకొచ్చాడు. దేశాన్ని ఒడ్డునపడేసే ఆ ప్రక్రియ కాస్తంత ముందుకుపోతున్న తరుణంలో ఇప్పుడు కరోనా వచ్చి కొత్త కల్లోలాన్ని సృష్టించింది. బోరిస్ సమీపకాలంలోనే ఆస్పత్రినుంచి బయటకు వచ్చినా, ఆయన పూర్తిగా తేరుకోవడానికీ, గతంలో మాదిరిగా అంతే శక్తిమంతంగా పనిచేయడానికీ ఎంతకాలం పడుతుందో తెలియదు. అందువల్లనే, అంతవరకూ దేశాన్ని నడిపించే

## బ్రిటన్ బాధలు

నాయకుడెవరన్న చర్చ ఇప్పుడక్కడ విస్తృతంగా సాగుతోంది. అధ్యక్షుడు బాధ్యతలు చక్కబెట్టగలిగే స్థితిలో లేనప్పుడు ఉపాధ్యక్షుడికి అధికారాలు దఖలు పరచాలని అమెరికా రాజ్యాంగం చెబుతోంది. కానీ, మంత్రివర్గ పాలన ఉన్న బ్రిటన్‌లో ఆ రకమైన ఏర్పాటు సహజంగానే ఉండదు. ఆస్పత్రి నుంచే తాను పనిచేస్తానని బోరిస్, ఆయనే పాలకుడని ప్రభుత్వమూ చెబుతున్నప్పటికీ, ప్రధాని పరోక్షంలో విదేశాంగ మంత్రి డొమినిక్ రాబ్ అధికారిక సమావేశాలు నిర్వహిస్తున్నారు. 'ఫస్ట్ సెక్రటరీ ఆఫ్ స్టేట్' హోదాలో ఈయన 'డీ ఫ్యాక్టో' ప్రధాని అయినప్పటికీ, కరోనా వ్యతిరేక పోరాటంలో ముందువరుసలో ఉన్న కొందరు మంత్రుల మాదిరిగా ఆయనకు ప్రజల్లో పెద్ద పేరు లేదు, మిగతా మంత్రివర్గ సహచరుల్లో ఆయన పట్ల విశ్వాసమూ లేదు.

కరోనాను ఎదుర్కొనే వ్యూహం విషయంలో మంత్రివర్గంలో తీవ్ర విభేదాలున్నాయి. రక్షణ కవచాలు సరిపడా లేవనీ, అవసరమైన సంఖ్యలో పరీక్షలు జరపడం లేదన్న విమర్శలతో పాటు, లాక్‌డౌన్ తెచ్చిన తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎలా ఎదుర్కోగలమన్న భయాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో, కరోనాకు తగిన జవాబు అంటూ బ్రిటన్ ఆర్థికమంత్రి రిషి సునక్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అనేమంది ఆర్థికవేత్తల ప్రశంసలు అందుకుంది. ముప్పై బిలియన్ పౌండ్ల ప్రత్యేక కరోనా ప్యాకేజీతో బ్రిటన్ కచ్చితంగా ఈ సంక్షోభం నుంచి బయటపడుతుందని ఆయన భరోసా ఇచ్చారు. యూరోపియన్ యూనియన్‌తో సభ్యత్వాన్ని తెగదెంపులు చేసుకున్న తరువాత, యాభైయేళ్ళ అనంతరం దేశవ్యాప్తంగా లక్షలాది పౌండ్లతో అన్ని రంగాలకు భారీ కేటాయింపులు జరపడం, నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం ఆర్థిక రంగానికి కొత్త ఉత్తేజాన్నిచ్చింది. ఈ భారీ బడ్జెట్‌తో ప్రజల్లో కూడా సునక్ పాపులారిటీ బాగా పెరిగిపోయింది. ఒక సర్వేలో ఆయన మిగతా మంత్రులకంటే పై స్థాయిలో ఉండటమే కాక, ప్రధాని బోరిస్ జాన్సన్ కంటే రెట్టింపు స్కోరు సాధించారు. వారం క్రితం ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక నిర్వహించిన సర్వేలో సైతం బోరిస్ ప్రధాని బాధ్యతలు నిర్వహించలేని పక్షంలో, సునక్ ఆ స్థానానికి నూరుపాళ్ళూ అర్హుడంటూ మెజారిటీ ఓట్లతో బ్రిటిషర్లు తేల్చేశారు. ఇప్పుడు పరోక్షంగా ప్రధాని బాధ్యతలు నిర్వహిస్తున్న డొమినిక్ రాబ్ ప్రజల ఎంపికలో చివరిస్థానంలో ఉండటం విశేషం. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి అల్లుడు బ్రిటిష్ ప్రధాని కాగలడా? అన్నది అటుంచితే, పలు కష్టాల్లో ఉన్న బ్రిటన్‌ను రిషి సునక్ ఒడ్డునపడేయగలిగితే సంతోషించాల్సిందే.

## మూడో కన్ను




© సతీష్ ఆచార్య

**ప్రపంచమంతా అల్లకల్లోలంగా ఉన్న సమయంలో కరోనా వైరస్ వ్యాప్తి చెందే విధంగా తబ్లిగీ జమాత్ ప్రవర్తించింది. ఇది దేశ వ్యతిరేకమైన వైఖరి కాదా? కొన్ని సంస్థలు, వ్యక్తుల చర్యల వల్ల మొత్తం దేశంలో సామాజిక సామరస్య వాతావరణం దెబ్బతింటే ఎవరికి నష్టం?**

# మోదీ సారథ్యమే శ్రీరామరక్ష

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మొత్తం ప్రపంచంలోనే అత్యధిక మంది సభ్యులున్న సామాజిక సంస్థ. ఆ సంస్థకు సంబంధించి అత్యున్నత స్థాయిలో చర్చించి నిర్ణయాలు తీసుకునే అఖిల భారతీయ ప్రతినిధి సభ ప్రతి ఏడాదీ మార్చిలో సమావేశాలు నిర్వహిస్తుంది. అయితే కొవిడ్ 19 మూలంగా మార్చి 16, 17, 18 తేదీల్లో ఆ సంస్థ బెంగళూరులో జరపాల్సిన అఖిల భారతీయ ప్రతినిధి సభను రద్దు చేసుకుంది. ఈ సమావేశాలకు హాజరు కావాల్సిన 1600 మంది ప్రతినిధులు వెనక్కు వెళ్లి తమ తమ ప్రాంతాల్లో ప్రజల్లో కరోనా వైరస్ వల్ల ఏర్పడే ప్రమాదాలను వివరించాలని సంఘ్ పెద్దలు కోరారు. చాలా చోట్ల సంఘ్ కార్యకలాపాలు ఇవాళ వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా, సోషల్ మీడియా సహకారంతో జరుగుతున్నాయి. లాక్‌డౌన్ మూలంగా వలస కార్మికులకు, పేదలకు ఆకలి బాధలు లేకుండా ఉండేందుకు దేశవ్యాప్తంగా లక్షలాది సంఘ్ కార్యకర్తలు పనిచేస్తున్నారు. మరో వైపు భారతీయ జనతా పార్టీ కూడా పెద్ద ఎత్తున కార్యకర్తలను రంగంలోకి దించి పేద ప్రజలను ఆదుకుంటోంది.

మరి తబ్లీగీ జమాత్ సంస్థ ఏమి చేసింది? కరోనా వైరస్ వ్యాప్తి ప్రమాదాలున్న రీత్యా సమావేశాలను నిలిపివేయాలని ప్రపంచ వ్యాప్తంగా నిర్ణయాలు తీసుకున్నప్పటికీ పెడచెవిన పెట్టింది. అప్పటికే ప్రధానమంత్రి ప్రతి ఏడాదీ అట్టహాసంగా జరుపుకనే హోలీ మిలన్‌ను రద్దు చేశారు. సార్క్ సమావేశాలను వీడియో ద్వారా నిర్వహించి సార్క్ నిధి ఏర్పాటుకు పిలుపునిచ్చారు. తబ్లీగీ జమాత్ నిర్వాహకులు మాత్రం బాధ్యతారహితంగా వైరస్ తీవ్రంగా ఉన్న దేశాలనుంచి వందలాది విదేశీ ప్రతినిధులను అక్రమ వీసాలతో పిలిపించి ఢిల్లీలో సమావేశాలు నిర్వహించి దేశంలో లక్షలాది మంది ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా వ్యవహరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న కట్టుదిట్టమైన చర్యల మూలంగా కరోనా వైరస్ సోకిన వారి సంఖ్య పెరగడంలేదని దేశ ప్రజలంతా సంతృప్తి చెందుతున్న సమయంలో ఉన్నట్లుండి వైరస్ సోకిన వారు బయటపడడం, వారు తబ్లీగీ జమాత్ సమావేశాల్లో పాల్గొన్నవారేనని తేలడంతో భయాందోళనలు తీవ్రమయ్యాయి. వివిధ రాష్ట్రాలనుంచి ఈ సమాచారం వస్తున్నప్పటికీ ఢిల్లీలో తబ్లీగీ జమాత్ నిర్వాహకులు నిర్లక్ష్యపూరితంగా నిజాముద్దీన్‌లోని మర్కజ్‌లో వందలాది మందితో ప్రార్థనలు నిర్వహిస్తూనే ఉన్నారు. బాధ్యతాయుతంగా తమంతట తాము ముందుకు వచ్చి వైరస్‌ను అదుపులోకి తెచ్చేందుకు ప్రభుత్వానికి సహకరించే బదులు ప్రార్థనా సమావేశాలు నిలిపివేసేందుకు నిరాకరించారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వచ్చి వారికి నయానో, భయానో నచ్చజెప్పాల్సి వచ్చింది. ఆ తర్వాత కూడా కొంతమంది తబ్లీగీ జమాత్ కార్యకర్తలు డాక్టర్లకు సహకరించకుండా వారిపై దాడులు చేసినట్లు సమాచారం లభించింది. వారెందుకలా వ్యవహరించారు? మన దేశంలో చట్టాల పట్ల, ప్రభుత్వం తీసుకునే చర్యల పట్ల వారికి నమ్మకం లేదా?

## సత్యకాలమ్



■ వై. సత్యకుమార్

మన దేశంలో ప్రతి రోజూ వివిధ మతాల వారు తమ తమ రీతిలో ప్రార్థనలు చేసుకుంటూ ఉంటారు. ప్రజాస్వామ్య విలువలు ఉన్నత స్థాయిలో పాటిస్తున్న మన దేశంలో వీటన్నిటిపై ఆంక్షలు ఉండవు. కాని ఇవాళ కరోనా వైరస్ మూలంగా ఏర్పడిన ప్రమాదం ఏ మతాన్నీ, వర్గాన్నీ వదిలిపెట్టదు. ఎవరూ ఈ వైరస్ ప్రమాదానికి అతీతం కారు. అందువల్లే కోట్లాది ప్రజలు దేశ పరిస్థితిని అర్థం చేసుకుని లాక్‌డౌన్‌కు స్వచ్ఛందంగా సహకరిస్తూ వచ్చారు. నిజానికి సంక్షోభ సమయాల్లో ప్రజలకు అన్ని మత సంస్థలూ, సామాజిక సంస్థలూ అండగా నిలవాలి. కరోనా వైరస్ గురించి ప్రజలను అవి చైతన్యపరిచి, సేవా కార్యక్రమాలు నిర్వహించాలి. అప్పుడే ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సక్రమంగా అమలు అవుతాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చేసింది అదే. కాని తబ్లిగీ జమాత్ అందుకు భిన్నంగా వ్యవహరించింది. ప్రపంచమంతా అల్లకల్లోలంగా ఉన్న సమయంలో వైరస్ వ్యాప్తి చెందే విధంగా ప్రవర్తించింది. ఇది దేశ వ్యతిరేకమైన వైఖరి కాదా? కొన్ని సంస్థలు, వ్యక్తుల చర్యల వల్ల మొత్తం దేశంలో సామాజిక సామరస్య వాతావరణం దెబ్బతింటే ఎవరికి నష్టం?



దారుణమేమంటే ఈ దేశంలో ముస్లింలకు తానొక్కడినే ప్రజాప్రతినిధిని అన్నట్లు వ్యవహరిస్తున్న మజ్లిస్ నేత అసదుద్దీన్ ఒవైసీ కూడా తబ్లీగీ జమాత్ చేసిన బాధ్యతారహితమైన పనిని సమర్థించడం. తబ్లీగీ జమాత్ సమావేశాలకు మతం రంగం పులమవద్దని ఆయన అన్నారు. ఎవరు మతం రంగు పులిమారు? తబ్లీగీ జమాత్ సమావేశాల మూలంగా వైరస్ సోకిన వారి సంఖ్య ఉన్నట్లుండి రెట్టింపు కావడం నిజం కాదా? ఆయన ఎందుకు ఆ సంస్థ బాధ్యతారాహిత్యాన్ని ఖండించలేదు? అక్రమ వీసాలు ప్రోత్సహించడాన్ని ఎందుకు విమర్శించలేదు?

ఇవాళ ఒవైసీకి, వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీకీ పెద్ద వ్యత్యాసం కనిపించలేదు. ప్రభుత్వం చేసిన ప్రతిదాన్నీ ద్వేషభావంతో తప్పు పట్టడాన్ని వారు అలవాటు చేసుకున్నారు. జనతా కర్ఫ్యూ రోజు వైద్య సిబ్బందిని, మానవ సేవలో ఉన్నవారిని అభినందిస్తూ కరతాళ ధ్వనులు చేయవలిసిందిగా ప్రధాని పిలుపునిస్తే దాన్నీ వారు వేళా కోళం చేశారు. కరోనా వైరస్‌ను ఎదుర్కోవాలన్న పట్టుదలను వ్యక్తం చేసేందుకు దీపాలు వెలిగించవలిసిందిగా ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపును కూడా ఒవైసీ అపహాస్యం చేసి గిమ్మిక్కు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ అంటూ విమర్శించారు. మన దేశంలో ఏ కార్యక్రమం దిగ్విజయంగా జరగాలన్నా దీపాలను వెలిగించడం సంప్రదాయం. 'తమసోమా జ్యోతిర్గమయ' అన్న వాక్యంలో చీకట్లను తరిమివేసి జీవితంలో వెలుగురేఖల్ని ఆహ్వానించాలన్న సందేశం ఉన్నది. దీపం వెలిగించడం అనేది ఒక స్ఫూర్తికి సంకేతం. ప్రజల్లో ఈ స్ఫూర్తిని రగిలించడం కోసమే ప్రధానమంత్రి ఆ పిలుపునిచ్చారు. కానీ అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ నేతలు ఆ స్ఫూర్తిని అపహాస్యం చేశారు. ప్రధాని పిలుపును బహిష్కరించమని ఒవైసీ పిలుపునిస్తే దీపాలు వెలిగించడం వల్ల ఎలెక్ట్రిక్ గ్రిడ్ పేలిపోతుందని కాంగ్రెస్ నేత శశిథరూర్ బూటకపు భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేశారు. లిఫ్ట్ లేకపోతే ఎలా వెళతామని ప్రశ్నించారు. ఐక్యరాజ్యసమితిలో కీలక బాధ్యతలు నిర్వర్తించి, సెక్రటరీ జనరల్ పదవికి పోటీ చేసిన వ్యక్తి ఈ రకమైన విపరీత వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న భావదారిద్ర్యానికి నిదర్శనం అని చెప్పక తప్పదు. ప్రధానమంత్రి కొద్ది నిమిషాలు లైట్లు ఆపి దీపాలు వెలిగించమని చెప్పారు కాని లిఫ్ట్‌లు ఆపాలని, ట్రాన్స్‌ఫార్మర్లను కట్టేయాలని ఎక్కడైనా చెప్పారా? ప్రధాని చేసిన ప్రతి ప్రకటననూ వ్యతిరేకించడం కన్నా, వలస కూలీలకు, పేదలకు ప్రతిపక్షాలు చేసిందేమిటి, మొసలి కన్నీళ్లు కార్చడం తప్ప?

విచిత్రమేమంటే రాజకీయ కారణాల రీత్యా ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ తీవ్రతను గుర్తించడానికి నిరాకరించిన జగన్మోహన్ రెడ్డి కూడా తబ్లిగీ జమాత్ చేసిన దుష్కార్యాల్ని పరోక్షంగా సమర్థించడం. వైరస్ పెరగడానికి మతం రంగు పులమకూడదని వ్యాఖ్యానించడం ఆయన వైఖరికి అద్దం పడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా తబ్లీగీ జమాత్ మూలంగా వైరస్ సోకిన వారి సంఖ్య పెరిగిందని, తన స్వంత జిల్లా కడప నుంచే అనేకమంది ఈ సమావేశానికి వెళ్ళారనీ ఆయనకు తెలియదా? తన మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రి, కొందరు ఎమ్మెల్యేలు తబ్లీగీ సమావేశాల్లో పాల్గొన్నారని వస్తున్న ఆరోపణలపై ఆయన ఎందుకు జవాబివ్వడం లేదు? వారిలో ఎంతమంది క్వారంటైన్‌లో ఉన్నారు? వీటన్నిటిపై స్పష్టత ఇవ్వకుండా ఒక మతం సానుభూతిని పొంది రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ఎందుకు ప్రయత్నించారు? అంతేకాక, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పథకాల ద్వారా వృద్ధులు, వికలాంగుల సంక్షేమం కోసం విడుదల అయిన నిధులను వైసీపీ సర్పంచులు, కౌన్సిలర్లు, ఎంటిటీసీల ద్వారా ప్రజలకు పంచిపెట్టడంలో ఔచిత్యం ఉన్నదా? ప్రధాని పిలుపునకు ప్రజలు అఖండ మద్దతును ప్రకటించిన తర్వాతనైనా మన రాజకీయ నేతలకు జ్ఞానోదయం కలిగి రాజకీయాలకు అతీతంగా వివేకవంతంగా వ్యవహరిస్తే మంచిది. లేకపోతే ప్రజల దృష్టిలో చరిత్రహీనులుగా మిగిలిపోక తప్పదు. వారికి నచ్చినా నచ్చకపోయినా ఇవాళ మోదీ సారథ్యమే దేశానికి శ్రీరామరక్ష.

*(బిజెపి జాతీయ కార్యదర్శి)*

# సమతుల్యతే ఆరోగ్య సూత్రం

■ ముప్పవరపు వెంకయ్యనాయుడు



భారత ఉపరాష్ట్రపతి

ప్రపంచాన్ని వణికిస్తూ వేలమంది ప్రాణాలను బలిగొంటున్న కరోనా మహమ్మారిపై మానవాళి సమరం చేస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకోవాల్సి రావడం కాకతాళీయం. వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ, పర్యావరణానికి నష్టం కలిగించకుండా, ప్రకృతితో మమేకమై జీవించడం ద్వారానే భూమండలంపై సుఖసంతోషాలతో జీవించడం సాధ్యమని అందుకు ఇకనైనా నడుంబిగించాల్సిన అవసరముందని ఈ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం విశ్వమానవాళికి మరోసారి గుర్తుచేసింది. ప్రపంచవ్యాప్తంగా కొవిడ్ 19 వైరస్‌పై పోరాటాన్ని ముందుండి నడిపిస్తున్న వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల కీలకమైన పాత్రను యావత్ ప్రపంచం మరోసారి గుర్తుచేసుకునే సందర్భం కల్పించింది.

ప్రపంచవ్యాప్తంగా విజ్ఞాన, వైద్యశాస్త్రాల పరంగా నిత్యనూతన పరిశోధనలెన్నో జరుగుతున్నాయి. ఎన్నో సరికొత్త విషయాలు ఆవిష్కృతమవుతున్నాయి. ఈ విధమైన శాస్త్ర, సాంకేతిక ప్రగతి సాధిస్తున్న సమయంలోనూ.. కరోనా వైరస్ విజృంభిస్తూ సమస్త మానవాళిని నిస్సహాయ స్థితిలోకి నెట్టేసి విలయతాండవం చేయాలని చూస్తోంది. దీని విశృంఖలత్వాన్ని అడ్డుకునే టీకాను కనుగొని మానవజాతికి భవిష్యత్తుపై విశ్వాసం కలిగించేందుకు ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు విస్తృతంగా అహర్నిశలు శ్రమిస్తూ పరిశోధనలు చేస్తున్నారు. వీలైనంత త్వరలోనే వీరు ఈ ప్రయత్నంలో విజయం సాధిస్తారని ఆశిస్తున్నాను. కరోనాపై పోరాటంలో విజయం సాధించిన తర్వాతైనా మనలో మార్పు రావాలి. ఆర్థిక మాంద్యంపై, వ్యక్తిగత జీవితాల్లో విస్తృత విధ్వంసంపై విశ్లేషించుకోవాలి. ఎన్నో చిక్కుముడులకు ఓ పరిష్కారాన్ని కనుగొనేదిశగా సంయుక్తంగా ముందుకెళ్లాలి. కరోనా వంటి ఆకస్మిక విపత్తులు భవిష్యత్తులో తలెత్తితే వాటిని ఎదుర్కొనడంలో మన సామర్థ్యాన్ని అంచనా వేసుకుని.. వాటిని నివారించగలమా? అని అంతర్మథనం చేసుకోవాలి. సమీప భవిష్యత్తులోనే మన అభివృద్ధి నమూనాలు, పర్యావరణ వ్యవస్థ దుర్బలత్వం, మన ఉత్పత్తి వినిమయ పద్ధతులపై ప్రశ్నలు తలెత్తే అవకాశాలున్నాయి. కొందరు మేధావులు అంటున్నట్లుగా ప్రకృతి, ఇతర జీవరాశిపై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించాలన్న మానవుడి అత్యాశ కారణంగానే ఈ విపత్తులు తలెత్తుతున్నాయనేదే నిజమైతే.. పైన తలెత్తే ప్రశ్నలకు మన వద్ద సమాధానం దొరకదు.

మానవుడి దురాశ కారణంగా పర్యావరణ సమతుల్యతకు జరుగుతున్న నష్టాన్ని కరోనా మహమ్మారి మరోసారి మనకు గుర్తు చేస్తోంది. ప్రకృతిని గౌరవించుకోవాలని, ఈ సమతౌల్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని అత్యంత ప్రాచీనమైన భారత సంస్కృతి, సంప్రదాయాలు బోధిస్తున్నాయి. 2వేల ఏళ్లకు పూర్వమే భారతీయ ప్రాచీన వేదాలు.. మానవుడితోపాటు సమస్త ప్రాణికోటికి సమానమైన ప్రాధాన్యం ఉందని స్పష్టం చేశాయి. రుగ్వేదంలోని పురుషసూక్తంలో 'ఓం తచ్చం యోరావృణీమహేగాతుం యజ్ఞాయ గాతుం యజ్ఞపతయేదైవీ స్వస్తి రస్తునః స్వస్తిర్మానుషేభ్యః ఊర్ధ్వం జిగాతు భేషజమ్మంనో అస్తు ద్విపదే శం చతుష్పదేఓం శాంతిః శాంతిః శాంతిః' అని పేర్కొనబడి ఉంది.

భూమండలంపై ఉన్న సమస్త జీవకోటి సంక్షేమాన్ని కాంక్షిస్తూ.. మునులు, ఋషులు భగవంతుడిని ప్రార్థిస్తూ.. చెట్లు, మరీ ముఖ్యంగా వనమూలికలు సమృద్ధిగా పెరగాలని.. అందరూ ఎలాంటి అనారోగ్య సమస్యల్లేకుండా ఆరోగ్యకరమైన జీవితాన్ని కలిగుండాలని కోరుతున్నారు. భగవంతుడు మనుషులతోపాటు ప్రకృతి, పశుపక్ష్యాదులపైన అపారమైన కరుణను, శాంతిని ప్రసరింపజేస్తాడని వారు మనస్ఫూర్తిగా భావించారు. చివరగా తన ప్రార్థనను ముగిస్తూ.. సమస్త భూమండలంపై ఉన్న ప్రతి ప్రాణికి క్షేమంగా, ప్రశాంతంగా ఉండాలని వారు ఆకాంక్షించారు.




భూమిపై ఉన్న అన్ని జీవరాశుల మధ్య అవసరమైన పరస్పర సమన్వయ, సామరస్యపూర్వక జీవనాన్ని.. పురాతన భారతీయ సంప్రదాయం మనకు బోధిస్తుంది. చెట్లు, జంతువులతోపాటు అన్నింటిలోనూ భగవంతుడిని చూడటాన్ని, ప్రకృతిని ఆరాధించడాన్ని మన సంస్కృతి నేర్పిస్తుంది. పర్యావరణ పరిరక్షణ, జీవావరణ సమతౌల్యాన్ని కాపాడుకోవడం మన ప్రాచీన సంప్రదాయమని గుర్తుచేస్తుంది. 'ప్రకృతిలోని అందాన్ని గుర్తించడాన్ని, దాన్ని కాపాడుకోవడాన్ని జీవన పద్ధతిగా, మతపరమైన ప్రాముఖ్యతగా ఆచరించి చూపిన మన పూర్వీకులకు శిరసువంచి నమస్కరిస్తున్నాను' అని ప్రకృతితో మమేకమైన జీవన విధానం అవసరాన్ని జాతిపిత మహాత్మా గాంధీ చాలా చక్కగా వివరించారు.

అందుకే మళ్లీ ప్రతి భారతీయుడు, ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి నడుం బిగించాలి. భూమండలంపై ఉన్న చెట్లు, పశుపక్ష్యాదులతోపాటు తోటి మానవులు కూడా ఆరోగ్యకరమైన, సామరస్య పూర్వకమైన జీవితాన్ని అనుభవించేలా చొరవ తీసుకోవాలి. మనం పీలుస్తున్న గాలి, తాగేనీరు స్వచ్ఛంగా ఉండాలి. మన నేలతల్లిని, వృక్ష సంపదను, సహజవనరులను కాపాడుకుంటామనే కృతనిశ్చయంతో పనిచేయాల్సిన తరుణం ఆసన్నమైంది. లాక్‌డౌన్ నేపథ్యంలో గాలి నాణ్యత చాలా బాగా పెరిగిన విషయాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. అడవి జంతువులు ఊళ్లలోకి, పట్టణాల శివారు ప్రాంతాల్లోకి వస్తున్నాయనే వార్తలు ఇటీవల తరచుగా కనబడుతున్నాయి. ప్రకృతిని, అడవులను మన అవసరాల కోసం ఎంతగా విధ్వంసం చేస్తున్నామో, ప్రకృతితో కలిసి జీవించడం ఎంత అవసరమో తెలిపేందుకు ఇదో ఉదాహరణ మాత్రమే.

**మనిషికి, ప్రకృతికి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని యావత్ ప్రపంచం అర్థం చేసుకుని మసలుకోవాలని ఈ మహమ్మారి మరోసారి మనకు గుర్తుచేసింది. మొక్కలు, పశుపక్ష్యాదులు, ఇతర జీవరాశులతో కలిసి మనం ఈ భూగ్రహాన్ని పంచుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాలి. ఈ పరస్పర సమన్వయ గతిని సరిగ్గా అర్థం చేసుకోవాలి. మనుషులతోపాటు జంతువులు, చెట్లు, ప్రకృతి ఆరోగ్యవంతంగా ఉండేందుకు అవసరమైన బహుముఖ వ్యూహంతో డబ్ల్యూహెచ్‌వో రూపొందించిన 'వన్ హెల్త్' అనే భావనను మనమంతా ఆచరణలోకి తీసుకురావాలి.**

భారతీయుల ప్రాపంచిక దృష్టి ప్రకారం.. మన ప్రార్థనల్లో భూమిమీదున్న జీవరాశితోపాటు ఆకాశంలో, అంతరిక్షంలో ఉన్న జీవరాశి మధ్య కూడా సామరస్యపూర్వకమైన జీవనం కొనసాగాలని ఆకాంక్షించాం. దీనికి ఈ వేదమంత్రమే ఓ ఉదాహరణ. 'ఓం ద్యౌశాంతిః అంతరిక్షగ్ శాంతిః పృథివిః శాంతిః ఆపః శాంతిః – ఓషధయ శాంతిః వనస్పతయః శాంతిః – విశ్వేదేవాః శాంతిః – బ్రహ్మ శాంతిః సర్వం శాంతిః – శాంతి రేవా శాంతిః – సామా శాంతిరేధి' (ఆకాశంలో, అంతరిక్షంలో శాంతి నెలకొనాలి, భూమి మీద శాంతి ఉండాలి, నీటిలో శాంతి ఉండాలి, మొక్కల్లో శాంతి ఉండాలి, చెట్లలో శాంతి ఉండాలి, ప్రకృతిలోని ప్రతి అంశలోనూ భగవంతుడి కృపతో శాంతి నెలకొనాలి. మన జాగరూకతలో (సచేతనత్వంలో)నూ శాంతి ఉండాలి. ప్రతిచోటా శాంతి విస్తరించాలి. మన ఆత్మలో, మన చేతల్లో శాంతి ఉండాలి. జీవితం పరిపూర్ణమయ్యేందుకు అవసరమైన శాంతిని మనమంతా పొందాలి అని ఈ సంస్కృత శ్లోకం భావం). మన సృష్టిని కాపాడుకోవడంలోనే మన శాంతి నెలకొంది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశం పలు ఆరోగ్య సూచీల్లో గణనీయమైన ప్రగతిని సాధించింది. యాస్ (చర్మవ్యాధి), స్మాల్ పాక్స్ (మశూచి), పోలియో, గినియా వార్మ్ (నారికురుపు) వ్యాధి వంటి ఇన్‌ఫెక్షన్లను నిర్మూలించుకున్నాం. సగటు జీవితకాలాన్ని 69 ఏళ్లకు పెంచుకున్నాం. అంటువ్యాధులు, మాతృ, శిశు, పౌష్టికాహారలోపం తదితర కారణాలతో నమోదయ్యే మరణాల సంఖ్య 1990లో 61 శాతం ఉండగా.. 2016లో అది 33 శాతానికి తీసుకొచ్చాం. అయితే కొన్నేళ్లుగా వస్తున్న జీవనశైలిలో మార్పుల కారణంగా అసంక్రమిత వ్యాధులు ఎక్కువవుతున్నాయి. కొన్నేళ్ల క్రితం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) విడుదల చేసిన జాబితా ప్రకారం.. మన దేశంలో గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్, మధుమేహం మొదలైన అసంక్రమిత వ్యాధుల కారణంగానే 61శాతం మరణాలు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితి అత్యంత ఆందోళనకరం. దీనికి వీలైనంత త్వరగా అడ్డుకట్టవేయాలి. దేశవ్యాప్తంగా గ్రామీణ–పట్టణ ప్రాంతాల్లో వైద్య వసతుల విషయంలో స్పష్టమైన అంతరం కనబడుతున్న నేపథ్యంలో కరోనా వ్యాధి విస్తరిస్తున్న ఈ సమయం.. భారతదేశంలో ప్రజారోగ్యంపై మరింత పెట్టుబడులు పెరగాల్సిన అవసరాన్ని మనకు గుర్తుచేస్తోంది. లక్షన్నరకు పైగా ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పి ప్రాథమిక వైద్యాన్ని అందించడంతో పాటు 50కోట్ల మంది పేదలకు ఆరోగ్యబీమా సదుపాయాన్ని కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం 'ఆయుష్మాన్ భారత్' ద్వారా కొంతమేర ఈ సమస్యకు పరిష్కారం లభిస్తున్నప్పటికీ.. ప్రజారోగ్యం విషయంలో మరింత ప్రగతి జరగాల్సిన అవసరం ఉంది.

మనిషికి, ప్రకృతికి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని యావత్ ప్రపంచం అర్థం చేసుకుని మసలుకునేలా ఈ మహమ్మారి మరోసారి మనకు గుర్తుచేసింది. మొక్కలు, పశుపక్ష్యాదులు, ఇతర జీవరాశులతో కలిసి మనం ఈ భూగ్రహాన్ని పంచుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాలి. ఈ పరస్పర సమన్వయ గతిని సరిగ్గా అర్థం చేసుకోవాలి. మనుషులతోపాటు జంతువులు, చెట్లు, ప్రకృతి ఆరోగ్యవంతంగా ఉండేందుకు అవసరమైన బహుముఖ వ్యూహంతో డబ్ల్యూహెచ్‌వో రూపొందించిన 'వన్ హెల్త్' అనే భావనను మనమంతా ఆచరణలోకి తీసుకురావాలి. పరిపూర్ణ ఆరోగ్య ఫలితాలను పొందేందుకు వివిధ రంగాలను, వైద్య నిపుణులు, జీవశాస్త్రవేత్తలు, పశువైద్యులు, వైరస్‌లపై అధ్యయనం చేస్తున్నవారు (వైరాలజిస్టులు), పర్యావరణ వేత్తలతోపాటు ప్రభుత్వాల విధివిధానాలు, కార్యక్రమాల రూపకల్పనలో కృషిచేస్తున్న వారందరినీ ఒకచోటికి తెచ్చి మేధోమథనం జరపాల్సిన అవసరం ఉంది.

మనదంతా ఒకే ప్రపంచం. ఇక్కడ ప్రతీదీ పరస్పర అనుసంధానం, పరస్పర ఆధారితమే. ఈ సమతుల్యతను మనం కాపాడుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుంది. విజ్ఞానాన్ని వివేకంతో మేళవించాలి. సురక్షితమైన గ్రహాన్ని, మనుషులు, చెట్లు, పశుపక్ష్యాదుల పరిపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ సర్వసమ్మతితో ముందుకెళ్తూ.. ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరముంది.

*(నేడు, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం)*

# కరోనా పోరులో ఉద్యోగ పర్వం

## భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

చైనాలో కరోనా కల్లోలం ఎలా నెమ్మదించింది? ఆ దేశంలో గత కొద్ది రోజులుగా సబ్‌వే రైళ్ళలో ప్రయాణిస్తున్నవారి సంఖ్య 21 శాతం పెరుగగా, దేశీయ విమాన సర్వీసులలో రాకపోకలు సాగిస్తున్న వారి సంఖ్య 3 శాతం పెరిగింది. ఆటోమొబైల్ ఫ్యాక్టరీలలో ఉత్పత్తి కార్యకలాపాలు మళ్ళీ ప్రారంభమయ్యాయి. దేశ దేశాలకు అవసరమైన వైద్య పరికరాలను చైనాయే పెద్ద ఎత్తున సరఫరా చేస్తోంది. మరి ముంచుకొస్తోన్న ప్రపంచ ఆర్థిక మాంద్యం నుంచి చైనా తప్పించుకోగలుగుతుందని యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (అంక్టాడ్) పేర్కొనడంలో ఆశ్చర్యమేముంది? భారత్ కూడా, చైనా వలే మాంద్యం బారిన పడబోదని ఆ సంస్థ గట్టిగా అభిప్రాయపడింది. అంక్టాడ్ అంచనాకు ప్రాతిపదికలేమిటి? చైనా, భారత్‌లకు ప్రత్యేక ప్రాధాన్యమెందుకిచ్చింది? దురదృష్టవశాత్తు ఆ సంస్థ ఎటువంటి కారణాలను వెల్లడించలేదు. చైనా మాంద్యం ముప్పును తప్పించుకోగలగడానికి కారణాలలో ఒకటి కరోనా సంక్షోభం నుంచి శీఘ్రగతిన కోలుకొంటుండడమేనని కూడా అంక్టాడ్ పేర్కొంది. అయినప్పుడు అందుకు దోహదం చేసిన చర్యలేమిటి?

కరోనా వైరస్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు చైనా చేపట్టిన చర్యలలో మొదటిది వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించేందుకు అవసరమైన కిట్‌లను సమకూర్చడం. కేవలం మూడు వారాల వ్యవధిలో వాటిని తగు సంఖ్యలో అందుబాటులో ఉంచగలిగింది. దీనివల్ల వైరస్ సోకిన వ్యక్తులను గుర్తించడం, వారికి ఎవరి నుంచి వ్యాపించిందో తెలుసుకోవడం సుసాధ్యమయింది. రెండో చర్య మాస్క్‌లు, శానిటైజర్లు మొదలైన వ్యాధి రక్షణ సామగ్రిని భారీ స్థాయిలో లభించేలా చూడడం. మూడో చర్య వైరస్ ప్రబలని రాష్ట్రాలలో లాక్‌డౌన్ అమలుపరచడం. దీనివల్ల ఉహాన్ నుంచి కరోనా వ్యాప్తిని నిరోధించడం సాధ్యమయింది. నాలుగో చర్య నిర్దిష్ట వ్యాపార సంస్థల పునః ప్రారంభానికి అనుమతించడం. అయితే ఈ సంస్థలలో పనిచేసే ఉద్యోగి లేదా కార్మికునికి ఒక క్యుఆర్ కోడ్ ఇచ్చారు. దీని ప్రకారం ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ తన ఆరోగ్య పరిస్థితులను నివేదించవలసివుంటుంది. లాక్‌డౌన్ కాలంలో స్వేచ్ఛాయుత కదలికలకు అనుమతి లభించిన వారు ఎక్కడెక్కడకు వెళ్ళింది తెలుసుకోవడాన్ని ఇది సాధ్యం చేసింది. ఈ చర్యల వల్ల కరోనా విస్తరించే అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయి. వాటిని కచ్చితంగా పాటించిన పారిశ్రామిక సంస్థలు తమ ఉత్పత్తి కార్యకలాపాలను యథావిధిగా కొనసాగించేందుకు అనుమతించారు. మరో ముఖ్యమైన చర్య ప్రభుత్వం కరోనాకు సంబంధించిన సమాచారాన్ని నిరంతరం ప్రజలకు తెలియజేయడం. దీనివల్ల ప్రజలు పూర్తిగా సహకరించసాగారు. కరోనా వ్యాధి గురించిన పుకార్ల వ్యాప్తిని కూడా చైనా ప్రభుత్వం కట్టుదిట్టంగా అదుపు చేసింది.

మన దేశంలోనూ ఇటువంటి చర్యలను అమలుపరచాలి. కరోనా టెస్టింగ్ కిట్స్, వ్యాధి రక్షణ సామగ్రిని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసి ఆరోగ్య భద్రతా కార్యకర్తలకు అందుబాటులో ఉంచాలి. అవసరమైన ఇతర దేశాలకు సైతం వాటిని ఎగుమతి చేయాలి. రెండో చర్య ప్రతి రాష్ట్రం చుట్టూ కృత్రిమ సరిహద్దులను సృష్టించడం. ఏప్రిల్ 15 (21 రోజుల లాక్‌డౌన్ ముగిసిన మరుసటి రోజు)న ప్రభుత్వం ఒక సందిగ్ధ పరిస్థితి నెదుర్కోవలసిరావడం ఖాయం. ఎందుకని? లాక్‌డౌన్‌ను ఎత్తివేస్తే వైరస్ మరింతగా వ్యాప్తి చెందే అవకాశమున్నది. లాక్‌డౌన్‌ను కొనసాగిస్తే అసంఖ్యాక ప్రజలు ఆకలిదప్పులతో మలమలమాడిపోతారు. మార్గాంతరమేమిటి? ప్రతి రాష్ట్రంలోనూ కరోనా వ్యాప్తి ఏ స్థాయిలో ఉందో ఖచ్చితంగా అంచనా వేయాలి. వైరస్ బాధితుల గుర్తింపు మెరుగ్గా ఉండి, అంటువ్యాధి సంక్రమించిన వారి సంఖ్య తక్కువగా ఉన్న రాష్ట్రాలలో లాక్‌డౌన్ ఎత్తివేతకు అనుమతివ్వడం. మహారాష్ట్ర లాంటి రాష్ట్రాలలో లాక్‌డౌన్‌ను తప్పక కొనసాగించాలి ప్రజలు వీధుల్లో విచ్చలవిడిగా తిరగడాన్ని అరికట్టడంలో మహారాష్ట్ర ప్రభుత్వం విఫలమయింది. అటువంటి రాష్ట్రాలలో ప్రవేశాన్ని లేదా వాటి నుంచి నిష్క్రమణను కఠినమైన పరీక్షల అనంతరం మాత్రమే అనుమతించి తీరాలి. ఇలా చేయడం వల్ల కొన్ని రాష్ట్రాలలోనైనా ఆర్థిక కార్యకలాపాలు పూర్వపు స్థాయికి పుంజుకోవడం సాధ్యమవుతుంది.

**కరోనా కట్టడిలో ప్రభుత్వోద్యోగులను సంపూర్ణంగా నిమగ్నం చేయాలి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మొత్తం రెండు కోట్ల మంది ఉద్యోగులు వున్నారు. వీరిలో ఒక కోటి మందిని కరోనా వైరస్ నిరోధక విధుల్లో నియమించాలి. మన దేశంలో మొత్తం 30 కోట్ల కుటుంబాలు వున్నాయి. అంటే ఒక్కో ప్రభుత్వోద్యోగి సగటున 30 కుటుంబాలను కరోనా బారినుంచి కాపాడే బాధ్యతలను నిర్వహించవలసివుంటుంది. ఇందుకు వారు ప్రతిరోజూ ఆ 30 కుటుంబాల వారిని సందర్శించాలి. ఇది వారికేమీ కష్టం కాబోదు.**




కరోనా కట్టడిలో ప్రభుత్వోద్యోగులను సంపూర్ణంగా నిమగ్నం చేయాలి. అత్యవసర సేవలకు సంబంధించని విద్య, ప్రజాపనులు, న్యాయ వ్యవస్థ ఇత్యాది శాఖల ఉద్యోగులందరూ వెన్వెంటనే తమకు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధి నిర్వహణకు రిపోర్ట్ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించి తీరాలి. ఈ ప్రభుత్వోద్యోగులు ఒక్కొక్కరికీ పట్టణాలు, గ్రామాలలోని నిర్దిష్ట వీధులలోని ప్రజల ఆరోగ్య రక్షణ బాధ్యతలను అప్పగించాలి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మొత్తం రెండు కోట్ల మంది ఉద్యోగులు వున్నారు. వీరిలో ఒక కోటి మందిని కరోనా వైరస్ నిరోధక విధుల్లో నియమించాలి. మన దేశంలో మొత్తం 30 కోట్ల కుటుంబాలు వున్నాయి. అంటే ఒక్కో ప్రభుత్వోద్యోగి సగటున 30 కుటుంబాలను కరోనా బారినుంచి కాపాడే బాధ్యతలను నిర్వహించవలసి వుంటుంది. ఇందుకు వారు ప్రతిరోజూ ఆ 30 కుటుంబాల వారిని సందర్శించవలసి వుంటుంది. ఇది వారికేమీ కష్టం కాబోదు.

కేంద్ర ప్రభుత్వం ప్రతి సాయంత్రమూ దేశంలో కరోనా సంక్షోభ తాజా పరిస్థితి గురించి ప్రజలకు సమాచారమివ్వాలి. రాష్ట్రాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ విధిని నిత్యం నిర్వర్తించాలి. కాయకష్టం మీద బతికే నిరుపేదలు, ఇతర దుర్బల వర్గాల వారికి ప్రభుత్వం ప్రతి రోజూ ఆహారం సమకూర్చాలి. నిధులు చాలినంతగా లేనిపక్షంలో ప్రభుత్వోద్యోగుల వేతనాలు, పెన్షన్లలో 50 శాతం కోత విధించైనా సరై ఈ విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాలి. సామాన్య ప్రజలు ఆకలి దప్పులతో నకనకలాడుతుండగా ప్రభుత్వోద్యోగులు పూర్తిస్థాయి వేతన భత్యాలతో ఇంటి వద్దనే సంతోషంగా గడపడం సబబు కాదు కదా. కనుక కరోనా కాలంలో ఆర్థిక మాంద్యం నెలకొనకుండా ఉండాలంటే పైన ప్రస్తావించిన చర్యలన్నిటినీ చేపట్టేందుకు ప్రభుత్వం తక్షణమే పూనుకోవాలి.

*(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)*

ఓల్డ్ ఏజ్ కేర్

# వీరు మరింత అప్రమత్తంగా...

వృద్ధులకు కరోనా వైరస్ సోకే అవకాశాలు ఎక్కువ. కాబట్టి ఇతరులతో పోలిస్తే, వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఇందుకోసం అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, కొన్ని ప్రత్యేక రక్షణ చర్యలూ పాటించాలి.

**చేయవలసినవి...**

- ఇంట్లోనే ఉండాలి. ఇంటికి వచ్చిన అతిథులను కలవకపోవడమే మేలు. ఒకవేళ కలవవలసివస్తే కనీసం రెండు మీటర్ల దూరం పాటించాలి.
- తరచుగా చేతులతో పాటు, ముఖం కూడా సబ్బుతో కడుగుతూ ఉండాలి.
- మోచేతిని అడ్డం పెట్టుకుని, లేదంటే టిష్యూ పేపర్/చేతి రుమాలులో మాత్రమే తుమ్మాలి. తుమ్మిన తర్వాత చేతి రుమాలును ఉతుక్కోవాలి. టిష్యూ పేపర్‌ను పారేయాలి. చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.



- ఇంట్లో వండిన వేడిగా ఉండే పోషకాహారం తీసుకోవాలి. తరచుగా నీళ్లు తాగుతూ ఉండాలి. వ్యాధినిరోధకశక్తి మెరుగుదల కోసం తాజా పళ్లరసాలు తాగాలి.
- తేలికపాటి వ్యాయామంతో పాటు ధ్యానం చేయాలి.
- వైద్యులు సూచించిన మందులు క్రమం తప్పకుండా వాడాలి.
- దూరంగా ఉన్న బంధువులు/స్నేహితులతో ఫోన్/వీడియోకాల్ ద్వారా వారి క్షేమసమాచారాలు తెలుసుకుంటూ, అవసరమైన సహాయం పొందడం ఉత్తమం.
- చేయించుకోవలసిన సర్జరీలు (క్యాటరాక్ట్, మోకాలి మార్పిడిలాంటివి) ఉంటే, వాటిని ప్రస్తుతం వాయిదా వేసుకోవడం మేలు.
- తరచుగా తాకే వీలు ఉన్న ఉపరితలాలను (డోర్ నాబ్స్, గడియలు) క్రిమినాశని అయిన డెట్టాల్ లాంటి వాటితో శుభ్రం చేయాలి.
- దగ్గు, జ్వరం, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులు మొదలైన వెంటనే ఆలస్యం చేయకుండా దగ్గర్లోని వైద్యులను సంప్రతించాలి.

**చేయకూడనివి...**

- ముఖం దాచుకోకుండా, అరచేతులు అడ్డు పెట్టుకుని తుమ్మకూడదు.
- జ్వరం, దగ్గు ఉంటే ఇతరులకు సన్నిహితంగా వెళ్లకూడదు.
- నాలుక, ముక్కు, కళ్లను చేతులతో తాకకూడదు.
- సొంత వైద్యం చేసుకోకూడదు.
- ఇతరులతో కరచాలనం చేయడం, గుండెలకు హత్తుకోవడం చేయకూడదు.
- రొటీన్ చెకప్ కోసం ఆస్పత్రులకు వెళ్లకూడదు. అవసరమైన సమయంలో ఫోన్ ద్వారా వైద్యులను సంప్రతించాలి.

మీకు తెలుసా!

# చేయి దూరంలో...

కరోనా వేగంగా వ్యాపిస్తోన్న నేపథ్యంలో ప్రతి 20 నిమిషాలకు ఓసారి చేతులు కడుక్కోమని వైద్యులు చెబుతున్నారు. అయితే చేతులు కడుక్కోవడంతో పాటు ముఖంలోని కళ్లు, ముక్కు లాంటి శరీర భాగాలను తరచూ తాకకుండా చూసుకోవడమే వైరస్‌ను అడ్డుకోవటానికి ఉత్తమ మార్గం. ఇదే విషయాన్ని గతంలో జరిగిన పలు పరిశోధనలు వెల్లడించాయి. ఆస్ట్రేలియాలో 26 మంది వైద్య విద్యార్థుల మీద జరిపిన పరిశోధనలో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. గంటకు సుమారు 23 సార్లు మనం చేతులతో ముఖంలోని పలు భాగాలను తాకుతామని అందులో వెల్లడైంది. గంట వ్యవధిలో గడ్డం, కణత, చెక్కిళ్లు, పెదవులను నాలుగుసార్లు... ముక్కు, నుదురును మూడు సార్లు... చెవులను ఒకసారి చొప్పున తాకారు. కరోనా సులువుగా శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉన్న నోరు, కళ్లు, ముక్కు భాగాలను ఎక్కువసార్లు తాకినట్టు వెల్లడైంది.

గైనిక్ కేర్



**ఇంట్లో గర్భిణి ఇలా....**

గర్భిణులు ఉండే గదిలోకి ధారాళంగా వెలుగు, గాలి రావాలి. ఇతర కుటుంబ సభ్యులకు టాయిలెట్ వేరుగా ఉండాలి. సరిపడా ఆహారం, నీరు, శుభ్రత పాటించడానికి అవసరమైన సౌకర్యాలు కలగజేయాలి. ఏదైనా ఇతర ఆరోగ్య సమస్య వస్తే, చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు ఉండాలి.

చైనా ఎల్లలు దాటి ప్రపంచమంతటా వేగంగా విస్తరించిన కొత్తరకం కరోనా వైరస్ (కొవిడ్ - 19) భయంతో మానవాళి వణికిపోతోంది. నిరంతర పరిశోధనలు జరుగుతున్నా, కొవిడ్ - 19 వైరస్‌కు టీకా కనుక్కోవడానికి ఇంకా సమయం పడుతుందని అంటున్నారు. ఇలాంటి సందర్భంలో గర్భిణులకు ఈ వైరస్ సోకకుండా ఎలా వ్యవహరించాలి? కరోనా ఇన్‌ఫెక్షన్ నుంచి తల్లీబిడ్డలను కాపాడుకునేదెలా?

**ప్రసవం!**

సహజ ప్రసవం, సిజేరియన్‌లలో ఏది ఉత్తమం అని చెప్పడానికి ఇప్పటికీ ఆధారం ఏమీ లేదు.

# గర్భిణులకు కరోనా సోకకుండా...

గర్భం దాల్చినప్పుడు సహజంగా జరిగే మార్పుల వల్ల గర్భిణి ఊపిరితిత్తుల సామర్థ్యం కొంత తగ్గుతుంది. ఆక్సిజన్ మామూలుగా కంటే ఎక్కువగా వినియోగం అవుతుంది. అందువల్ల, వ్యాధినిరోధక శక్తి తగ్గుతుంది. దీనివల్ల గర్భిణులకు సహజంగానే శ్వాససంబంధ వ్యాధుల దుష్పరిణామాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. కానీ తగిన జాగ్రత్తలు పాటిస్తూ, అప్రమత్తంగా వ్యవహరిస్తే కరోనా సోకకుండా నియంత్రించుకోవచ్చు!

**గర్భిణి నుండి గర్భస్థ శిశువుకు కరోనా?**

దీనికి సంబంధించి పరిశోధనలు పరిమితంగానే ఉన్నాయి. ఇన్ఫెక్షన్ ఉన్న తల్లి నుండి బిడ్డకు వ్యాధి సంక్రమించదనీ, నెలలు నిండక మునుపే ప్రసవం కావడం, శిశువుకు అంగవైకల్యాలు వచ్చే ప్రమాదం లాంటివి కొవిడ్-19 వైరస్‌తో ఉండవనీ పరిశోధకులు చెబుతున్నారు. కానీ, దీనికి సంబంధించి ముందు ముందు ఎలాంటి నివేదికలు వస్తాయో తెలియదు.

**గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

మామూలుగా అందరూ తీసుకోవలసిన జాగ్రత్తలే గర్భిణులు కూడా పాటించాలి. తరచుగా సబ్బునీటితో లేక ఆల్కహాల్ ఉన్న శానిటైజర్‌తో చేతుల్ని కడుక్కోవాలి. దగ్గు, తుమ్ములు ఉన్న వ్యక్తికి దూరంగా ఉండాలి. కళ్ళు, ముక్కు, నోటిని చేతితో తాకకుండా జాగ్రత్తగా ఉండాలి. జనసమ్మర్దం ఉన్న చోటుకు వెళ్ళరాదు. వ్యాధి లక్షణాలేమైనా కనిపిస్తే వెంటనే డాక్టర్‌కు చూపించుకోవాలి. సకాలంలో అవసరమైన పరీక్షల్ని చేయించుకోవాలి. డాక్టర్ చెప్పిన సూచనలనూ, ముందు జాగ్రత్త చర్యలనూ పాటించాలి. అవసరమైతే తగిన చికిత్సను చేయించుకోవాలి. వీటిని గర్భిణులు తప్పనిసరిగా, కచ్చితంగా పాటించాలి. ఉద్యోగినులైన గర్భిణులకు తక్కువ ప్రమాదం ఉన్న పనుల్ని కేటాయించాలి. పద్నాలుగు రోజుల పాటు ఇంటి నుండి పని చేయడం, లేదంటే సెలవు తీసుకోవడం వాళ్ళకు సహాయపడుతుంది.

**గర్భిణుల పట్ల వైద్యులు, ఆరోగ్య సిబ్బంది తీసుకోవలసిన చర్యలు...**

పరీక్షకు మామూలు వ్యవధిలో కన్నా కొంత ఆలస్యంగా రమ్మనాలి. ఆస్పత్రికి వచ్చాక సాధ్యమైనంత త్వరగా పరీక్ష చేసి పంపేయాలి. స్వల్పమైన సమస్యలకు హాస్పటల్‌కు రమ్మనకుండా టెలిఫోన్ ద్వారా, లేదంటే ఫేస్ టైమ్, వాట్సాప్ వీడియోకాల్ ద్వారా (ముఖ్యంగా మొదటి ఇరవై వారాలు) సలహాలివ్వాలి. ముఖాముఖిగా జరిపే యాంటీ నేటల్ క్లాసులను వాయిదా వెయ్యాలి. రోగి ఆస్పత్రిలో ఉన్నప్పుడు భర్తను కానీ, లేదంటే ఎవరో మరొకరిని మాత్రమే అనుమతించాలి. ఆస్పత్రి నుంచి మామూలుగా కంటే త్వరగా డిశ్చార్జి చెయ్యాలి.

## ప్రసవం తరువాత?



ఇన్ఫెక్షన్ వచ్చి కోలుకున్న గర్భిణులలో యాంటీబాడీలు ఉత్పత్తి అయి, అవి తల్లి పాల ద్వారా శిశువుకు చేరి శిశువుకు రక్షణ లభిస్తుందని కొన్నిఅధ్యయనాలు తెలుపుతున్నాయి. అందువల్ల శిశువుకు తల్లి పాలు ఇవ్వడమే మేలు!

గర్భం, ప్రసవం గురించి మామూలుగానే గర్భిణులకు అనేక సందేహాలు, భయాలు ఉంటాయి. ప్రస్తుత వాతావరణంలో అవి మరింత ఎక్కువయ్యే అవకాశాలూ లేకపోలేదు. అయితే భయానికి లోనవకుండా, ధైర్యాన్ని కూడదీసుకోవాలి. వైద్యులు సూచించే అన్ని జాగ్రత్తలనూ నిష్ఠగా పాటించాలి. అప్పుడే కరోనా వైరస్ బారిన పడకుండా పండంటి బిడ్డను ప్రసవించగలుగుతారు.



**- డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి**
శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్, హైదరాబాద్. 984902441 (కన్సల్టేషన్ కోసం)

పరిశోధన

# బూట్లు ఇంటి బయటే...

కరచాలనం ద్వారా కరోనా వైరస్ సోకే ప్రమాదం ఉందనే వార్తలు రావడంతో, బూట్లను తాకించి అభివాదం చేసే వీడియోలు, మీమ్‌లు సోషల్‌మీడియాలో అందరినీ నవ్వించాయి. అయితే తాజాగా జరిపిన ఓ అధ్యయనంలో బూట్ల విషయంలోనూ జాగ్రత్త పడాలని తేలింది.



కరోనా వైరస్ వేర్వేరు ఉపరితలాల మీద వేర్వేరు సమయాల పాటు సజీవంగా ఉంటుంది. మార్కెట్లు, ఆస్పత్రులు లాంటి జనసమ్మర్దం ఎక్కువగా ఉన్న ప్రదేశంలో బూట్లతో నడిచినప్పుడు ఈ వైరస్ బూట్లకూ అంటుకునే ప్రమాదం ఉంది. సాధారణంగా బూట్లు లెదర్, ప్లాస్టిక్, రబ్బర్ మెటీరియల్స్‌తో తయారవుతూ ఉంటాయి. కరోనా సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, లేదా తుమ్మినప్పుడు తుంపర్లు బూట్ల మీద పడే ప్రమాదం ఉంటుంది. ఇలా పడిన కరోనా వైరస్ సుమారు ఐదు రోజుల పాటు సజీవంగా ఉంటుంది. ఇవే బూట్లతో నేరుగా ఇంటికి చేరుకుంటే, వాటి ద్వారా వైరస్ ఇంట్లోని కుటుంబసభ్యులకు సోకే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఈ జాగ్రత్తలు పాటించాలి.

- ఇంటికి చేరుకున్న వెంటనే బూట్లు, లేదా చెప్పులను ఇంటి బయటే వదిలేయాలి.
- జనసమ్మర్ధం ఎక్కువగా ఉన్న ప్రాంతానికి వెళ్లి వచ్చిన వెంటనే బూట్లను సబ్బునీటితో కడగాలి.
- బూట్లు వాషింగ్‌మిషన్‌లో ఉతికే వీలున్న రకానికి చెందినవైతే, వాషింగ్‌మిషన్‌లో వేయాలి.
- లెదర్ బూట్లను డిస్ ఇన్‌ఫెక్టెంట్‌తో శుభ్రం చేయాలి.
- గుమ్మంలో శుభ్రమైన చెప్పులు ఉంచుకుని, బయట నుంచి ఇంటికి చేరుకున్న వెంటనే ధరించిన చెప్పులు లేదా బూట్లు వదిలేసి, శుభ్రమైన చెప్పులు ధరించి ఇంట్లోకి అడుగు పెట్టాలి.
- ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు చెప్పులకు బదులుగా బూట్లు ధరించడం మేలు.

అధ్యయనం

# కరోనాను చంపే డ్రగ్?



కరోనాను సంహరించే మందు లేదా వ్యాక్సిన్ కోసం ప్రపంచవ్యాప్తంగా పలు ప్రయోగాలు, అధ్యయనాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా వాడుకలో ఉన్న యాంటీవైరల్ డ్రగ్ 'ఐవర్‌మెక్టిన్' కణంలో కరోనా వైరస్ పెరుగుదలను నియంత్రిస్తుందని 'యాంటీవైరల్ రీసెర్చ్' అనే ఆస్ట్రేలియాకు చెందిన ఓ జర్నల్ ప్రచురించింది. "కణంలోకి ప్రవేశించిన మొత్తం కరోనా ఆర్.ఎన్.ఎను ఈ డ్రగ్ 48 గంటల్లో తొలగించగలుగుతుందని ఆస్ట్రేలియా మొనాష్ యూనివర్శిటీకి చెందిన కైలీ వాంగ్‌స్టాఫ్ చెప్పారు. ఐవర్‌మెక్టిన్ అనే ఈ యాంటీపారసైటిక్ డ్రగ్ డెంగ్యూ, ఇన్‌ఫ్లూయెంజా, జికా వైరస్‌లను సమర్థంగా నిర్మూలించే ప్రభావం కలిగి ఉందని నిరూపణ అయింది. అయితే ఇప్పటివరకూ ఇన్‌విట్రో పరీక్షల ద్వారా మాత్రమే ఈ విషయం నిరూపణ అయింది. ఈ దశ దాటి మనుషుల మీద ప్రయోగాలు చేసిన తర్వాతే ఈ డ్రగ్ కరోనాను కూడా అంతే సమర్థంగా నిర్మూలించగలదో, లేదో తెలుసుకోగలం అంటున్నారు డాక్టర్ వాంగ్‌స్టాఫ్. పాండెమిక్‌గా మారిన కరోనా వైరస్, దాన్ని సంహరించే మందుల లభ్యత లేని ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ డ్రగ్ ప్రభావం నిరూపణ అయిన పక్షంలో, కరోనా మీద తక్షణమే విజయం సాధించవచ్చు అని కూడా అంటున్నారాయన.

హెల్త్‌కేర్

*క్లినిక్‌లు బంద్. ఆసుపత్రుల్లో సాధారణ సేవలు బంద్! క్లినికల్ లేబరేటరీలు తెరుచుకోవడం లేదు. కావలసిన మందులు దొరకడం లేదు! లాక్‌డౌన్‌తో షుగర్, బీపీ లాంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థుల పరిస్థితి అగమ్యగోచరమైపోయింది! అయితే ఆందోళన ఆరోగ్యంపై మరింత దుష్ప్రభావం చూపిస్తుంది! తగిన జాగ్రత్తలు పాటిస్తే లాక్‌డౌన్ సమయంలోనూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు!*

# ఇబ్బందే... కానీ ఆందోళన వద్దు!



ప్రాణాంతక కరోనా వైరస్‌ను కట్టడి చేయడానికి విధించిన లాక్‌డౌన్ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల్లో ఆందోళన పెంచుతోంది. మధుమేహం, రక్తపోటు ఉన్నవారిపైనా, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీవ్యాధులు, క్యాన్సర్ బాధితులలో వైరస్ వ్యాప్తిచెందే అవకాశాలు ఎక్కువగా ఉండడం అందుకు కారణం.

**జీవనశైలిపై ప్రభావం!**

ఉదయం, సాయంత్రం నడిచే అలవాటు ఉన్న షుగర్, బిపి ఉన్నవారు ప్రస్తుతం వీధుల్లోకి వెళ్ళి నడిచే అవకాశం లేదు. అలాగే ఇంటికే పరిమితం అవడంతో అవసరానికి మించి ఆహారం తీసుకుంటూ ఉంటారు. శరీరానికి స్వల్ప వ్యాయామం కరువవడం, ఆహారం పెరగడం వల్ల శరీరంలోని చక్కెర, రక్తపోటు స్థాయిలు పెరిగే అవకాశం లేకపోలేదు. అలాగే మధుమేహం, రక్తపోటు సంబంధిత మందులకు కూడా కొరత ఏర్పడింది. ఈ పరిస్థితిలో ఏం చేయాలి?

**ఈ జాగ్రత్తలు పాటిద్దాం!**

**ఒకటి, రెండు నెలలు ఫరవాలేదు:** ఎంతో కాలంగా షుగర్, బీపీలతో బాధపడుతున్నవారు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకొని, మందులు వాడి ఉంటారు. కాబట్టి ఒకటి రెండు నెలలు పరీక్షలు చేయించుకోకపోయినా అంతగా నష్టం ఉండదు. అనవసరంగా ఆందోళన చెంది, కొత్త సమస్యలు తెచ్చుకోకూడదు.

**వ్యధకు గురికావద్దు:** ప్రస్తుతం నెలవారీ ఆరోగ్య పరీక్షలకు వీలు లేకపోవడం, వ్యాయామం లేకపోవడం, ఆహార మార్పుల వల్ల షుగర్, బీపీ స్థాయులు పెరిగినట్టు అనిపించడం సహజం. కంగారు పడకూడదు.

**వాటినే కొనసాగించాలి:** బీపీ, షుగర్ స్థాయుల గురించి ఎక్కువగా ఆలోచించకుండా ఇదివరకు వాడుతున్న మందులనే కొనసాగించాలి. అవి దొరక్కపోతే అదే కాంబినేషన్ ఉన్న వేరే మందులు వేసుకోవచ్చు. అనుమానాలు పెట్టుకోనవసరం లేదు.

**తక్కువ ఆహారం ఎక్కువసార్లు:** వ్యాయామం లోపించింది కాబట్టి శరీర కనీస అవసరాలకు అవసరమైన క్యాలరీలు ఇచ్చే ఆహారాన్నే తీసుకోవడం మంచిది. అందుకోసం తక్కువ ఆహారం ఎక్కువసార్లు తీసుకోవాలి.

**ఇవి తినాలి:** జీర్ణక్రియకు ఎక్కువ సమయం తీసుకునే రాగి, జొన్న, సజ్జ, కొర్రలు వంటి చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం మంచిది. షుగర్ బాధితులు పంచదార పూర్తిగా మానేసి బెల్లం, తాటిబెల్లం లాంటివి తీసుకోవచ్చు. పంచదారకు బదులుగా ఉపయోగించే స్టీవియా వాడడం ఇంకా మంచిది. స్వీట్స్ మానేయాలి. నూనెలు బాగా తగ్గించాలి. బీపీ బాధితులు ఉప్పు వాడకాన్ని తగ్గించుకోవాలి.

**ఇంట్లోనే వ్యాయామం:** పగటి సమయంలో ఎక్కువ సేపు ఒకే చోట కూర్చోకుండా ఇంట్లోనే అటూ, ఇటూ తిరుగుతూ వ్యాయామం చేయవచ్చు. యోగా, ధ్యానం కూడా చేసుకోవచ్చు.

**పదే పదే పరీక్షలు వద్దు:** చాలామంది ఇంట్లో ఉండే గ్లూకో మీటర్‌తో బ్లడ్‌షుగర్‌ను, డిజిటల్ బిపి ఆపరేటర్‌తో రక్తపోటు స్థాయులనూ పదే పదే చెక్ చేసుకుంటూ ఉంటారు. వచ్చిన ఫలితాలు చూసి ఆందోళన చెందవద్దు. ఒకటి రెండు నెలలు బీపీ, షుగర్ స్థాయిల్లో పెరుగుదల ఉన్నా నష్టం ఏమీ లేదు. కాంప్లికేషన్స్ అంత త్వరగా రావు.

**సొంత వైద్యం వద్దు:** వైద్యుడిని ఫోన్ ద్వారా సంప్రతించి సలహాలు తీసుకోవచ్చు. అత్యవసరం అయితే 108 సేవలను ఉపయోగించుకోండి. ఏదో జరిగిపోతుందన్న భయంతో సొంత వైద్యం చేసుకోకూడదు. లాక్‌డౌన్ ముగిశాక మీ వైద్యుణ్ణి కలిసి, అవసరమైన పరీక్షలు చేయించుకోండి.

**- డాక్టర్ టి. సేవకుమార్**
సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, గుంటూరు

స్ఫూర్తి

# నర్సుగా మారిన నటి



నటీమణులకు బాహ్య సౌందర్యమే కాదు... అందమైన మనసు కూడా ఉంటుందని నిరూపించింది శిఖా మల్హోత్రా. 'కాంచ్‌లీ' చిత్రంతో బాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకున్న శిఖా... కరోనా విజృంభిస్తున్న వేళ నర్సుగా అవతారమెత్తారు. ఇప్పుడు ముంబయ్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని హాస్పిటల్‌లో సేవలిందిస్తున్నారు.

అసలే మహారాష్ట్ర... అందులో ముంబయ్ మహానగరం. ఆ రాష్ట్రంలో కొవిడ్-19 కేసులు అక్కడే అధికం. కానీ శిఖా వెనుకాడలేదు. ఢిల్లీలోని సఫ్దర్‌గంజ్ హాస్పిటల్‌లో బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ చదివిన ఆమె... వలంటీర్‌గా అనుమతించాలంటూ ముంబయ్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కోరారు. అందుకు కార్పొరేషన్ ఓకే చెప్పింది. దీంతో మార్చి 27న ఆసుపత్రిలోని ఐసొలేషన్ వార్డులో వలంటీర్ నర్సుగా విధుల్లో చేరిపోయారు ఆమె.

'హిందూ హృదయ్ సమ్రాట్ బాలాసాహెబ్ థాకరే ట్రామా హాస్పిటల్' ఐసొలేషన్ వార్డు నుంచి తన ఫొటోను శిఖా ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పోస్ట్ చేశారు. అది చూసిన జనం ఆమెలోని సేవామూర్తికీ... సాహసానికీ సాహో అంటున్నారు. ఇంకో విషయం ఏమిటంటే... శిఖా నర్సింగ్ డిగ్రీ అయితే తీసుకున్నారు కానీ, ఇప్పటి వరకు నర్సుగా ఎక్కడా పనిచేయలేదు. కారణం... నటనపై ఆమెకు ఉన్న మక్కువ. ఆ మక్కువతోనే నటిగా తనను తాను నిరూపించుకోవాలనుకున్నారు. అలా కలను నిజం చేసుకొని, వెండి తెరపై మురిపిస్తున్న శిఖాలో నర్సుగా మారాలన్న స్ఫూర్తినిచ్చింది ఎవరో కాదు... ఆమె తల్లే!

అవును... శిఖా మల్హోత్రా తల్లి కూడా నలభై ఏళ్లు నర్సుగా పనిచేసి రిటైర్ అయ్యారు. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్‌లో చెప్పిన శిఖా... తన తల్లి ఫొటోను కూడా అప్‌లోడ్ చేసింది. ఎక్కడ ఉన్నా దేశ సేవకు తాను ఎప్పుడూ సిద్ధంగానే ఉంటానంటున్న శిఖా మల్హోత్రా దయచేసి అందరినీ ఇంట్లోనే ఉండమని వేడుకొంటున్నారు. 'నర్సింగ్‌లో బీఎస్సీ ఆనర్స్ చేసి, ఐదేళ్లు సఫ్దర్‌గంజ్ ఆసుపత్రిలోనే గడిపాను. ఆ అనుభవంతోనే ఈ విపత్కర సమయంలో నర్సుగా విధుల్లో చేరాను. నా కృషిని మీరందరూ అభినందిస్తారని కోరుకొంటున్నాను' అన్నారు శిఖా.

తెలుసుకొందాం

# మళ్లీ వచ్చే ఛాన్స్ ఉందా?



కొందరికి ఒకసారి వచ్చిన కరోనా ఇన్‌ఫెక్షన్ చికిత్సతో తగ్గినట్టు కనిపించినా, మళ్లీ తిరగబెడుతూ ఉంటుంది. ఇలా మన దేశంతో పాటు, చైనా, జపాన్, దక్షిణ కొరియాల్లో కొన్ని సందర్భాల్లో రుజువైంది. ఇలాంటి రీ ఇన్‌ఫెక్షన్ ఎందుకు వస్తోంది?

కొందరు కరోనా పాజిటివ్ వ్యక్తులకు చికిత్సతో అంతిమంగా నెగటివ్ ఫలితం పొందినా, కొద్ది రోజులకే మళ్లీ పాజిటివ్‌గా తేలుతూ ఉంటారు. ఇందుకు కారణం వారికి కరోనా వైరస్ మళ్లీ సోకింది అనుకుంటే పొరపాటు. నిజానికి శరీరంలో దాగిన వైరస్, చికిత్స తర్వాత జరిపే పరీక్షల్లో దొరకకపోవడమే ఇందుకు అసలైన కారణం. పరీక్ష కోసం సేకరించిన స్పెసిమెన్ నాణ్యత తక్కువగా ఉన్నా నెగటివ్ ఫలితం వచ్చే అవకాశం ఉంటుంది అంటున్నారు యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్ మెడికల్ బ్రాంచ్‌కు చెందిన వైరాలజిస్ట్ డాక్టర్ వినీత్. ఎలాంటి వైరస్ సోకినా, పది రోజుల వరకూ శరీరంలో తయారయ్యే యాంటీబాడీస్ వైరస్‌తో పోరాడుతూనే ఉంటాయనీ, ఫలితంగా శరీరంలో వైరస్ సమూలంగా నశించకపోయినా, పరీక్ష చేసినప్పుడు ఫలితం నెగటివ్‌గా వచ్చే అవకాశం ఉంటుందని కూడా ఆయన అంటున్నారు. కాబట్టి పదే పదే పాజిటివ్ ఫలితం వస్తే, దాన్ని రీ ఇన్‌ఫెక్షన్‌గా భావించకూడదు అని అంటున్నారాయన.

## కెనరా బ్యాంక్ వడ్డీ రేట్ల తగ్గింపు

ముంబై : ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్.. రెపో అనుసంధానిత వడ్డీ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్) 0.75 శాతం, ఎంసీఎల్ఆర్ ఆధారిత వడ్డీ రేటు 0.35 శాతం తగ్గించినట్టు ప్రకటించింది. ఈ కొత్త వడ్డీ రేట్లు మంగళవారం నుంచే అమల్లోకి వస్తాయి. ఈ తగ్గింపుతో ఆర్ఎల్ఎల్ఆర్ 7.30 శాతానికి, ఏడాది కాలపరిమితి గల ఎంసీఎల్ఆర్ 7.85 శాతానికి దిగివచ్చాయి. ఇవి కాకుండా 6 నెలల ఎంసీఎల్ఆర్ 0.30 శాతం తగ్గి 7.80 శాతానికి చేరగా 3 నెలల ఎంసీఎల్ఆర్ 0.20 శాతం తగ్గి 7.75 శాతం అయింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి సిండికేట్ బ్యాంక్ విలీనం అయినందు వల్ల ఈ కొత్త వడ్డీ రేట్లు విలీనంతో ఏర్పడిన కొత్త బ్యాంకుకే వర్తిస్తాయని పేర్కొంది.

### భారతి ఆక్సా-ఎయిర్‌టెల్ పేమెంట్స్
## కోవిడ్ బీమా ప్లాన్లు

ముంబై : ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ తమ కస్టమర్లకు కోవిడ్-19ను ఎదుర్కొనేందుకు అవసరమైన ఆరోగ్య బీమా స్కీమ్‌లు అందించడానికి భారతి ఆక్సా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద ఆ కంపెనీలు రెండు ఆరోగ్య బీమా స్కీమ్‌లు అందుబాటులోకి తెచ్చాయి. భారతి ఆక్సా గ్రూప్ హెల్త్ అష్యూర్ పేరిట అందిస్తున్న స్కీమ్ బాధితులకు రూ.25,000 ఏకమొత్తంలో బీమా అందిస్తుంది. గ్రూప్ హాస్పిటల్ క్యాష్ పేరిట అందించే ప్లాన్ కింద రోగులకు ఆస్పత్రిలో ఉన్న సమయంలో గరిష్ఠంగా 10 రోజుల పాటు రూ.500, రూ.1000 రోజువారీ ప్రయోజనం కల్పిస్తుంది. ఇవి పొందడానికి ఎలాంటి వైద్యపరీక్షలు అవసరం లేదు. పాలసీల కాలపరిమితి ఏడాది.

# కుబేరులకూ 'కరోనా' కష్టాలు



### హరించుకుపోతున్న సంపద

**నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు**

- జాబితా నుంచి ఓయో అధినేత రితేశ్ అగర్వాల్ ఔట్
- 13,100 కోట్ల డాలర్ల సంపదతో ప్రథమ స్థానంలో జెఫ్ బెజోస్
- 9,100 కోట్ల డాలర్లతో రెండో స్థానంలో బిల్ గేట్స్
- టాప్-100 నుంచి ముగ్గురు భారతీయులు ఔట్
- జాబితాలోకి కొత్తగా ఆరుగురు చైనీయులు

**ప్రపంచంలో 10 మంది బిలియనీర్ల సంపద** (కోట్ల డాలర్లలో)

| పేరు | కంపెనీ | సంపద విలువ | మార్పు |
|---|---|---|---|
| జెఫ్ బెజోస్ | అమెజాన్ | 13,100 | - 900 |
| బిల్ గేట్స్ | మైక్రోసాఫ్ట్ | 9,100 | - 1,500 |
| వారెన్ బఫెట్ | బెర్క్‌షైర్ హాత్‌వే | 8,300 | - 1,900 |
| బెర్నార్డ్ అర్నాల్ట్ | ఎల్‌వీఎంహెచ్ | 7,700 | - 3,000 |
| మార్క్ జుకర్‌బర్గ్ | ఫేస్‌బుక్ | 7,100 | - 1,300 |
| అమాన్సియో ఒటెగే | ఇండిటెక్స్ | 6,400 | - 1,700 |
| స్టీవ్ బామర్ | మైక్రోసాఫ్ట్ | 6,000 | - 750 |
| అలిస్ వాల్టన్ | వాల్‌మార్ట్ | 5,800 | - 100 |
| జిమ్ వాల్టన్ | వాల్‌మార్ట్ | 5,600 | - 100 |
| సెర్జీ బిన్ | గూగుల్ | 5,550 | - 1,250 |

### రెండు నెలల్లో రూ.1.44 లక్షల కోట్లు తగ్గిన ముకేశ్ అంబానీ ఆస్తి

- తొమ్మిదో స్థానం నుంచి 17వ స్థానానికి చేరిక
- గౌతమ్ అదానీ, ఉదయ్ కోటక్ సంపదకూ గండి: హురన్ గ్లోబల్

ముంబై : కరోనా వైరస్ (కోవిడ్-19) సామాన్యులకే కాదు.. అపర కుబేరులకూ చుక్కలు చూపిస్తోంది. ఈ మహమ్మారి దెబ్బకు వీరి నిర్వహణలోని కంపెనీల షేర్ల ధరలు కుప్పకూలుతున్నాయి. ఆ ప్రభావం వీరి సంపదపైనా కనిపిస్తోంది. గత రెండు నెలల్లో భారత స్టాక్ మార్కెట్ 26 శాతం వరకు నష్టపోయింది. దీంతో వంద కోట్ల డాలర్ల కంటే ఎక్కువ సంపద ఉన్న దేశీయ బిలియనీర్ల సంపద భారీగా కరిగిపోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ సంపదే ఇందుకు ఉదాహరణ. ఈ ఏడాది జనవరి నెలాఖరుకు 6,700 కోట్ల డాలర్లు ఉన్న ముకేశ్ అంబానీ సంపద.. కరోనా దెబ్బతో మార్చి నెలాఖరుకు 28 శాతం తగ్గి 4,800 కోట్ల డాలర్లకు చేరింది. గత రెండు నెలల్లోనే అంబానీ సంపద రూ.1.44 లక్షల కోట్లు (1,900 కోట్ల డాలర్లు) ఆవిరై పోయింది. అంటే రోజుకు రూ.2,280 కోట్లు నష్టపోయారు. దీంతో జనవరి నెలాఖరు నాటికి ప్రపంచంలో అత్యంత ధనవంతుల జాబితాలో తొమ్మిదో స్థానంలో ఉన్న ముకేశ్ అంబానీ, మార్చి నెలాఖరుకు 17వ స్థానానికి పడిపోయారు. ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల ఆస్తుల వివరాలను ప్రకటించే 'హురన్ గ్లోబల్' సంస్థ తన తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది.

దేశంలోని మిగతా బిలియనీర్లదీ ఇదే పరిస్థితి. ఇదే కాలంలో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ సంపద 600 కోట్ల డాలర్లు (37 శాతం), హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ అధినేత శివ్ నాడార్ సంపద 500 కోట్ల డాలర్లు

**ఇతరులదీ అదే పరిస్థితి**

(26 శాతం), ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ సంపద 400 కోట్ల డాలర్లు (28 శాతం) తుడిచి పెట్టుకుపోయింది. మార్కెట్ పతనంలో వీరి ముగ్గురి పేర్లు టాప్-100 ప్రపంచ బిలియనీర్ల జాబితా నుంచీ గల్లంతయ్యాయి. ప్రస్తుతం భారత్ నుంచి ముకేశ్ అంబానీ పేరు మాత్రమే ఈ జాబితాలో ఉంది. స్టాక్ మార్కెట్ పతనంతో పాటు గత రెండు నెలల్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు 5.2 శాతం పడిపోవడం.. భారత కుబేరుల ఆస్తులకు భారీగా గండి పడిందని హురన్ రిపోర్ట్ ఇండియా ఎండీ అనాస్ రహ్మాన్ చెప్పారు.

# బ్యాంకులకు కోవిడ్ గండం

### దూసుకుపోనున్న ఎన్‌పీఏలు




ముంబై: కోవిడ్-19 మహమ్మారి ప్రభావం భారత బ్యాంకింగ్ రంగంపై భారీగానే పడనుంది. కనీవినీ ఎరుగని ఈ విపత్తు కారణంగా బ్యాంకుల రుణ వ్యయ నిష్పత్తి 13 శాతం, మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 1.9 శాతం పెరిగిపోతాయని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తేల్చిచెప్పింది. "ఆసియా పసిఫిక్ ప్రాంత బ్యాంకులు, కోవిడ్-19 సంక్షోభ ప్రభావం 300 బిలియన్ డాలర్లు" పేరిట ఆ సంస్థ ఒక నివేదిక విడుదల చేసింది. చైనాలో ఎన్‌పీఏల పెరుగుదల అంచనా 2 శాతం కన్నా మన బ్యాంకులకు ఇచ్చిన అంచనా 0.1 శాతం తక్కువని సంస్థ క్రెడిట్ విశ్లేషకుడు గావిన్ గన్నింగ్ తెలిపారు. కరోనా ప్రభావం ఎంత దీర్ఘకాలం పాటు సాగితే అంతగా ఆర్థిక కష్టాలు పెరిగిపోతాయని ఆయన అన్నారు. ప్రధానంగా ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకునేందుకు విముఖత ప్రదర్శించడంతో రుణాల పోర్ట్‌ఫోలియో కూడా క్షీణిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్పొరేట్లతో పోల్చితే బ్యాంకులపై ప్రారంభంలో కోవిడ్ ప్రభావం తక్కువగా ఉన్నందు వల్ల ఇప్పుడు అది మరింత తీవ్రంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ మహమ్మారి కారణంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభం వల్ల ఆసియా, పసిఫిక్ ప్రాంతంలోని 20 బ్యాంకింగ్ విభాగాల రేటింగ్‌లు కూడా తీవ్రంగా ప్రభావితం కావచ్చునని ఆ నివేదిక హెచ్చరించింది. వాస్తవానికి ఆర్‌బీఐ ఇటీవల ప్రకటించిన రుణ వాయిదాల మారటోరియం వంటి విధానపరమైన చర్యలు పైకి తేలిగ్గానే కనిపించినా బ్యాంకులపై ఆ వ్యయ భారం అధికంగానే ఉంటుందని కూడా హెచ్చరించింది.

## జీడీపీ వృద్ధి 3 శాతం లోపే: కేపీఎంజీ

న్యూఢిల్లీ: కరోనా వైరస్ మరింత విజృంభించి ప్రపంచ దేశాలు ఆర్థిక మాంద్యంలోకి జారుకుంటే, భారత్‌కు మరిన్ని తిప్పలు తప్పవనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే 2020-21 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటు మూడు శాతం దిగువకూ పడిపోయే ప్రమాదం ఉందని అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ కేపీఎంజీ హెచ్చరించింది. అదే ఈ నెలాఖరు లేదా మే 15 నాటికి కరోనా విజృంభణ తగ్గితే వృద్ధి రేటు 5.3 నుంచి 5.7 శాతం వరకు ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది. ప్రస్తుత పరిణామాలను చూస్తుంటే ఇది సుదూర స్వప్నంగానే కనిపిస్తోందని తెలిపింది. ఒకవేళ భారత్ కరోనా వ్యాప్తిని కట్టడి చేసినా, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం నెలకొన్నా వృద్ధి రేటు 4 నుంచి 4.5 శాతం మించక పోవచ్చని పేర్కొంది.

## 'ఆటో' డీలర్లపై లాక్‌డౌన్ దెబ్బ

న్యూఢిల్లీ: కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు విధించిన లాక్‌డౌన్‌తో దేశంలోని ఆటో డీలర్ల కష్టాలు మరింత తీవ్రమవయ్యాయి. వాహన షోరూమ్‌లు మూతపడ్డాయి. షోరూముల్లోని వాహనాలు అమ్ముడుపోయే పరిస్థితి లేదు. అదే సమయంలో బీఎస్-4 వాహనాల నిల్వలు భారీగా మిగిలిపోయాయి. కంపెనీలు కొంతవరకు ఈ నష్టాలు భర్తీ చేసినా, డీలర్లకు భారీ నష్టాలు తప్పవని ఇండియా రేటింగ్స్ ఒక నివేదికలో పేర్కొంది. లాక్‌డౌన్ ముగిసిన పది రోజుల్లోపు బీఎస్-4 వాహనాలు అన్నీ అమ్ముకోవాలని సుప్రీంకోర్టు ఢిల్లీలోని డీలర్లకు మాత్రమే అనుమతి ఇచ్చింది. అయినా అంత స్వల్ప వ్యవధిలో ఎంత డిస్కౌంట్స్ ఇచ్చినా కొనుగోలుదారులు వాహనాలు కొనేందుకు పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చని భావిస్తున్నారు.

## 8375 పైన ముగిస్తే బుల్లిష్

**(ఏప్రిల్ 7-9 తేదీల మధ్య వారానికి)** **గత వారం నిఫ్టీ : 8084 (-596)**

నిఫ్టీ గత వారం పాయింట్ల 8678-7511 పాయింట్ల మధ్యన కదలాడి 596 పాయింట్ల నష్టంతో 8084 వద్ద నెగెటివ్‌గా ముగిసింది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 9614, 11067, 11575, 11499 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా (డెత్ క్రాస్) దిగువకు వచ్చింది. దీర్ఘకాలిక బేరిష్ అయిందనేందుకు ఇది సంకేతం. ఈ వారాంతంలో 9000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బుల్లిష్ అవుతుంది.



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

**బ్రేకౌట్ స్థాయి:** 8375
**బ్రేక్‌డౌన్ స్థాయి :** 7925
**నిరోధ స్థాయిలు:** 8225, 8300, 8375 (8150 పైన బుల్లిష్)
**మద్దతు స్థాయిలు :** 8075, 8000, 7925 (8100 దిగువన బేరిష్)

**ఇన్వెస్టర్లకు సూచన..**
వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం.

**ద్వితీయార్థం మెరుగు (మంగళవారానికి)**

**తిథి :** చైత్ర శుద్ధ చతుర్దశి **నక్షత్రం:** హస్త
**అప్రమత్తం:** పునర్వసు,విశాఖ, పూర్వాభాద్ర నక్షత్ర జాతకులు, తుల, కుంభ రాశుల వారు అప్రమత్తం.
**ట్రెండ్ మార్పు వేళలు : 2.28**
**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 నుంచి 10.15 వరకు నిలకడ/నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 12.45 వరకు నిస్తేజంగా ఉండి ఆ తర్వాత 2.45 వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది. తిరిగి చివరిలో నిస్తేజంగా మారవచ్చు.

**ఇంట్రాడే**

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 10.15 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 12.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఒంటి గంట తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 3 గంటల సమయంలో క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది.

**నిరోధం : 8150, 8225, 8300**
**మద్దతు స్థాయిలు : 8000, 7925, 7850**

## నాస్కామ్ చైర్మన్‌గా ప్రవీణ్ రావు

న్యూఢిల్లీ: నాస్కామ్ చైర్మన్‌గా ఇన్ఫోసిస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) యూబీ ప్రవీణ్ రావు, వైస్ చైర్మన్‌గా భారత్‌లో యాక్సెంచర్ చైర్మన్, సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ రేఖా ఎం మీనన్ నియమితులయ్యారు. 2020-21 సంవత్సరానికి గాను వీరు ఈ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. ఇప్పటి వరకు నాస్కామ్ చైర్మన్‌గా వ్యవహరించిన డబ్ల్యుఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ గ్రూప్ సీఈఓ కేశవ్ మురుగేశ్ నుంచి ప్రవీణ్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

## సేవల రంగం పీఎంఐ తిరోగమనం

భారత సేవల రంగానికి కరోనా కాటు పడింది. సేవల రంగం పీఎంఐ మార్చి నెలలో 49.3 పాయింట్లకు పడిపోయింది. ఫిబ్రవరి నెలలో ఇది 85 నెలల గరిష్ఠ స్థాయి 57.5 పాయింట్లకు దూసుకుపోయినప్పటికీ వినియోగదారుల విచక్షణాపూర్వక కొనుగోళ్ల తగ్గడంతో మార్చిలో 8 పాయింట్లకు పైబడిన క్షీణతను నమోదు చేసింది. వేగానికి, మందగమనానికి విభజన రేఖ 50 పాయింట్ల కన్నా ప్రస్తుతం దిగువకు వచ్చింది.

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 6వ తేదీకి.. | | విజయవాడ | 345 |
| హైదరాబాద్ | 350 | విశాఖపట్నం | 345 |
| 7వ తేదీకి.. | | వరంగల్ | 353 |
| చిత్తూరు | 403 | డజను గుడ్లు రూ. 54 | |
| గోదావరి | 345 | | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 80 | విజయవాడ | 75 |
| వరంగల్ | 80 | గుంటూరు | 75 |
| మహబూబ్‌నగర్ | 80 | ఒంగోలు | 75 |
| కరీంనగర్ | 80 | చిత్తూరు | 80 |
| కర్నూలు | 80 | నెల్లూరు | 80 |
| విశాఖపట్నం | 70 | అనంతపురం | 88 |
| గోదావరి | 80 | | |

# స్పోర్ట్స్



### ఢిల్లీ షూటింగ్
## వరల్డ్‌కప్ రద్దు

**న్యూఢిల్లీ:** కొవిడ్-19 మహమ్మారితో మరో మెగా ఈవెంట్‌కు బ్రేక్ పడింది. దేశ రాజధాని ఢిల్లీలో మే నెలలో జరగాల్సిన షూటింగ్ వరల్డ్‌కప్‌ను రద్దు చేస్తున్నట్టు నిర్వాహకులు సోమవారం ప్రకటించారు. వాస్తవానికి రైఫిల్/పిస్టల్, షాట్‌గన్ వరల్డ్‌కప్ మార్చి 15న ఢిల్లీలో మొదలవ్వాలి. కానీ.. కరోనా కారణంగా ఈ టోర్నీని రెండు విభాగాలుగా విభజిస్తూ.. రైఫిల్/పిస్టల్ ప్రపంచకప్‌ను మే 5 -12 వరకు, షాట్‌గన్ పోటీలను జూన్ 2-9 వరకు నిర్వహించేలా షెడ్యూల్ చేశారు. కరోనాతో దేశంలో పరిస్థితులు ఇంకా మెరుగుపడకపోవడంతో పూర్తిగా వరల్డ్‌కప్‌నే రద్దు చేస్తున్నట్టు అంతర్జాతీయ షూటింగ్ సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రకటించింది.

## కరోనా సోకిందని ఆత్మహత్య



**రీమ్స్ (ఫ్రాన్స్):** కరోనా మహమ్మారి ఓ వైద్యుడి ప్రాణాన్ని బలిగొంది. ఫ్రెంచ్ లీగ్ ఫుట్‌బాల్ క్లబ్ రీమ్స్ డాక్టర్ బెర్నార్డ్ గోంజలెజ్ (60)కు కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో అతడు ఆత్మహత్య చేసుకున్నట్టు క్లబ్ ఓ ప్రకటనలో తెలిపింది. 'కరోనా పాజిటివ్‌గా తేలడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్టు గోంజలెజ్ సూసైడ్ నోట్‌లో రాసినట్టు తెలిసింద'ని రీమ్స్ మేయర్ అర్నార్డ్ రోబినెట్ చెప్పారు.

### కరోనాతో బాక్సింగ్ దిగ్గజం సోదరుని మృతి

బ్రిటిష్ బాక్సింగ్ దిగ్గజం నిగెల్ బెన్ సోదరుడు కరోనా వైరస్ కారణంగా మృతి చెందాడు. ఈ విషయాన్ని బెన్ సోషల్ మీడియా ద్వారా పంచుకున్నాడు.

## క్వారంటైన్ పాటించని రగ్బీ ఆటగాళ్ల అరెస్టు



కుటాని

**సువా:** క్వారంటైన్ నిబంధనలను ఉల్లంఘించిన ఇద్దరు ఫిజీ రగ్బీ ప్రొఫెషనల్ ఆటగాళ్లను అరెస్టు చేశారు. లండన్ క్లబ్ తరపున ఆడుతున్న సెమీ కుటాని, మరో ఆటగాడు సింగపూర్ మీదుగా ఫిజీ చేరుకున్నారు. కరోనా ప్రబలుతున్న నేపథ్యంలో విదేశాల నుంచి వచ్చిన వారికి 14 రోజుల స్వీయ నిర్బంధాన్ని తప్పనిసరి చేశారు. కానీ, వీరిద్దరూ క్వారంటైన్ నిబంధనలను ఉల్లంఘించి బయట తిరగడంతో పోలీసులు అరెస్టు చేశారు.

# క్రీడలకు కరోనా పాఠం!

కరోనా దెబ్బకు యావత్ క్రీడా రంగమే స్తంభించింది. ప్రపంచ వ్యాప్తంగా టోర్నీలు రద్దు కావడంతో ఆటగాళ్లు ఇళ్లకే పరిమితమైన పరిస్థితి. అయితే, ఈ విపత్తు నుంచి కోలుకొని మళ్లీ టోర్నీలు ఆరంభమైనా.. క్రీడల్లో ప్రధానంగా కొనసాగుతున్న కొన్ని అలవాట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫుల్‌స్టాప్ పెట్టాలని 'కరోనా' చెబుతున్న పాఠం ఏంటో చూద్దాం..



**బంతికి ఉమ్మి పూయడం..**

క్రికెట్‌లో బంతి షైనింగ్‌ను పెంచడానికి ఉమ్మి పూయడమనేది సర్వసాధారణం. ఉమ్మి పూయకపోతే బంతి సరిగా స్వింగ్ కాదని బౌలర్లు భావిస్తుంటారు. మెరుపు నిలవాలంటే ఉమ్మి పూయడం తప్ప వేరే మార్గం లేదని భారత పేసర్ భువనేశ్వర్ కుమార్ చెప్పాడు. అలా చేయకపోతే బ్యాట్స్‌మన్ సులువుగా స్ట్రోక్స్ ఆడతాడని తెలిపాడు. కానీ, ప్రస్తుత భయానక పరిస్థితుల్లో ఆ అలవాటుకు మాత్రం చెక్ పెట్టాల్సిందే. ఒకరినుంచి ఒకరికి వైరస్‌లు దరిచేరకుండా ఉండాలంటే ఇలాంటి చర్యలను నిరోధించాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.



**కరచాలనాలు వద్దు..**

కరోనా ప్రబలడంతో టాప్ ఫుట్‌బాల్ లీగుల్లో కరచాలనాలను రద్దు చేశారు. దీంతోపాటు ఫ్యాన్స్‌కు ఆటోగ్రాఫులు, సెల్ఫీలపై కఠిన ఆంక్షలు విధించారు. ప్రముఖ జట్టు లివర్‌పూల్ అయితే మస్కట్‌లను కూడా నిషేధించింది. ప్రముఖ బాస్కెట్‌బాల్ లీగ్ ఎన్‌బీఏ కూడా ఎప్పటి నుంచో అమలు చేస్తున్న 'హై-ఫైవ్'ను ఇటీవలే బ్యాన్ చేసింది. ఆ స్థానంలో 'ఫిస్ట్ బంప్' చేయాలని ఆటగాళ్లను కోరింది. కరచాలనాలకు కూడా దూరంగా ఉండాలని సూచించింది.





**టెన్నిస్‌లో టవల్స్..**

మ్యాచ్ ఆడే సమయంలో టెన్నిస్ ప్లేయర్లు టవల్స్‌తో చెమట తుడుచుకుని వాటిని పట్టుకోమంటూ బాల్ బాయ్స్ లేదా గార్ల్స్‌కు విసరడం చూస్తుంటాం. కరోనా మహమ్మారి నేపథ్యంలో ఇలాంటి వాటిని అరికట్టడానికి నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని టెన్నిస్ విశ్లేషకులు సూచిస్తున్నారు. ఇటీవల జపాన్, ఈక్వెడార్ మధ్య జరిగిన డేవిస్‌కప్ మ్యాచ్‌లో బాల్‌బాయ్స్ గ్లౌజులు ధరించి కనిపించారు. టవల్స్ వేయడానికి ప్రత్యేకంగా బాస్కెట్‌లను ఏర్పాటు చేశారు. కరోనాలాంటి వైరస్‌ల నేపథ్యంలో ఇంతకంటే మెరుగైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గ్రీస్ ఆటగాడు స్టెఫనోస్ సిట్సిపాస్ అన్నాడు.

## ఆ ఇద్దరు లేకపోవడంతో..
### ఆసీస్‌లో భారత్ గెలిచింది



వకార్ యూనిస్

**కరాచీ:** విరాట్ కోహ్లీ నేతృత్వంలో భారత జట్టు 2018-19 ఆసీస్ టూర్‌లో తొలిసారిగా టెస్టు సిరీస్‌ను గెలిచి చరిత్ర సృష్టించింది. అయితే ఈ విజయం డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్ లేకపోవడంతోనే సాధ్యమైందని పాక్ మాజీ కెప్టెన్ వకార్ యూనిస్ తేల్చాడు. ఆ సమయంలో బాల్ టాంపరింగ్ వివాదం కారణంగా వార్నర్, స్మిత్ ఏడాది పాటు నిషేధంలో ఉన్నారు. 1995 నుంచి పాక్ జట్టు ఆసీస్‌లో ఒక్క టెస్టు కూడా గెలవకపోవడంపై మాట్లాడుతూ యూనిస్.. భారత్ విజయంపై స్పందించాడు. 'భారత జట్టు ప్రదర్శనను నేనేమీ తక్కువ చేయడం లేదు. ఆ టూర్‌లో కోహ్లీ సేన అద్భుతంగా ఆడింది. జట్టులో అందరూ సమర్థులే. కానీ అదే సమయంలో ఆసీస్ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. మ్యాచ్‌ను శాసించే వార్నర్, స్మిత్ సేవలను వారు కోల్పోయారు. ఏ జట్టయినా అక్కడ పర్యటించి గెలవడం మామూలు విషయం కాదు. ఇటీవల కివీస్ కూడా మట్టికరవగా యాషెస్‌లో ఇంగ్లండ్‌ను ఏకపక్షంగా ఓడించారు' అని వకార్ గుర్తుచేశాడు.

## టోక్యో ఒలింపిక్స్‌లో థాయ్‌లాండ్, మలేసియా లిఫ్టర్లకు నో చాన్స్

**న్యూఢిల్లీ:** థాయ్‌లాండ్, మలేసియా వెయిట్‌లిఫ్టర్లు టోక్యో ఒలింపిక్స్‌కు దూరం కానున్నారు. ఎందుకంటే, ఈ రెండు దేశాల లిఫ్టింగ్ సమాఖ్యలపై నిషేధం విధిస్తూ అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సంఘం క్రమశిక్షణ కమిటీ స్వతంత్ర సమాఖ్య (ఐఎమ్ఎఫ్‌సీపీ) నిర్ణయం తీసుకుంది. థాయ్‌లాండ్‌పై మూడేళ్లు, మలేసియాపై ఏడాదిపాటు నిషేధం విధించింది. ఈ రెండు దేశాల లిఫ్టర్లు రికార్డు స్థాయిలో డోపీలుగా పట్టుబడడంతో వేటు వేసింది. దీంతో వచ్చే ఏడాది జరిగే టోక్యో విశ్వక్రీడల్లో థాయ్, మలేసియా లిఫ్టర్లు పోటీపడే అవకాశం లేదు.

## వాళ్లను పట్టించుకోను
### రిటైర్మెంట్‌పై ఆలోచన లేదు.. టోక్యోకు సిద్ధమవుతున్నా



సుశీల్

**న్యూఢిల్లీ:** రిటైర్మెంట్‌పై వస్తున్న ఊహాగానాలను రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, వెటరన్ రెజ్లర్ సుశీల్ కుమార్ కొట్టిపడేశాడు. ఒలింపిక్స్ వాయిదా పడడంతో మెగా టోర్నీ టికెట్ కోసం సన్నద్ధమవుతున్నట్టు చెప్పాడు. 'నా పనైపోయిందని మాట్లాడడం అందరికీ అలవాటుగా మారింది. వాగే వాళ్ల గురించి పట్టించుకోను. రోజుకు రెండుసార్లు సాధన చేస్తున్నా. దేవుడి దయ ఉంటే టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తా' అని సుశీల్ చెప్పాడు. 36 ఏళ్ల సుశీల్ 2019 వరల్డ్ చాంపియన్‌షిప్‌తో ఫామ్‌లోకి వచ్చాడు. కానీ, ఆ తర్వాత అదే జోరును కొనసాగించలేక పోయాడు. 74 కిలోల కేటగిరీలో తలపడుతున్న సుశీల్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమవుతూనే ఉన్నాడు. కానీ, తాను మాత్రం పోరాటం చేస్తూనే ఉంటానని చెప్పాడు.

### నర్సింగ్ రీఎంట్రీ..

ఒలింపిక్స్ వాయిదా పడడంతో సుశీల్ గట్టిపోటీదారుగా భావిస్తున్న నర్సింగ్ యాదవ్ కూడా జూలైలో డోపింగ్ బ్యాన్‌ను ముగించుకుని మళ్లీ బరిలోకి దిగే అవకాశం ఉంది. యాదవ్‌కు తప్పకుండా అవకాశాలు కల్పిస్తామని భారత రెజ్లింగ్ సమాఖ్య ఈపాటికే ప్రకటించింది. 2016 రియో ఒలింపిక్స్‌లో సుశీల్‌ను కాదని యాదవ్‌కు అవకాశం కల్పించారు. కానీ, డోపింగ్‌లో విఫలమవడంతో అప్పట్లో అతడిపై నాలుగేళ్ల నిషేధం పడింది. అయితే, రీఎంట్రీ ఇవ్వనున్న నర్సింగ్‌కు సుశీల్ స్వాగతం పలికాడు. ఇద్దరి ముఖాముఖి గురించి అడిగితే.. సమయం వచ్చినప్పుడు చూద్దామని దాటవేశాడు. 74 కిలోల విభాగంలో జితేందర్ కుమార్ కూడా గట్టి పోటీదారుగా మారాడు. ఆసియా చాంపియన్‌షిప్‌లో అతడు కాంస్య పతకం సాధించాడు.

## గోపీచంద్ విరాళం రూ. 26 లక్షలు



**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ కరోనాపై పోరాడుతున్న కేంద్ర, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు కలిపి రూ.26 లక్షలు విరాళం ఇచ్చాడు. ప్రధాని సహాయ నిధికి రూ.11 లక్షలు, తెలంగాణ ప్రభుత్వానికి రూ.10 లక్షలు, ఆంధ్రప్రదేశ్ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.5 లక్షలు సాయమందించాడు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. వారు చేస్తున్న సేవకు నా వంతు చిరు సాయంగా రూ.26 లక్షల విరాళాన్ని అందించా' అని గోపీచంద్ తెలిపాడు. ఇక, భారత స్టార్ క్యూయిస్ట్, వరల్డ్ చాంపియన్ పంకజ్ అద్వాణీ.. ప్రధాని సహాయ నిధికి రూ.5 లక్షలు విరాళం అందించాడు.



## శ్రేయాస్.. లవ్‌లో పడ్డాడనుకున్నా!

**న్యూఢిల్లీ:** భారత జట్టు నెంబర్ ఫోర్ బ్యాట్స్‌మన్‌గా శ్రేయాస్ అయ్యర్ నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. కానీ టీనేజిలో ఫామ్ కోల్పోయి ఇబ్బందిపడుతున్న సమయంలో శ్రేయాస్ తండ్రి సంతోష్ అయ్యర్ తెగ ఆందోళన చెందాడట. ప్రేమలో పడడంతో పాటు చెడు సహవాసాలు తమ కుమారుడి దృష్టిని మరల్చాయేమోనని స్పోర్ట్స్ సైకాలజిస్ట్ దగ్గరికి కూడా తీసుకెళ్లాల్సి వచ్చిందని తెలిపాడు. 'ముంబై అండర్-16 జట్టుకు ఆడుతున్న సమయంలో శ్రేయాస్ ఆట గతి తప్పింది. టాలెంట్ ఉన్నా కూడా ఆటపై దృష్టి పెట్టడం లేదని కోచ్ కూడా చెప్పాడు. అందుకే భయపడి సైకాలజిస్ట్‌ను సంప్రదించా. కానీ ఆందోళన అనవసరమని, అందరికీ ఇలాంటి పరిస్థితి వస్తుందని ఆయన మాకు భరోసా ఇచ్చాడు. తర్వాత ఫామ్‌ను అందుకోవడంతో పాటు శ్రేయాస్‌కు వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు' అని సంతోష్ అయ్యర్ వివరించాడు.



విజయసాయిరెడ్డిని పంపించడానికి గుమిగూడిన మంత్రులు, అధికారులు, కార్యకర్తలు

## సాయం పేరుతో జాతర

**లాక్‌డౌన్ రూల్స్ పాతర. భౌతిక దూరానికి వైసీపీ రాంరాం!**

విశాఖపట్నం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో కరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సోమవారం నాటికి 20 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కరోనా వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెంద కుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 21 రోజులు లాక్‌డౌన్ ప్రకటించాయి. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు.. 'కరోనా కాలంలో ఆర్థిక సాయం' పేరుతో ప్రజలందరినీ ఒకచోట చేర్చి నిబంధనలను కాలరాస్తున్నారు. ప్రస్తుతం నలుగురు కంటే ఎక్కువ మంది ఒక దగ్గర వుండకూడదంటూ 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఈ సమయంలో సభలు, సమావేశాలకు పోలీసులు అనుమతులు ఇవ్వకూడదు. కానీ విశాఖపట్నంలో అనుమతులు ఇవ్వడమే కాకుండా స్వయంగా వారే ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి విశాఖపట్నం ప్రజలకు సేవ చేసేందుకు కొన్నాళ్ల క్రితం ప్రగతి భారతి ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. ఆ ట్రస్టు పేరుతో పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరకులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని హనుమంతవాకలోని సీఎంఆర్ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించారు. దీనికి మంత్రులు బొత్స సత్యనారాయణ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ సృజన, ఐపీఎస్ అధికారి విశాఖ డీసీపీ-1 రంగారెడ్డితోపాటు నగర వైసీపీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేదికపై తొలుత భౌతికదూరం పాటించిన పెద్దలు ఆ తరువాత ఆ విషయం మరిచిపోయి 'సెల్ఫీ'లు దిగారు. ఇక విజయసాయిరెడ్డిని అక్కడి నుంచి సాగనంపే సమయంలో మంత్రులు, ఉన్నతాధికారులంతా గుమిగూడారు. భౌతిక దూరం విషయమే మరిచిపోయారు. రోడ్లపైన, రైతు బజార్ల దగ్గర నలుగురి కంటే ఎక్కువ మంది కనిపిస్తే లాఠీ ఝళిపించే పోలీసు అధికారులు అక్కడ అంత తంతు జరుగుతున్నా... కళ్లు అప్పగించి చూస్తుండిపోయారు.

### సంరక్షణ కేంద్రాలకు 'కరోనా' మార్గదర్శకాలు

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సంరక్షణ కేంద్రాల్లో కొవిడ్-19 వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలంటూ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ పలు మార్గదర్శకాలు నిర్దేశించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. పిల్లలు, వికలాంగులు, వృద్ధులు, మహిళలు, వితంతువుల ఆశ్రమాలు, అనాథ శరణాలయాల్లో లాక్‌డౌన్ సందర్భంగా సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకోవాలని ఆ 7 పేజీల మార్గదర్శకాల్లో పేర్కొంది. జువైనల్ సంక్షేమ డైరెక్టర్లు, మహిళా శిశు సంక్షేమ అధికారులు, జిల్లా కలెక్టర్లు, బాలల సంక్షేమ కమిటీలు, జువైనల్ జస్టిస్ బోర్డులు, చైల్డ్ కేర్ సంస్థలు సుప్రీం ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది.

### కట్టడి చర్యలపై విస్తృత ప్రచారం: సీఎస్

అమరావతి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు, చేపట్టిన కార్యక్రమాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వైరస్ వ్యాప్తి నియంత్రణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. స్వీయ నిర్బంధం, గృహ నిర్బంధంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపైనా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. లాక్‌డౌన్‌ను ఎత్తివేసిన తర్వాత వైరస్‌ను నియంత్రించడానికి ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండే విధంగా ప్రచారం చేయాలన్నారు. కరోనా పాజిటివ్ వ్యక్తుల వద్దకు 65 ఏళ్లు పైబడిన వారు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని.. డయాబెటిస్, ఉబ్బసం రోగులు వెళ్లకుండా చూడాలని సీఎస్ ఆదేశించినట్లు పౌరసంబంధాలశాఖ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డిని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### పెంపుడు జంతువులతో రాదు: వెటర్నరీ వీసీ

తిరుపతి(విద్య), ఏప్రిల్ 6: పెంపుడు జంతువుల(పిల్లి, కుక్క) నుంచి మనుషులకు కరోనా సోకదని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ డాక్టర్ వై.హరిబాబు తెలిపారు. అమెరికాలోని న్యూయార్క్ జూలో జంతు సంరక్షుడి నుంచి పులికి, దాని పిల్లలకు కరోనా వ్యాపించడంతో.. జంతువుల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకుతుందా? అనే అనుమానాలు తలెత్తాయి. దీనిపై వీసీని వివరణ కోరగా.. గబ్బిలాల నుంచి కరోనా వైరస్ మనిషికి వస్తుందని, మనిషి నుంచి మనిషికి వ్యాపిస్తుందని చెప్పారు. అయితే పెంపుడు జంతువుల వల్ల వ్యాపించదన్నారు. అయితే, పెంపుడు జంతువులను ముద్దుపెట్టుకోవడం, చేతులతో ఎత్తుకోవడం వంటివి చేయరాదన్నారు. మనిషి ద్వారా పెంపుడు జంతువులకు వైరస్ వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కాగా... కరోనా రక్తపరీక్షలు చేసేందుకు అవసరమైన రియల్ టైమ్ పిలిమిరేజ్ చైన్ రియాక్షన్ (ఆర్‌టీపీసీఆర్) పరికరాలు తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ రాష్ట్రీయ పశువ్యాధి నిర్ధారణ కేంద్రం, గన్నవరం వెటర్నరీ కళాశాల, ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాలల్లో అందుబాటులో ఉన్నాయని వీసీ హరిబాబు తెలిపారు.

### న్యాయవాదులకు ఆర్థిక సాయం: బార్ కౌన్సిల్

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్న న్యాయవాదులను ఆర్థికంగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ నిర్ణయించింది. అర్హులను గుర్తించేందుకు పదిమంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. సాయం పొందగోరే న్యాయవాదులు ఈ నెల 7 నుంచి 9వ తేదీ లోపు http://barcoun-cilap.org/financialassistancecovid19 వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ గంటా రామారావు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 45 ఏళ్ల లోపు వయసు, 2010 జనవరి 1 తర్వాత ఎన్‌రోల్‌మెంట్ తీసుకుని ఉండడంతోపాటు, ఆధార్‌కార్డు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు ఏపీ బార్ కౌన్సిల్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

### కడసారి చూపూ వీడియోలోనే!



పార్వతి (ఫైల్)

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 6: ఇది కరోనా కాలం!!. రక్త సంబంధీకులు మరణిస్తే.. కనీసం కడసారి చూపునకూ నోచుకోని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా.. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం గుణుపల్లిలో ఇలాంటి విషాదమే నెలకొంది. గ్రామానికి చెందిన సూరాడ పార్వతి (63) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందింది. ప్రస్తుతం రెండో కుమారుడు మోహనరావు వద్ద నివాసముంటోంది. పెద్ద కుమారుడు రాధాకృష్ణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా దక్షిణాఫ్రికాలో ఉండగా.. కుమార్తె పద్మ హైదరాబాద్‌లో, మేనకోడలు రత్న అమెరికా ఉన్నారు. లాక్‌డౌన్ కొనసాగుతుండడంతో వారంతా ఇక్కడికి రాలేని దుస్థితి. దీంతో వీడియో కాల్‌లోనే మృతదేహాన్ని కడసారి చూసుకొని కన్నీటిపర్యంతమయ్యారు.

### మంత్రి అనిల్‌కు కరోనా 'నెగెటివ్'

**స్వచ్ఛందంగా పరీక్షలు.. 36 గంటలు సెల్ఫ్ క్వారంటైన్**



నెల్లూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మంత్రి అనిల్ కుమార్ కరోనా పరీక్షలు చేయించుకున్నారు. సుమారు 36 గంటలపాటు స్వీయ నిర్బంధంలో ఉన్న ఆయన.. కరోనా పరీక్ష నెగెటివ్ రావడంతో మంగళవారం నుంచి ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 5న నెల్లూరుకు చెందిన ఓ వైద్యునికి కరోనా పాజిటివ్ వచ్చిన విషయం తెలిసిందే. ఆయన అంతకు కొద్ది రోజుల క్రితం తన ఆసుపత్రి ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికతో మంత్రి అనిల్‌ను కలిశారు. ఈ క్రమంలో మంత్రి స్వచ్ఛందంగా కరోనా టెస్ట్‌కు సిద్ధపడ్డారు. ఆదివారమే ఆయన స్వాబ్ తీసి టెస్టింగ్ నిమిత్తం స్విమ్స్‌కు పంపారు. సోమవారం సాయంత్రానికి 'నెగెటివ్' రిపోర్ట్ వచ్చింది. దీంతో తిరిగి కరోనా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్ణయించుకున్నట్లు ఆయన కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.



విజయవాడ చిట్టి నగర్‌లో వెయ్యి రూపాయల సాయం కోసం బారులు



విజయవాడ గుణదలలో సోడియం హైపోక్లోరైడ్ చల్లుతున్న సిబ్బంది

# 300 దాటేసి...

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించే అవకాశాలున్నాయి. కరోనా కేసుల్లో కర్నూలు తర్వాత 42 కేసులతో నెల్లూరు రెండో స్థానంలో ఉంది. గుంటూరు (32), కృష్ణా (29), కడప (27), ప్రకాశం (24), విశాఖపట్నం (20) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కరోనా కారణంగా ఏపీలో ముగ్గురు మరణించారని అధికారులు ధ్రువీకరించారు. మార్చి 30న విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందగా.. కృష్ణా జిల్లా మచిలీపట్టణానికి చెందిన 55 ఏళ్ల వ్యక్తి ఈ నెల 4న మృతి చెందినట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. అతనితోపాటు అనంతపురం జిల్లాకు చెందిన 64 ఏళ్ల వ్యక్తి కూడా ఈ నెల 4న కరోనాతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మక్కా నుంచి తిరిగి వచ్చిన వ్యక్తితో అతను సన్నిహితంగా మెలిగాడు. మరోవైపు... కర్నూలు జనరల్ ఆస్పత్రిలో ఒక వ్యక్తి మరణించిన తర్వాత 'పాజిటివ్'గా తేలింది. అయితే, దీనిని అధికారులు కరోనా మృతిగా గుర్తించలేదు.

### గుంటూరులో 2 ఢిల్లీ కనెక్షన్ కేసులు

గుంటూరులో మరో ఇద్దరికి కరోనా సోకింది. సోమవారం పది మందికి సంబంధించిన ఫలితాలు రాగా.. ఆనందపేటలో ఒకరికి, ఆర్టీసీ కాలనీకి చెందిన మరొకరికి పాజిటివ్ ఉన్నట్లు వెల్లడైంది. 8 మందికి నెగెటివ్ వచ్చింది. దీంతో జిల్లాలో కరోనా బాధితుల సంఖ్య 32కు చేరింది. కొత్తగా పాజిటివ్‌గా తేలిన ఇద్దరికి ఢిల్లీ కనెక్షన్‌తోనే వైరస్ సోకింది. కాగా.. ఇంకా పరీక్షల నిమిత్తం వైద్యుల పర్యవేక్షణలో ఉన్న వారు చాలామంది ఉన్నారు. గుంటూరులోనే ల్యాబ్ ఏర్పాటు చేసి రోజుకు 60 మందికి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం ఉమ్మడి వెలిగండ్లకు చెందిన యువకుడికి పాజిటివ్‌గా తేలింది. ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్న యువకుడు గత నెలాఖర్లో స్వగ్రామానికి వచ్చాడు. కరోనా లక్షణాలు కనిపించటంతో రిమ్స్‌కు తరలించారు.

### ఆరోగ్యశ్రీ పరిధిలోకి కరోనా

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కరోనా చికిత్సను రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చింది. కరోనాకు సంబంధించి మొత్తం 15 ప్రొసీజర్స్‌ను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెస్తూ ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనుమానిత కేసులతో పాటు కరోనా పాజిటివ్ కేసులకు వివిధ ప్యాకేజీలను ప్రకటించారు. కరోనా అనుమానిత కేసులకు రూ.16,405, కరోనా పాజిటివ్ కేసులకు రూ.65,824 కేటాయించారు. వీటితో పాటు కరోనా పాజిటివ్ బాధితుడికి ఇతర అనారోగ్య సమస్యలుంటే, వాటికి కూడా చికిత్స చేసేలా అవకాశం కల్పించారు. అదేవిధంగా హెల్త్ వర్కర్స్ అందరినీ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చారు.

### విశాఖలో మరో ఐదుగురికి

విశాఖ జిల్లాలో సోమవారం మరో ఐదుగురికి వైరస్ సోకినట్టు నిర్ధారణ అయ్యింది. దీంతో జిల్లాలో కరోనా బాధితుల సంఖ్య 20కి చేరింది. కొత్తగా నమోదైన కేసుల్లో ముగ్గురు ఢిల్లీలో జరిగిన మర్కజ్ ప్రార్థనల్లో పాల్గొన్న వారిగా తెలిసింది. మరో ఇద్దరు.. 4రోజుల కిందట వైరస్ బారినపడిన యువకుడి కుటుంబ సభ్యులుగా అధికారులు తెలియజేశారు. గాజువాక కుంచుమాంబ కాలనీలో ఓ మటన్ దుకాణం యజమాని (38)కి పాజిటివ్ రావడం కలకలం రేపింది. నెల్లూరు జిల్లాలో సోమవారం వచ్చిన రిపోర్టుల్లో మరో 8 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో ఈ జిల్లాలో మొత్తం 42 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీరిలో ఢిల్లీలోని మత సమావేశానికి వెళ్లొచ్చిన వారే ఎక్కువ. నెల్లూరు నగరానికి చెందిన ఆర్థోపెడిక్ వైద్యుడు కరోనా పాజిటివ్‌కు గురై పరిస్థితి విషమించటంతో ఆయన్ను సోమవారం సాయంత్రం చెన్నైలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. కడప జిల్లాలో సోమవారం కొత్తగా 4 కేసులు నమోదయ్యాయి. కరోనాపై సమీక్షకు నేడు జిల్లాకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైద్య, కుటుంబ ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల నాని, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆదిమూలపు సురేశ్ రానున్నారు.

| రాష్ట్రంలో కేసుల వివరాలు.. | | |
|---|---|---|
| తేదీ | రాష్ట్రంలో కేసులు | కర్నూలులో కేసులు |
| ఏప్రిల్ 1 | 111 | 1 |
| 2వ తేదీ | 149 | 1 |
| 3వ తేదీ | 161 | 1 |
| 4వ తేదీ | 190 | 4 |
| 5వ తేదీ | 252 | 53 |
| 6వ తేదీ | 303 | 74 |



తిరుపతిలో మూగ జీవాలకు ఆహారం అందిస్తూ..

### ఢిల్లీ వెళ్లొచ్చిన భర్త ద్వారా భార్యకు

విజయవాడలో మరో పాజిటివ్ కేసు నమోదైంది. ఢిల్లీలో మర్కజ్ సమావేశాలకు హాజరైన విజయవాడ పాయకాపురం ప్రాంతానికి చెందిన వ్యక్తికి కరోనా పాజిటివ్ రాగా.. అతని ద్వారా ఆయన భార్యకు కూడా వైరస్ సోకింది. తాజా కేసుతో కలిపి జిల్లాలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 29కి చేరింది. వీరిలో విదేశాల నుంచి వచ్చిన వారు నలుగురు కాగా.. మిగిలిన వారంతా ఢిల్లీ మర్కజ్ సమావేశాలకు వెళ్లొచ్చినవారు, వారితో కాంటాక్ట్ అయినవారే.

| జిల్లాల వారీగా కేసుల వివరాలు... | | |
|---|---|---|
| జిల్లా | పాజిటివ్ | డిశ్చార్జి |
| అనంతపురం | 6 | - |
| చిత్తూరు | 17 | - |
| తూర్పుగోదావరి | 11 | 1 |
| గుంటూరు | 32 | - |
| కడప | 27 | - |
| కృష్ణా | 29 | 2 |
| కర్నూలు | 74 | - |
| నెల్లూరు | 42 | 1 |
| ప్రకాశం | 24 | 1 |
| శ్రీకాకుళం | 0 | - |
| విశాఖపట్నం | 20 | 1 |
| విజయనగరం | 0 | - |
| పశ్చిమగోదావరి | 21 | - |
| మొత్తం | 303 | 6 |

## కరోనాతో చెలగాటం!

కర్నూలు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిందే... కర్నూలులోనూ జరిగింది. కరోనాతో చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా కుటుంబ సభ్యులకు అప్పగించారు. చనిపోయిన సమయానికి 'పాజిటివ్' నిర్ధారణ కాకపోయినా... కరోనా లక్షణాలతో మరణించినప్పుడు ఎట్టి పరిస్థితుల్లో మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించకూడదు. ఫలితం 'నెగెటివ్' వస్తే ఇబ్బంది ఉండదు. పాజిటివ్ వస్తే మృతదేహాన్ని భద్రంగా ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి బంధువులకు అప్పగించాలి. ఒక ఉద్యోగి పర్యవేక్షణలో విద్యుత్ దహన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేయించాలి. కర్నూలులో ఇందుకు పూర్తి భిన్నంగా జరిగింది. పాణ్యంకు చెందిన 45 ఏళ్ల ఓ వ్యక్తి హృద్రోగ సమస్యతో ఈనెల 1వ తేదీన ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. అయితే... ఆయనకు కరోనా అనుమానిత లక్షణాలు ఉండటంతో వైద్యులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం ఆయన నమూనాలను కరోనా టెస్టు కోసం పంపించారు. శుక్రవారం ఆయన ఐసొలేషన్ వార్డులో చనిపోయాడు. బంధువులు వచ్చేసరికే మృతదేహాన్ని వారికి అప్పగించేందుకు వీలుగా సిద్ధం చేశారు. కరోనా అనుమానాలు ఉండటంతో మృతదేహాన్ని అలా తీసుకెళ్లేందుకు బంధువులూ సందేహించారు. అయితే... భయపడాల్సిందేమీ లేదని, సంప్రదాయబద్ధంగా ఖననం చేసుకోవచ్చని వైద్యులు ధైర్యం చెప్పి మరీ పంపించారు. తీరా చూస్తే... మృతుడికి కరోనా సోకినట్లు ఆదివారం నిర్ధారణ అయ్యింది. ఈ సమాచారాన్ని ఇప్పటికీ మృతుడి బంధువులకు అందించలేదు. ఆయనకు వైద్యం అందించిన 30 మంది ఆసుపత్రి సిబ్బందికి కరోనా పరీక్షలు చేయించారు. బాధితుడు హృద్రోగంతో చనిపోయినట్లు రికార్డుల్లో రాశారు.

### 'తొలి' నుంచీ నిర్లక్ష్యం...

కర్నూలు జిల్లాలో తొలి పాజిటివ్ కేసు నొస్సంలో బయటపడింది. రైల్వేలో పని చేస్తున్న రాజస్థాన్ యువకుడు బాధితుడుగా మారాడు. ఈ కేసులోనూ ప్రభుత్వాసుపత్రి ఉన్నతాధికారులు తప్పటడుగులు వేశారు. కరోనా అనుమానిత కేసుగా అడ్మిట్ అయిన ఆ వ్యక్తిని మూడ్రోజులపాటు ఐసొలేషన్‌కు పంపకుండా ఎమ్ఎమ్-3 వార్డులో ఉంచి సాధారణ రోగిలాగే చికిత్సలు అందించారు. సిబ్బంది, వైద్యులు కూడా ఎలాంటి మాస్కులు, యూనిఫాం కోడ్ లేకుండానే చికిత్స చేశారు. ఆ తర్వాత... అతనికి కరోనా పాజిటివ్ అని తేలడంతో వైద్యుల వెన్నులో వణుకు మొదలైంది. దీంతో సీనియర్లు, జూనియర్లతోపాటు సిబ్బందికీ కరోనా పరీక్షలు చేయించారు. వారిలో కొందరికి నెగెటివ్ అని తేలడంతో ప్రస్తుతం ఊపిరి పీల్చుకుంటున్నారు.

# రాష్ట్రాన్ని జల్లెడ పట్టండి

**ప్రతి ఒక్కరినీ పరీక్షించాలి**

**ఉన్నతాధికారులకు సీఎం ఆదేశం**



కరోనాపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి జగన్

అమరావతి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కరోనా లక్షణాలున్నవారిని కనుక్కునేందుకు రాష్ట్రం మొత్తాన్నీ జల్లెడ పట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్దేశించారు. ప్రతి ఒక్కరినీ పరీక్షించి.. వైరస్ లక్షణాలు ఉన్నవారికి వెంటనే వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలన్నారు. పాజిటివ్ కేసులను వర్గీకరించాలని.. ఢిల్లీ తబ్లీగీ జమాత్‌కు వెళ్లిన వారూ, వారితో ప్రాథమికంగా కాంటాక్టులో ఉన్నవారూ.. విదేశాల నుంచి వచ్చినవారూ, వారితో కాంటాక్టులో ఉన్నవారు, స్థానికులు.. వయసులవారీగా వారి ఆరోగ్య స్థితిగతుల సమాచారం సేకరించాలని పేర్కొన్నారు. దీని వల్ల కరోనా ప్రభావం.. దాని నియంత్రణకు సంబంధించి స్పష్టత వస్తుందన్నారు. సోమవారమిక్కడ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి మోపిదేవి వెంకటరమణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని, డీజీపీ గౌతమ్ సవాంగ్, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు హాజరయ్యారు. వ్యక్తిగతంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా సరిపడా టెస్ట్ కిట్లను తెప్పించుకోవాలని సీఎం ఆదేశించారు. క్వారంటైన్, ఐసొలేషన్ వార్డుల్లో వైద్య సదుపాయాల్లో ఇబ్బందులు తలెత్తకూడదని స్పష్టం చేశారు. ఐసీయూ, క్వారంటైన్ బెడ్లకు సరిపడా వైద్య సిబ్బంది ఉండాలన్నారు. 1902కు వచ్చే కాల్స్‌పై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. వైరస్ కారణంగా .. చీనీ, బత్తాయి, అరటి, టమోటా రైతులకు ఎలాంటి ఇబ్బందీ రాకుండా చూడాలని ఆదేశించారు. విశాఖపట్నం, గుంటూరు, కడప జిల్లాల్లో ప్రస్తుతం ఉన్న ల్యాబ్‌ల సామర్థ్యం పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు.

### 266లో 243 తబ్లీగీ కేసులే!

రాష్ట్రంలో నమోదైన 266 కేసుల్లో ఢిల్లీ తబ్లీగీ జమాత్‌కు హాజరైన వారు.. వారితో కాంటాక్టులో ఉన్న వారే 243 మంది ఉన్నారని అధికారులు సీఎంకు చెప్పారు. కోవిడ్-19 నివారణకు ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలే కాకుండా భవిష్యత్‌లో అనుసరించాల్సిన విధానాలపై కూడా సమావేశంలో చర్చించారు. ర్యాండమ్ టెస్ట్ కిట్ల ద్వారా ప్రజల నుంచి నమూనాలు సేకరించి డేటాను ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలని నిర్ణయించారు. విశాఖలో చేసిన విధంగా రెడ్ జోన్, క్లస్టర్‌ల వారీగా ర్యాండమ్ పరీక్షలపైనా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్వారంటైన్, ఐసొలేషన్ క్యాంపుల్లో మంచి సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలన్నారు.

### ఆక్వా రంగంపై బిల్లు..

ఆక్వా రంగాన్ని రక్షించేందుకు ఫీడ్.. సీడ్ నియంత్రణ.. పర్యవేక్షణపై అసెంబ్లీలో బిల్లును తీసుకొస్తామని సీఎం చెప్పారు. ఆక్వా ధరలు, బెంగాల్, అసోం, బిహార్ లాంటి రాష్ట్రాలకు చేపల రవాణాలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఆక్వా ఉత్పత్తుల కొనుగోలులో రైతులకు నష్టం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చే నెల 31 నాటికి రైతు భరోసా కేంద్రాల కార్యకలాపాలు ప్రారంభం కావాలన్నారు. గ్రామ సచివాలయాలు రిసోర్సు పర్సన్స్, వ్యవసాయ సహాయకుల ద్వారా స్థానికంగా పంటల పరిస్థితి, ఉత్పత్తి, మార్కెటింగ్ ధరలపై ప్రత్యేకంగా క్షేత్ర స్థాయి సమాచారాన్ని ఎప్పటికప్పుడు రియల్ టైమ్‌లో తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## మా ప్రాణాలకు విలువలేదా?

**ఎన్-95 మాస్కులు ఇవ్వడం లేదు**

**నర్సీపట్నం ఆస్పత్రి డాక్టర్ ఆవేదన**

నర్సీపట్నం, ఏప్రిల్ 6: "కరోనా బారిన పడిన వారికి, అనుమానిత లక్షణాలున్న వారికి రేయింబవళ్లు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎన్-95 మాస్కులు అడుగుతుంటే పట్టించుకునే నాథుడు లేడు. ఇలాగైతే వైద్యులు, సిబ్బంది కూడా కరోనా బారిన పడతారు. మా ప్రాణాలకు విలువ లేదా?" అని నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రి ఎనస్థీషియాలజిస్ట్ డాక్టర్ సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. నర్సీపట్నంలో రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో ఆర్డీవో, ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్, మునిసిపల్ కమిషనర్, ఏఎస్పీలతో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్ సోమవారం మునిసిపల్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమయంలో అక్కడకు వచ్చిన డాక్టర్ సుధాకర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్-95 మాస్కులు అడుగుతుంటే ప్రాంతీయ ఆస్పత్రి వైద్యాధికారి పట్టించుకోవడం లేదని, డీసీహెచ్ఎస్‌కి ఫోన్ చేస్తుంటే స్విచ్ ఆఫ్ చేశారని తెలిపారు. అడగ్గా అడగ్గా ఒక మాస్కు ఇచ్చి, 15 రోజులు వాడాలంటున్నారని, ఇలాగైతే కరోనా బారిన పడకుండా ఎలా ఉంటామని ప్రశ్నించారు.

### కరోనాను నిర్వీర్యం చేసే బాక్స్!

**చిత్తూరు యువ శాస్త్రవేత్త ఆవిష్కరణ**

పలమనేరు రూరల్, ఏప్రిల్ 6: ప్రపంచానికి సవాలుగా మారిన కరోనా వైరస్‌ను కట్టడిచేసే మందు ఇప్పటి వరకు లేదు. అయితే, ఇప్పుడు చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన యువ శాస్త్రవేత్త పవన్ తాను కరోనాను నిర్వీర్యం చేసే పరికరాన్ని రూపొందించినట్లు తెలిపారు. కరోనా నివారణకు తనవంతు కృషి చేయాలనే ఉద్దేశంతో ప్రపంచవ్యాప్తంగా వైద్యులు ఇచ్చిన సందేశాలను, ఇంటర్వ్యూలను అధ్యయనం చేశాక ఓ బాక్సును తయారు చేసినట్టు చెప్పారు. రెండడుగుల వెడల్పు, ఆరున్నరడుగుల పొడవున్న ఈ బాక్సు రిమోట్ కంట్రోల్‌తో పనిచేస్తుంది. ఈ బాక్సులో ఆవిరి పట్టే టెక్నాలజీ ఉంది. బాక్సులోకి మనిషి ప్రవేశించగానే 2 నిమిషాల పాటు ఆవిరి ఆన్ అవుతుంది. తర్వాత పచ్చ కర్పూరం గాలిలో కలిసి బాక్సులోకి ప్రవేశించి, ఆ తర్వాత వేడి గాలి పైనుంచి శరీరానికి మొత్తం తాకుతుంది. ఈ నాలుగు నిమిషాలు శానిటైజర్ వెలువడుతుంది. ఫలితంగా ఏదైనా వైరస్ మన శరీరంపై ఉంటే నిర్వీర్యమవుతుంది. తన సొంతూరైన మొరం గ్రామంలో 30మందిని బాక్సు లోపలకు పంపగా తమకెంతో ఊరటగా ఉందని వారంతా సంతృప్తి వ్యక్తం చేసినట్లు పవన్ తెలిపారు.



## బోధనాస్పత్రులన్నీ కరోనా సేవకే?



**ఆరోగ్యశాఖ అధికారుల సన్నాహాలు**

**ఇప్పటికే రాష్ట్రంలో 4 కరోనా ఆస్పత్రులు**

**అదే బాటలో 8 బోధనాస్పత్రులు కూడా!**

**చిన్నారులు, గర్భిణుల వైద్యానికి ప్రత్యేక ఏర్పాట్లు**

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని బోధనాస్పత్రులను కరోనా ఆస్పత్రులుగా మార్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే విశాఖ విమ్స్, విజయవాడ జీజీహెచ్, తిరుపతి రుయా, నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలను కరోనా ఆస్పత్రులుగా మార్చింది. కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పడకల సంఖ్య పెంచాలని ఆరోగ్యశాఖ ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని 8 బోధనాస్పత్రులను కూడా కరోనా రోగులకు వైద్యం అందించేందుకు ఉపయోగించాలని అధికారులు నిర్ణయించారు. మొత్తంగా ప్రభుత్వంలోనే 15 వేల పడకలను కరోనా కోసం సిద్ధం చేయనున్నారు. ఇప్పటి వరకూ 2,500 పడకలు మాత్రమే అందుబాటులో ఉంచారు. కేసులు ఇంకా పెరుగుతాయని ఆరోగ్యశాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలో పడకల సంఖ్య పెంచుకోవడం మంచిదన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఇదే సమయంలో సాధారణ రోగుల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. ఆస్పత్రులన్నీ కరోనా రోగుల కోసం ఉపయోగిస్తే సాధారణ రోగులు తీవ్రంగా ఇబ్బంది పడతారు. కాబట్టి పిల్లలు, గర్భిణులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖ, విజయవాడ, తిరుపతిలో తల్లీపిల్లల ఆస్పత్రులు వేరుగా ఉన్నాయి. మిగిలిన చోట్ల ఒకే క్యాంపస్‌లో జనరల్ ఆస్పత్రితో పాటు తల్లీపిల్లల ఆస్పత్రులు ఉన్నాయి. గుంటూరు, కర్నూలు, కాకినాడ వంటి చోట్ల ఒకే క్యాంపస్‌లో ఉన్నా వేరు వేరు బిల్డింగ్‌లలో తల్లీపిల్లల ఆస్పత్రులు ఉన్నాయి. బోధనాస్పత్రులన్నింటినీ కరోనా ఆస్పత్రులుగా మారిస్తే తల్లీపిల్లల శస్త్ర చికిత్సలకు ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉంది. రాష్ట్రంలో విశాఖ, విజయవాడ, తిరుపతి మినహా మిగిలిన చోట్ల ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీనిపై ఆరోగ్యశాఖ అధికారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో చూడాలి. సాధారణ రోగులకు చికిత్స చేసే ఆస్పత్రి, తల్లీపిల్లల ఆస్పత్రి రెండింటినీ ఒకే భవనంలో ఏర్పాటు చేస్తే మాత్రం పరిస్థితి దారుణంగా ఉంటుంది. కాబట్టి ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాల్లోని ప్రధాన నగరంలో ఉన్న జిల్లా లేదా, ఏరియా ఆస్పత్రులను తాత్కాలిక తల్లీపిల్లల ఆస్పత్రులుగా మార్చుకుంటే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

### గుండె రోగుల పరిస్థితి ఏమిటి?

అన్ని బోధనాస్పత్రులను కరోనా ఆస్పత్రులుగా మారిస్తే గుండె, ఇతర అత్యవసర రోగుల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అత్యవసరం అయితే వాళ్లు ఎక్కడికి వెళ్లాలన్న దానిపై ప్రభుత్వానికి స్పష్టత లేదు. గుండె రోగులకు మొదటి గంట సమయంలో అత్యవసర వైద్యం అందకపోతే ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో గర్భిణులు, పిల్లల మాదిరిగానే గుండె, ఇతర అత్యవసర రోగులకు వైద్యం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్న డిమాండ్లు వస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



కరోనా వైరస్ ఆకారంలో ఉన్న హెల్మెట్‌లను ధరించి విజయనగరంలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

# దశలవారీ ఎత్తివేత

## హాట్‌స్పాట్స్‌లో 14 తరువాత కూడా లాక్‌డౌన్.. జనసమ్మర్దం తక్కువగా ఉన్నవి తొలుత ఎత్తివేత


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేంద్ర మంత్రి వర్గ సమావేశం నిర్వహించిన ప్రధాని మోదీ

**▸▸ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేబినెట్ భేటీలో మోదీ**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దశలవారీగా లాక్‌డౌన్‌ను సడలించేందుకు సిద్ధం కావాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర మంత్రులను కోరారు. దేశవ్యాప్తంగా కరోనా వైరస్ వ్యాప్తి, దానిని కట్టడికి తీసుకుంటున్న చర్యలను ఆయన మంత్రివర్గంతో చర్చించారు. దేశ చరిత్రలో తొలిసారిగా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆయన కేబినెట్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. వైరస్ కట్టడికి యుద్ధ ప్రాతిపదికన పనిచేయాల్సి ఉంటుందని చెబుతూనే.. 14వ తేదీ వరకూ విధించిన లాక్‌డౌన్‌ను పొడిగించాలా వద్దా అనేది దేశవ్యాప్తంగా ఒకే తీరున తీసుకోవాల్సిన నిర్ణయం కాదని ఆయన తేల్చిచెప్పారు. 'కరోనా ప్రబలంగా ఉన్న ప్రాంతాలను- అంటే హాట్‌స్పాట్స్‌ను వదిలేసి మిగిలిన చోట్ల ఒక్కో శాఖ నెమ్మదిగా తమ కార్యకలాపాలు నిర్వర్తించుకునేలా ఓ ప్రణాళికను రూపొందించండి. ఈ ఎత్తివేత ఒకేసారి జరగరాదు. దేశవ్యాప్తంగా పరిస్థితులు వేరు. ఆరోగ్యంతో పాటు ఆర్థికాన్ని కూడా పునుజ్జీవింపచేయాలి' అని ఆయన స్పష్టమైన సంకేతాలిచ్చారు. 'సెక్టార్ల వారీగా, జిల్లాల వారీగా ఎత్తివేత మంచిదా... అన్నది ప్రణాళికలు సిద్ధం చేయండి. ఆంక్షల సడలింపు- భౌతిక దూరం పాటించడం రెండూ ఒకసారి జరగేట్లు చూడాలి. అదే విధంగా ఆరోగ్య సేతు యాప్‌ను మరింత ప్రాచుర్యంలోకి తెండి. దాని నుంచి వచ్చే అలర్ట్స్‌ను అంతా గమనించాలి' అని ప్రధాని సూచించారు. స్కూళ్లలో, విద్యాసంస్థల్లో ఒకేచోట ఎక్కువ మంది గుమిగూడే అవకాశం ఉందని, అవి ప్రమాదకరంగా మారరాదని, విద్యార్థులు, యువతపై ప్రభావం అస్సలు పడకుండా చూసుకోవాలని, స్కూళ్లు, కాలేజీల పునః ప్రారంభంపై ఓ ప్రణాళిక అవసరమని సూచించినట్లు తెలుస్తోంది. కాగా, లాక్‌డౌన్‌ను వెంటనే ఎత్తేస్తే కేసుల సంఖ్య అమాంతం పెరిగి వాటిని తట్టుకునే పరిస్థితి ఉండదని అనేక రాష్ట్రాల సీఎంలు ప్రధానికిచెప్పినట్లు తెలుస్తోంది.

### పది నిర్ణయాలు, రంగాలు గుర్తించండి

**లాక్** డౌన్ ముగిసిన వెంటనే తమ తమ శాఖల్లో తీసుకోవాల్సిన పది ప్రధాన నిర్ణయాలు, పది ప్రధాన రంగాలను ముందే నిర్ణయించాలని మోదీ మంత్రులకు సూచించారు. ఉత్పత్తి, ఎగుమతులు పెంచేందుకు కార్యాచరణ ప్రణాళికలను సమర్పించాలని, కొత్త రంగాలను, కొత్త దేశాలను భారత ఎగుమతుల జాబితాలో చేర్చాలని ఆయన చెప్పారు. రాష్ట్రాలు, జిల్లా పరిపాలనా యంత్రాంగాలతో సంబంధాలు పెట్టుకోవాలని, ముఖ్యంగా హాట్ స్పాట్ లు గా ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన చెప్పారు. పీడీఎస్ కేంద్రాల్లో జనం గుమికూడకుండా చూసుకోవాలని, బ్లాక్ మార్కెటింగ్‌ను నివారించడం, నిత్యావసరాల ధరలు పెరగకుండా చూసుకోవడం అవసరమని మోదీ చెప్పారు.

### ఎంపీల వేతనాల్లో 30% కోత

కరోనాపై పోరుకు నిధుల సేకరణ జరుపుతున్న కేంద్రం సోమవారం రెండు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో ఒకటి.. పార్లమెంటు సభ్యుల వేతనాలపై కోత విధింపు కాగా రెండోది.. ఎంపీ ల్యాడ్స్ నిధుల నిలిపివేత. ఏడాది పాటు పార్లమెంటు ఉభయ సభల్లో ఉన్న సుమారు 750 మంది సభ్యుల వేతనాలలో 30శాతం కోత విధించాలని సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన మంత్రిమండలి సమావేశం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ఆర్డినెన్స్‌ను తీసుకురావడానికి కేబినెట్ ఆమోదించింది. పార్లమెంటు సభ్యులతో పాటు ప్రధాని, కేంద్రమంత్రుల వేతనాలలోనూ ముప్పై శాతం కోత విధించనున్నట్లు సమాచార మంత్రి ప్రకాశ్ జావడేకర్ తెలిపారు. ఇదే రీతిలో వేతనాలలో కోతకు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతితో పాటు అన్ని రాష్ట్రాల గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారన్నారు. వేతనాలలో కోత నిర్ణయం ఈ ఏప్రిల్ నెల నుంచే వర్తిస్తుందన్నారు. పార్లమెంటు సభ్యులకు తమ తమ నియోజకవర్గాల అభివృద్ధికోసం అమలు చేస్తున్న ఎంపీల్యాడ్స్ పథకానికి చెందిన నిధుల విడుదలనూ రెండేళ్లు నిలిపివేయాలని నిర్ణయించినట్లు జావడేకర్ తెలిపారు. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి మొత్తం రూ.7900కోట్లు కరోనా నియంత్రణ చర్యల నిధిలో జమవుతాయన్నారు. ఎంపీల జీతాల్లో కోతను స్వాగతించినప్పటికీ ఎంపీల్యాడ్స్ నిధుల నిలిపివేతను విపక్ష సభ్యులు ఈసందర్భంగా తప్పుబట్టారు.

## ఇది సుదీర్ఘ పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

సంకల్పంతో ఉన్నారు. ఈ ప్రాణాంతక వైరస్‌ను రూపుమాపాలన్నదే ఆ సంకల్పం' అన్నారు. బీజేపీ 40వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన సోమవారం వీడియో లింక్ ద్వారా కార్యకర్తలతో సంభాషించారు. దేశమంతా ఒకే లక్ష్యంతో ఈ యుద్ధంలో పాల్గొనాలన్నారు. వైరస్‌కు అడ్డుకట్ట వేయడంలో కేంద్రం సకాలంలో స్పందించలేకపోయిందంటూ రాహుల్ సహా విపక్ష నేతలు చేసిన విమర్శలను తిప్పికొట్టారు. కరోనా తీవ్రతను భారత్ సకాలంలో అర్థం చేసుకుని యుద్ధం ప్రారంభించిందని, ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తూ ఐక్యరాజ్యసమితి సహా అనేక దేశాల ప్రశంసకు పాత్రమైందని మోదీ చెప్పుకొచ్చారు. సార్క్, జీ-20 దేశాలతో కూడా సమన్వయం చేయడంలో భారత్ చొరవ చూపిందని, థర్మల్ స్క్రీనింగ్, విమానాల రాకపోకల నిలిపివేత, లాక్‌డౌన్ మొదలైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. 'జనతా కర్ఫ్యూ, లాక్‌డౌన్.. ఇలా ఏ పిలుపు ఇచ్చినా ప్రజలు ఏకమై సంఘీభావాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆదివారం రాత్రి లైట్లు ఆర్పి చమురు దీపాలు, కొవ్వొత్తులు వెలిగించి సంకల్ప శక్తిని చాటారు. సుదీర్ఘకాలం వైరస్‌పై పోరాడాలన్న సంకల్పాన్ని చాటి చెప్పారు' అని మోదీ శ్లాఘించారు.

### ఒకపూట భోజనమే

40వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఒక్క రోజూ ఒక్కపూట మాత్రమే భోజనం తీసుకోవాలని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రెండో పూట భోజనాన్ని ఆకలిజీవులకు పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ కార్యకర్తలకు ప్రధానమైన ఐదు సూత్రాలను ఆచరించాలని ఉద్బోధించారు. వీటినే ప్రధాని కూడా తన ప్రసంగంలో పేర్కొన్నారు. అవి...

- దేశంలోని ఏ పేదా ఈ లాక్‌డౌన్ సమయంలో ఆకలితో అలమటించరాదు.
- ప్రతీ కార్యకర్తా ఒక్కో వ్యక్తికి కనీసం రెండు ఫేస్ మాస్కులు ఇంట్లోనే తయారు చేయాలి. వాటిని వీడియో తీసి సర్క్యులేట్ చేయాలి
- ప్రతీ కార్యకర్తా కనీసం 40 మందిని కాంటాక్ట్ చేసి- వారు ఒక్కొక్కరూ రూ.100 పీఎం కేర్స్ నిధికి విరాళమిచ్చేట్లు చేయాలి
- భౌతిక దూరం పాటించడమే ఈ యుద్ధంలో తారకమంత్రం... అందరినీ చైతన్యవంతం చేయాలి
- మనకు సేవ చేస్తున్న ఆరోగ్య, రక్షణ సిబ్బందికి కృతజ్ఞత తెలుపుతూ ఉన్న ఓ పత్రాన్ని ఇంటింటికీ తిరిగి ప్రజల చేత సంతకాలు చేయించాలి.

## రైల్వేలో 2500 ఐసోలేటెడ్ కోచ్‌లు సిద్ధం



కరోనా రోగుల కోసం 2,500 ఐసోలేటెడ్ కోచ్‌లు సిద్ధం చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రధాన పౌర సంబంధాల అధికారి సీహెచ్ రాకేశ్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని సికింద్రాబాద్(లాలాగూడ), కాచిగూడ, విజయవాడ, కాకినాడలలో ఐసోలేటెడ్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

## వదంతులను నమ్మకండి

**▸▸ మూఢనమ్మకాలతో కరోనాపై పోరు వద్దు : వెంకయ్య**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలతో కరోనాపై చేస్తున్న పోరాటం బలహీనమయ్యే అవకాశం ఉందని, అలా చేయొద్దని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. వదంతులను నమ్మవద్దని పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారానికి అడ్డుకట్ట వేయాలన్నారు. సోమవారం సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్ ద్వారా ప్రజలకు ఆయన సందేశమిచ్చారు. ఒక సంఘటన ఆధారంగా కొంతమంది తప్పుడు, వెకిలి చర్యలతో ఒక మత సమూహాన్ని అనుమానిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. కరోనాపై పోరులో ప్రధాన పాత్ర పోషిస్తున్న వైద్యులను గౌరవించడం, వారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం కీలకమన్నారు. కరోనా కట్టడికి చేపడుతున్న చర్యలన్నీ సవ్యంగా సాగుతున్నాయని అనుకుంటున్న సమయంలో కొన్ని సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. భౌతికదూరం మార్గదర్శకాల విషయంలో బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని, అందుకు నిజాముద్దీన్ సమావేశమే ఉదాహరణ అన్నారు.

# బాధితుల్లో మహిళలు 24%

**▸▸ దేశంలో 4,778కు పెరిగిన కరోనా కేసులు**

**▸▸ మృతుల్లో 63 శాతం 60 ఏళ్లు దాటిన వారే**

**▸▸ భారత్‌లో 2, 3 దశల మధ్య కొవిడ్-19**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: దేశంలో కరోనా వైరస్ కేసుల సంఖ్య 4,778కు చేరింది. 24 గంటల్లో 704 కేసులు పెరిగాయి. ఇదే వ్యవధిలో 28 మరణాలు నమోదయ్యాయి. ఇందులో మహారాష్ట్రలోనే 21 సంభవించాయి. దీంతో దేశవ్యాప్తంగా మరణాల సంఖ్య 129కు చేరింది. సుమారు 318 మంది వైరస్ బాధితులు కోలుకోగా.. యాక్టివ్ కేసుల సంఖ్య 3,851గా ఉంది. ఈ వివరాలను సోమవారం కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. కరోనా సోకిన వారిలో 76 శాతం పురుషులు, 24 శాతం మహిళలు ఉన్నారని చెప్పారు. "మృతుల్లో 63 శాతం 60 ఏళ్లకు పైబడినవారు. 30 శాతం 40 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్కులు. 7 శాతం 40 ఏళ్లలోపు వారు" అని వివరించారు. వయసు గ్రూపు ఆధారంగా కరోనా పేషెంట్ల సంఖ్యను పరిశీలిస్తే 21-40 వయస్కులు అత్యధికంగా 42 శాతం ఉన్నారని చెప్పారు. 41-60 ఏళ్లలోపు వారు 33 శాతం, 60 ఏళ్ల పైబడినవారు 17 శాతం, 20 ఏళ్లలోపు వారు 9 శాతం ఉన్నారని తెలిపారు. మహమ్మారి 2, 3 దశల మధ్య భారత్ ఉందని విలేకరులు అడిగిన ప్రశ్నకు లవ్ అగర్వాల్ బుదలిచ్చారు. మృతుల సంఖ్య మహారాష్ట్రలో అత్యధికంగా 52కు చేరింది. కరోనా కేసులు అత్యధికంగా (781) నమోదైనది కూడా ఈ రాష్ట్రంలోనే! మహారాష్ట్ర తర్వాత రెండు స్థానాల్లో తమిళనాడు (571), ఢిల్లీ (503) ఉన్నాయి. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. సోమవారం రాష్ట్రంలో తాజాగా 16 కేసులు నమోదవగా, 11 అహ్మదాబాద్‌వే! వీరిలో 9మందికి తబ్లీగీ జమాత్‌తో సంబంధం ఉంది. రాజస్థాన్‌లోని కోటలో కరోనా సోకి 60 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ తొలి కరోనా మరణం నమోదయింది. ముంబై లోని వాఖడ్ ఆస్పత్రిలో ముగ్గురు వైద్యులు, 26 మంది నర్సులకు కొవిడ్-19 సోకింది. దీంతో వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు ఆస్పత్రిని మూసివేశారు.


కరోనా బాధితురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

### ఉమ్మితే హత్యాయత్నం కేసు

సిమ్లా: కరోనా రోగులు ఎవరైనా ఇతరులపై ఉమ్మివేస్తే హత్యాయత్నం కేసు నమోదు చేస్తామని హిమాచల్ ప్రదేశ్ డీజీపీ సీతారాం మర్డీ తీవ్రంగా హెచ్చరించారు. రోగి చర్య వల్ల బాధితుడికి కరోనా సోకి మరణిస్తే హత్య కేసుగా మారుస్తామని స్పష్టం చేశారు.

### 14 నెలల చిన్నారికి కరోనా

గుజరాత్‌లోని జామ్‌నగర్ జిల్లాకు చెందిన 14 నెలల బాబుకు కరోనా సోకినట్లు ఆదివారం అందిన రిపోర్టుల్లో తేలింది. ఆ చిన్నారి తల్లిదండ్రులు కూలీలు. కరోనా ఎలా సోకిందో తెలుసుకునే ప్రయత్నంలో అధికారు లు ఉన్నారు. ఆ కుటుంబం నివసించే దరేడ్ గ్రామాన్ని దిగ్బంధించా రు. చిన్నారికి ప్రస్తుతం వెంటిలేటర్‌తో శ్వాస అందిస్తున్నారు.

### 14 తర్వాత లాక్‌డౌన్ ఎత్తివేస్తామని చెప్పలేం: ఏసీఎస్

లఖ్‌నవు: ఉత్తరప్రదేశ్‌లో కరోనా కేసులు 300 దాటడంతో ఈ నెల 14 తర్వాత రాష్ట్రంలో లాక్‌డౌన్‌ను ఎత్తివేస్తామని చెప్పలేమని ఆ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి (హోం) అవనీశ్ కుమార్ అవస్థీ అన్నారు.

## ముంబై ధారావీలో.. కరోనా ఘంటికలు!

**▸▸ ఆసియాలోనే అతిపెద్ద మురికివాడ**

ముంబై, ఏప్రిల్ 6: ధారావీ.. ముంబైలో ఉన్న అతిపెద్ద స్లమ్.. అంతేకాదు..! ఆసియా ఖండంలోకెల్లా అతిపెద్ద మురికివాడ. దీని విస్తీర్ణం 2.7 చదరపు కిలోమీటర్లు. ప్రతి చదరపు కిలోమీటర్‌కు 2.77 లక్షల మంది ఇక్కడ నివసిస్తారు. ప్రస్తుతం ధారావీలో కరోనా ఘంటికలు మోగుతున్నాయి. ఇక్కడ తొలుత 56 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తికి కరోనా సోకింది. చికిత్స పొందుతూ ఆయన చనిపోయారు. కరోనా సోకిన మరో వ్యక్తిని పరీక్షించిన స్థానిక క్లినిక్ డాక్టర్‌కు కూడా ఇప్పుడు కోవిడ్-19 పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. ఈ ముగ్గురి ద్వారా ఆరేడు లక్షల మంది నివసించే ఈ మురికివాడలో ఆ వైరస్ ఎవరెవరికి సోకిందోననే ఆందోళన ఇప్పుడు మహారాష్ట్ర ప్రభుత్వంలో నెలకొంది. దీంతో.. ధారావీకి రాకపోకలను పూర్తిగా బంద్ చేశారు.నిజానికి ఇంతటి ప్రమాదం ఉన్నప్పుడు ప్రభుత్వాలు ఆ స్లమ్ వాసులకు పరీక్షలు నిర్వహించి, తగిన వైద్యం అందించాలి. కానీ, ఆ దిశగా చర్యలు లేవు. ధారావీలో ప్రతి 1,440 మందికి ఒక పబ్లిక్ టాయ్ లెట్ ఉంది. అపరిశుభ్ర పబ్లిక్ టాయిలెట్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి ఈ వ్యాధి వేగంగా వ్యాపించవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## కోర్టుల్లో ఆన్‌లైన్ విచారణ

**▸▸ వీడియో కాన్ఫరెన్స్‌కు సుప్రీం చట్టబద్ధత**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: కరోనావైరస్ ప్రబలిన ప్రస్తుత పరిస్థితుల్లో అత్యంత అరుదుగానే గుంపులుగా ఉండే కోర్టు హాల్లో విచారణకు అనుమతించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. భౌతిక దూరం పిలుపునకు అన్ని న్యాయస్థానాలు స్పందించాలని, వైరస్ వ్యాప్తికి దోహదం చేసే విధానాలన్నీ మార్చుకోవాలని కింది కోర్టులకు సూచించింది. ఈ మేరకు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు మార్గదర్శకాలను విడుదల చేసింది. న్యాయవ్యవస్థ చురుగ్గా పని చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకొనేందుకు హైకోర్టులకు అధికారాలు ఇచ్చింది. కరోనావైరస్ తగ్గిన తర్వాత కూడా కోర్టుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించడం కొనసాగుతుందని స్పష్టం చేసింది. కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, కక్షిదారులు హాజరవ్వాల్సిన అవసరాన్ని తగ్గించేలా హైకోర్టులు తీసుకొనే చర్యలన్నీ చట్టబద్ధమేనని ప్రకటించింది. రాజ్యాంగంలోని 142వ అధికరణం కింద ఈ ప్రకటన చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే, న్యాయమూర్తులు జస్టిస్ డీవై చంద్రచూడ్, ఎల్.నాగేశ్వర్‌రావులతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా అక్కడి హైకోర్టులు వీడియో కాన్ఫరెన్సింగ్ విధివిధానాలపై నిర్ణయం తీసుకోవచ్చని ప్రధాన న్యాయమూర్తి చెప్పారు.

## 25 వేల మందిపైగా తబ్లీగీల క్వారంటైన్

**▸▸ 4,067 కరోనా కేసుల్లో 1,455 సంస్థ సభ్యులవే**

**▸▸ కాన్పూర్‌లో వివరాల వెల్లడికి చివరి అవకాశం**

**▸▸ లేదంటే.. జాతీయ భద్రతా చట్టం ప్రయోగం**

**▸▸ తీవ్ర చర్యలు తప్పవన్న ఉత్తరాఖండ్, అసోం**

న్యూఢిల్లీ, కాన్పూర్, ముంబై, ఏప్రిల్ 6: మెగా ఆపరేషన్ ద్వారా 25,500 మందిపైగా తబ్లీగీ జమాత్ సభ్యులతో పాటు వారితో సన్నిహితంగా మెలిగిన వ్యక్తులను క్వారంటైన్ చేసినట్లు కేంద్ర హోం శాఖ సోమవారం తెలిపింది. సంస్థలోని విదేశీ సభ్యులు 2,083 మందిలో 1,750 మందిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టినట్లు పేర్కొంది. కొందరు సభ్యులు బస చేసిన హరియాణాలోని ఐదు గ్రామాలను దిగ్బంధం చేసినట్లు కేంద్ర హోం శాఖ పుణ్య సలీలా శ్రీవాస్తవ విలేకరులకు వివరించారు. దేశంలో నమోదైన 4,067 కరోనా కేసుల్లో 1,455 తబ్లీగీ జమాత్ కార్యక్రమానికి సంబంధించినవేనని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. వివరాల వెల్లడికి ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లా యంత్రాంగం చివరి అవకాశం ఇచ్చింది. కొవిడ్ పరీక్షలకు స్వచ్ఛందంగా ముందుకురాకుంటే కఠినమైన జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) ప్రయోగిస్తామని హెచ్చరించింది. విపత్తు నిర్వహణ చట్టం కింద కేసులు పెడతామని ఉత్తరాఖండ్, అసోం రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి.

## ఐసొలేషన్‌లో ఇన్ఫెక్షన్లకు చెక్

**▸▸ ఐఐటీ రోపార్ శాస్త్రవేత్తల డిజైన్**


నెగెటివ్ ప్రెషర్ కలిగిన ఐసోలేషన్ గదిలో కరోనా రోగి నిశ్వాసాలు, దగ్గు, తుమ్ముల ద్వారా వెలువడే వ్యాధికారకాలు వెనక్కి వెళ్లిపోతాయని తెలిపే దృశ్యం

చండీగఢ్/కోల్‌కతా/న్యూఢిల్లీ,ఏప్రిల్ 6: కరోనాపై పోరాడుతున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బందిని ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడేందుకు పంజాబ్‌లోని ఐఐటీ రోపార్ శాస్త్రవేత్తలు నెగెటివ్ ప్రెషర్ రూమ్ డిజైన్‌ను అభివృద్ధిచేశారు. ఈ ఘనతను సాధించిన ప్రొఫెసర్ ధీరజ్ కె.మహాజన్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందాన్ని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ నిశాంక్ అభినందించారు. . ఐసోలేషన్ గదుల్లో చికిత్స పొందుతున్న రోగులు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు నీటి తుంపరల ద్వారా ఆరోగ్య సిబ్బందికి వైరస్ సోకే అవకాశాలు ఉంటాయి. ఆరోగ్య సిబ్బందిని కాపాడేందుకు నెగెటివ్ ప్రెషర్ రూమ్ మోడల్ ఉపయోగపడుతుంది. ఇందులో రోగి ఐసోలేషన్ గదికి అనుసంధానంగా ఒక నెగెటివ్ ప్రెషర్ రూమ్‌ను నిర్మిస్తారు. వెంటిలేషన్ వ్యవస్థ ద్వారా ఐసోలేషన్ గదిలో అత్యధిక పీడనం ఏర్పడుతుంది. రోగి తుమ్ములు, దగ్గుల నుంచి వెలువడే వైరస్‌లు గాలిలో వ్యతిరేక దిశలో ప్రయాణించి.. పక్కనే అనుసంధానమై ఉండే నెగెటివ్ ప్రెషర్‌రూమ్‌లోకి చేరుతుంది. ఫలితంగా ఐసోలేషన్ గదిలో వైరస్‌లు కదలాడే అవకాశమే ఉండదు. అందుబాటులో ఉన్న వస్త్రాలతోనే తయారుచేసుకోగల అతిచౌక మాస్క్ నమూనాను పశ్చిమబెంగాల్‌లోని జాదవ్‌పూర్ వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. కేవలం గంటలోనే కరోనా ఉందో.. లేదో తేల్చేసే నిర్ధారణ పరీక్షల కిట్‌ను గోవా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే మోల్‌బయో డయాగ్నస్టిక్స్ కంపెనీ అభివృద్ధిచేసింది. ప్రతీ పరీక్షకు రూ.1,350 చెల్లించాల్సి ఉంటుంది.

## సెప్టెంబర్ దాకా లాక్‌డౌన్!

**▸▸ సోషల్ మీడియాలో 'నివేదిక' వైరల్.. బోస్టన్ గ్రూప్ ఖండన**

హైదరాబాద్, ఏప్రిల్ 6: భారత్‌లో లాక్‌డౌన్‌ను సెప్టెంబర్ దాకా పొడిగిస్తారన్న వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. భారత్‌లాంటి విశాల దేశంలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలతో వైరస్ నియంత్రణ అసాధ్యమని, విధాన నిర్ణయాలూ ప్రభావశీలంగా లేవని మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ బోస్టన్ కన్సల్టెంగ్ గ్రూప్ (బీసీజీ) రూపొందించిన ఓ నివేదిక పేర్కొన్నట్లు ఆ వార్త సారాంశం. ఇది వైరల్ అయి కొన్ని వర్గాల్లో ఆందోళన రేపింది. జూన్ నెలాఖరుదాకా లాక్‌డౌన్ పొడిగించవచ్చని, దీనికి కారణం జూన్ రెండు, మూడు వారాలకు కరోనా విస్తరణ ప్రబలమై భారత్‌లో పతాకస్థాయికి చేరవచ్చని నివేదిక పేర్కొన్నట్లు వార్తలొచ్చాయి. తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా మీడియా సమావేశంలో ఈ నివేదికను ప్రస్తావించడం విశేషం. అయితే ఈ వార్తలను బీసీజే ఖండించింది. లాక్‌డౌన్ పొడిగింపుపై తామెలాంటి అంచనాలూ వెలువరించలేదని స్పష్టం చేసింది.

### లాక్‌డౌన్‌ను ఉల్లంఘించిన ప్రధాని: ఏచూరి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ చేసిన ప్రసంగం.. పరోక్షంగా లాక్‌డౌన్‌ను ఉల్లంఘించమనేలా ఉందని సీపీఎం అభ్యంతరం వ్యక్తంచేసింది. అత్యవసర సేవల సిబ్బందికి కృతజ్ఞతలు తెలపాలని, పీఎం కేర్స్ ఫండ్‌కు 40 మంది నుంచి విరాళాలు సేకరించాలని బీజేపీ కార్యకర్తలకు మోదీ సూచించారు. ఇది లాక్‌డౌన్ అతిక్రమణకు దారితీస్తుందంటూ సీపీఎం ప్రధానకార్యదర్శి సీతారాంఏచూరి ట్వీట్ చేశారు.

### 17.6% తగ్గిన పెట్రో డిమాండ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: దేశ వ్యాప్తంగా మార్చిలో పెట్రోల్ అమ్మకాలు 17.6 శాతం, డీజిల్ అమ్మకాలు 26 శాతం తగ్గాయి. విమానాలను కూడా నిలిపివేయడంతో ఏవియేషన్ టర్బైన్ ఇంధనం అమ్మకాలు కూడా 31.6 శాతం పడిపోయాయి. 2019 మార్చితో పోలిస్తే పెట్రోల్ అమ్మకాలు 1.943 మిలియన్ టన్నులకు తగ్గాయి. డీజిల్ డిమాండ్ 4.982 టన్నులకు అంటే 25.9 శాతం పడిపోయింది. ఏటీఎఫ్ అమ్మకాలు 4,63,000 టన్నులకు పడిపోయాయి. గ్యాస్‌సిలిండర్లను ఎక్కువ బుక్ చేయడంతో ఎల్‌పీజీ అమ్మకాలు పెరిగాయి.

### చమురు లాభాలు ప్రజలకు పంచండి: కాంగ్రెస్

తగ్గిన ముడి చమురు ధరల ద్వారా వచ్చిన రూ.20 లక్షల కోట్ల లాభంలో కొంత భాగం కరోనాను ఎదుర్కొనే సమయంలో ప్రజల కోసం వినియోగించాలని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ డిమాండ్ చేశారు.

### చికిత్స అందించిన వైద్యులూ క్వారంటైన్‌కు!

బికనేర్, ఏప్రిల్ 6: రాజస్థాన్, పుణెల్లో కరోనా బాధితులకు చికిత్స అందించిన వివిధ ఆస్పత్రుల సిబ్బందిని క్వారంటైన్‌కు తరలించారు. రాజస్థాన్‌లోని బికనీర్‌లో 15మంది వైద్య సిబ్బంది, 20మంది బాధితురాలి కుటుంబీకులు, 15మంది పొరుగువారిని క్వారంటైన్ చేశారు. మహారాష్ట్రలో ఓ వ్యక్తికి చికిత్సచేసిన 42మంది వైద్యులు, 50మంది సిబ్బందిని క్వారంటైన్‌కు పంపారు.

### విద్యార్థుల్లో ధైర్యం నింపేందుకు హెల్ప్‌లైన్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: లాక్‌డౌన్ వేళ విద్యార్థుల మానసిక, సామాజిక సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేయాలని వర్సిటీలు, కాలేజీలకు యూజీసీ సూచించింది. విద్యార్థులకు కేంద్ర ఆరోగ్యశాఖ కూడా ఓ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. అవసరమైన విద్యార్థులు 08046110007 నంబరుకు ఫోన్ చేయొచ్చు. స్కూళ్ల పునఃప్రారంభంపై ఏప్రిల్ 14 తర్వాత పరిస్థితిని సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని కేంద్రం స్పష్టంచేసింది.

### కనికా సేఫ్.. కరోనా తగ్గడంతో డిశ్చార్జ్

లక్నో, ఏప్రిల్ 6: బాలీవుడ్ గాయని కనికా కపూర్ కరోనా మహమ్మారి నుంచి బయటపడ్డారు. వైరస్ తగ్గడంతో ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. మార్చి 20న కనికాకు కరోనా సోకిందని తేలడంతో ఆమెపై అప్పట్లో నమోదు చేసిన కేసులో పోలీసులు ప్రశ్నించే అవకాశం ఉంది.

### సీఏపీఎఫ్ జవాన్ల సెలవులు పొడిగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: కరోనా విజృంభణ నేపథ్యంలో జవాన్లకు సాధారణ తరలింపులు, బదిలీలు, పోస్టింగులు నిలిపేశారు. ఇప్పటికే సెలవులో ఉన్న, ఈ నెల 5లోపు విధుల్లో చేరే సిబ్బంది సెలవులను ఈ నెల 15వరకూ పొడిగించారు. సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, ఎన్ఎస్‌జీ బలగాల్లో సుమారు 10లక్షల మంది జవాన్లు విధులు నిర్వహిస్తున్నారు.

### మహిళలకు రక్షణ కల్పించండి: ఐరాస చీఫ్

ఐరాస, ఏప్రిల్ 6: పలు దేశాల్లో లాక్‌డౌన్‌తో మహిళలపై గృహహింస పెరిగిందని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ తెలిపారు. భారత్‌లో లాక్‌డౌన్ తొలి వారంలోనే గృహహింస కేసులు రెట్టింపయ్యాయంటూ జాతీయ మహిళా కమిషన్ నివేదికను ఉటంకించారు.

### పిల్లలకు డిజిటల్ సమ్మర్ క్యాంప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: లాక్‌డౌన్ నేపథ్యంలో పిల్లల కోసం నెల పాటు డిజిటల్ సమ్మర్ క్యాంప్‌ను పెంగ్విన్ ఇండియా ప్రారంభించింది. దీనిలో రచయితల చర్చలు, మాస్టర్ క్లాసెస్, బిగ్గరగా చదవడం, ఉల్లాసవంతమైన విషయాలు చెప్పడం వంటి సెషన్లు ఉంటాయి.

### తప్పుడు సమాచార వ్యాప్తి.. నలుగురి అరెస్టు

కేందుఝర్, ఏప్రిల్ 6: కరోనాపై సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న నలుగురిని ఒడిసా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేందుఝర్ జిల్లాకు చెందిన నిందితులు, ఒక టీవీ చానెల్ టెలికాస్ట్‌ను ఫొటో తీసి.. మార్పులు చేసి జిల్లాలో పాజిటివ్ కేసు నమోదైందంటూ సోషల్ మీడియాలో అబద్ధాన్ని వ్యాప్తి చేసేందుకు యత్నించారు.

### కరోనా మరణాల్లో వెంటనే బీమా సెటిల్మెంట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: కరోనా మరణాలు సంభవించినప్పుడు బీమా క్లెయిమ్‌లను వెంటనే సెటిల్ చేయాలని లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ సూచించింది. ఈ మేరకు సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ బీమా సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. కరోనా కేసుల విషయంలో మృతుడి కుటుంబీకులను ఆధారాల కోసం ఇబ్బందులకు గురిచేయకూడదని కోరింది.

### సుదీర్ఘ లాక్‌డౌన్‌తో పట్టణ ఉద్యోగులకు షాక్!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: కరోనా వైరస్ మన దేశంలోని వేతన జీవులకు కష్టకాలం తెచ్చిపెట్టింది. దీంతో పట్టణ ప్రాంతాల్లోని మూడో వంతు మంది ఉద్యోగుల ఆదాయం బాగా పడిపోనుందని తెలుస్తోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల్లోని అసంఘటిత రంగ సిబ్బందికి ఆదాయ, ఆర్థిక ఇబ్బందులు తీవ్రతరం కానున్నాయని కేపీఎంజీ నివేదిక పేర్కొంది. మూడు వారాల లాక్‌డౌన్‌ను ఇంకా పొడిగిస్తే.. నిత్యావసరాల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపింది. పర్యాటక, ఆతిథ్య రంగాల్లో 3.8 కోట్ల ఉద్యోగాలు పోవడంతో పాటు 7.5 కోట్ల సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు మూతపడొచ్చని హెచ్చరించింది.

### అమెరికాలో పులికి కరోనా పాజిటివ్

అమరావతి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ జంతువులనూ వదలడం లేదు. అమెరికాలోని న్యూయార్క్‌లో ఓ జూలో పులికి కరోనా సోకింది. న్యూయార్క్‌లోని బ్రోంక్స్ జూలో మలయన్ జాతికి చెందిన నాలుగేళ్ల నదియా అనే ఆడ పులి కరోనా బారిన పడింది. జంతువుల ఆలనాపాలన చూసే ఓ ఉద్యోగి నుంచి పులికి కరోనా వైరస్ అంటుకుని ఉంటుందని భావిస్తున్నారు. ఇక బెల్జియంలో యజమాని ద్వారా పిల్లికి కరోనా వచ్చింది. హాంకాంగ్‌లో ఒక కుక్కకు కరోనా పాజిటివ్‌గా తేలింది. అయితే ఈ జంతువుల నుంచి తిరిగి మనుషులకు వైరస్ వ్యాపిస్తుందనే విషయంలో ఎలాంటి సర్వేలు, నివేదికలు వెలువడలేదు.

**రాష్ట్రంలో వన్యప్రాణులకు వైరస్ సోకకుండా చర్యలు:** పులికి కరోనా వైరస్ వ్యాపించడంతో అటవీ శాఖ అప్రమత్తమైంది. జూలలోని వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేంద్ర అటవీశాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. సెంట్రల్ జూ అథారిటీ సూచనల మేరకు రాష్ట్రంలో విశాఖ, తిరుపతి జంతుప్రదర్శనశాలలతో పాటు అటవీ ప్రాంతంలోని వణ్యప్రాణులపై అటవీ అధికారులు ప్రత్యేక నిఘా పెడుతున్నారు. ముఖ్యంగా 'జూ'లలో జంతువుల కదలికలను గమనించేందుకు సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. వన్యప్రాణులకు పౌష్టికాహారం అందించడంతో పాటు, ఏదైనా అనారోగ్య సమస్యలు గమనిస్తే, వెంటనే వాటి రక్త నమూనాలు సేకరించి, యానిమల్ హెల్త్ ఇనిస్టిట్యూట్‌కు పంపనున్నట్లు రాష్ట్ర అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి ఎన్ ప్రతీప్‌కుమార్ సోమవారం తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.